www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 09 | శుక్రవారం | 05-12-2025 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

జోక్యం చేసుకుని రష్యాను ఒప్పించండి

నింగిలోకి చైనా పునర్వినియోగ రాకెట్ జాక్ – 3

త్వరలో గాజా ప్రణాళిక రెండో దశ

02

## వాయు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రధాని ప్రకటనలు ఆపి సమస్యను పరిష్కరించాలి




05

## మోదీ విధానాల ఫలితమే...

పేదలపై ఆర్థికభారం

రూపాయి పతనంపై కాంగ్రెస్



05

## విదేశీ ప్రముఖులను ప్రతిపక్షనేతను కలవనీయరా?



02

# భీకర ఎన్‌కౌంటర్



- ఛత్తీస్‌గఢ్, బిజాపూర్ అడవుల్లో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య భారీగా ఎదురుకాల్పులు
- మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యం
- ఎన్‌కౌంటర్‌లో18 కి చేరిన సంఖ్య
- ఈ ఏడాదిలో 281 మంది మావోయిస్టులు కాల్చివేత

**బిజాపూర్ (ఛత్తీస్‌గఢ్):** బిజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్ ఘటనలో గురువారం ఉదయం మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించినవారి సంఖ్య 18కి పెరిగింది. వీరితోపాటు పోలీసులవైపు జిల్లా రిజర్వుగార్డు, ఛత్తీస్‌గఢ్ స్టేట్ పోలీస్ యూనిట్‌కు చెందిన చెందిన ముగ్గురు భద్రతా సిబ్బంది కాల్పుల యుద్ధంలో మరణించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పాత్రికేయులకు చెప్పారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 281 మంది నక్సలైట్లను ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు కాల్చి చంపాయని ప్రకటించారు. దాదాపు 12 గంటలపాటు నక్సలైట్లకు, గాలింపు చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలకు మధ్య సుదీర్ఘ కాల్పుల యుద్ధం జరిగిందని, బుధవారం రాత్రి పొద్దుపోయేవరకూ 12 మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కాల్పుల ఘటన తర్వాత ఈ ప్రాంతాన్ని భద్రతా దళాలు గాలిస్తుండగా ఆరుగురు మృతదేహాలు లభ్యమైనట్లు చెప్పారు. దంతెవాడ,బిజాపూర్‌లకు చెందిన జిల్లా రిజర్వు గార్డులు, ప్రత్యేక కర్తవ్య నిర్వహణా బృందాలు, రాష్ట్ర పోలీసు, కోబ్రా దళాలు ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్ని ఎన్‌కౌంటర్లు చేసినట్లు చెప్పారు. పశ్చిమ బస్తర్ డివిజన్, మావోయిస్టు ఏరియా పీపుల్స్ లిబరేషన్ గెరిలా ఆర్మీ) కంపెనీ నెం.2ల కదలికలు ఉన్నాయన్న సమాచారం మేరకు గాలింపు చేపట్టామన్నారు. మా భద్రతా దళాలు చాలా ధైర్యంగా మావోయిస్టుల కాల్పులను తిప్పి కొట్టాయి, కానీ దురదృష్టవశాత్తూ ముగ్గురు ధైర్య వంతులైన సిబ్బందిని కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. మరణించిన నక్సలైట్లలో ఒకరిని మోదియామి వెల్లగా గుర్తించామని, మిగిలిన మృతులను ఇంకా గుర్తించవలసి ఉందన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ మావోయిస్టు కంపెనీ–2 కమాండర్ స్థాయిలో వెల్ల చాలా చురుకైన పాత్ర నిర్వహించేవాడని ఆయన చెప్పారు. భద్రతాదళాలపై జరిగిన అనేక దాడుల్లో అతడు పాల్గొన్నాడని చెప్పారు. 2020లో

తరువాయి 2లో

జిహెచ్‌ఎంసిలో వార్డుల పునర్విభజన

# నేడో రేపో ముసాయిదా నోటిఫికేషన్

- సుమారు 300 వార్డులు ఏర్పడే అవకాశం!
- విలీన ప్రాంతాలకు ఒకే బడ్జెట్



ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) వార్డుల పునర్విభజన ముసాయిదా నోటిఫికేషన్ రెండు మూడు రోజుల్లో వెలువడనుంది. సుమారు 300 వార్డుల వరకు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. భవిష్యత్‌లో ఎన్నికలను ఈ వార్డులతోనే నిర్వహించనున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో నగర శివారులోని 20 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెల్సిందే. జిహెచ్‌ఎంసితో పాటు విలీనమైన మున్సిపల్ సంస్థలకు కలిపి ఒకే 2026–27 వార్షిక బడ్జెట్‌ను రూపొందించనున్నారు. వార్డుల పునర్విభజనతో పాటు విలీనమైన మున్సిపల్ సంస్థలకు ఏకరూప బడ్జెట్ రూపకల్పనతో గ్రేటర్ హైదరాబాద్ రెండు, మూడు కార్పొరేషన్‌లుగా విభజిస్తారనే ఊహాగానాలకు ప్రభుత్వం తెరదించింది. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులతో దేశంలోనే

తరువాయి 2లో



# వ్లాదిమిర్ పుతిన్‌కు ఘనస్వాగతం

నాలుగేళ్ల తర్వాత భారత్‌కు రాక, ప్రధాని మోదీ విందులో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు

నేడు భారత్- రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశం

**న్యూఢిల్లీ :** భారత్ చిరకాల మిత్రదేశం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాలుగేళ్ల తర్వాత రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.40 గంటలకు ఆయన విమానం ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ప్రధాని మోదీ అంతకుముందే అక్కడికి చేరుకున్నారు. పుతిన్‌కు స్వాగతం పలికేందుకు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టారు. స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికారు. విమానాశ్రయంలోనే ఏర్పాటు చేసిన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ తిలకించారు. అనంతరం ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒకే కారులో వెళ్లారు. గురువారం అధికారిక కార్యక్రమాలేవీ లేనప్పటికీ ప్రధాని మోదీ ఆయన గౌరవార్థం రాత్రి విందు ఏర్పాటు

తరువాయి 2లో



## యాసిడ్ దాడి కేసు విచారణలో 16 ఏళ్ల జాప్యమా!

ఢిల్లీ కోర్టు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

అన్ని హైకోర్టుల్లో యాసిడ్‌దాడి కేసుల పెండింగ్ విచారణల వివరాలు 4వారాలోగా అందజేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలను నాలుగు వారాలలోపు అందజేయాలని గురువారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీ కోర్టులో విచారణలో ఉన్న ఒక కేసులో 16 సంవత్సరాల ఆలస్యాన్ని 'జాతీయ అవమానం'గా వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ

తరువాయి 12లో

# ఏడాదిలోపు ఎయిర్‌పోర్ట్



ఆదిలాబాద్‌లో ఎయిర్‌బస్‌లు నడిపిస్తాం

- 700 ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటు
- సిమెంట్ కర్మాగారం నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తాం
- ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/ఆదిలాబాద్



సంవత్సరంలోగా ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఎయిర్ బస్సులను నడిపిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 700 ఎకరాలలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో భూసేకరణకు జీవో జారీ చేశామని తెలిపారు. ఎయిర్ పోర్ట్ కోసం భూమి కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేసేందుకు అంగీకరించిందని, గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

తరువాయి 2లో



## భవిష్యత్తులో హైదరాబాద్ క్వాంటం ఎకానమీ లీడర్

- అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి వనరులు పుష్కలం
- తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా క్వాంటం రోడ్డు మ్యాప్
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్ష/హైదరాబాద్

భవిష్యత్తు క్వాంటం ఎకానమీ లీడర్‌గా హైదరాబాద్ నిలుస్తుందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి అన్ని వనరులు హైదరాబాదులో అనేకం ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ తెలంగాణ రైజింగ్ 2047,

తరువాయి 12లో



## మఖ్దూంభవన్‌కు ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయానికి కృషి చేసినందుకు సిపిఐకి కృతజ్ఞతలు ● రాజకీయ కర్తవ్యాన్ని పూర్తి చేశాం : పల్లా వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో తన విజయానికి కృషి చేసిన సిపిఐకి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అవగాహనలో భాగంగా ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు సిపిఐ మద్దతునిచ్చింది. సిపిఐ విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. దీంతో తన విజయానికి కృషి చేసిన సిపిఐ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు

తరువాయి 12లో

# శిక్షలతో నిందితుల్లో వణుకు

- గంజాయి అక్రమ రవాణపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం
- నాలుగేళ్లల్లో భారీగా డ్రగ్స్, గంజాయి సీజ్

ప్రజాపక్షం/హైదరాబాద్



నేరాలు తగ్గుముఖం పట్టాలంటే నిందితుల్లో భయం రావాలని, చేసిన నేరాలకు శిక్షలు పడితేనే నిందితుల్లో మార్పు వస్తుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలు అమ్మకాలు, రవాణ, వినియోగంపై నార్కోటిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్డిపిఎస్) చట్టంతో నేరస్థులపై చర్యలు తీసుకోవడానికి చట్టంలో వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఎన్డిపిఎస్ యాక్ట్ కింద పోలీసులు, ఎక్సైజ్, టిజిన్యాబ్, నేర పరిశోధన సంస్థలు నిందితులపై దాడులు నిర్వహించి, వారి వద్ద ఉన్న డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేస్తారని వెల్లడించారు. నమోదైన కేసుల్లో నిందితులకు తగిన శిక్షలు పడేవిధంగా చార్జీషీట్, పంచనామా సరిగా రాయడం, సరైన వాంగ్మూలం ఇచ్చే విధంగా చర్యలు చేపడితే నిందితులకు శిక్షలు పడతాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత హైదరాబాద్ డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దాలని

తరువాయి 2లో

## గ్లోబల్ సమ్మిట్‌లో కీరవాణి కచేరి

ప్రజాపక్షం/హైదరాబాద్



'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో అస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తన సంగీత కచేరితో అలరించనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8న ప్రారంభమయ్యే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనే ప్రపంచ ప్రతినిధులను భిన్న సాంస్కృతిక, కళారూపాలు అతిథులను అలరించనున్నాయి. ఈ సమ్మిట్‌లో

తరువాయి 2లో

మూడు ఖండాల మీదుగా ప్రయాణం

## విమానయానంలో చైనా రికార్డు

**షాంఘై:** చైనా నుండి దక్షిణ అమెరికా వరకూ ప్రయాణం చేయడానికి చైనా ఎయిర్‌లైన్స్ సరికొత్త ప్రయాణికుల విమానాన్ని ప్రవేశపెట్టి రికార్డు సృష్టించింది. దీనివల్ల చైనా నుండి దక్షిణ అమెరికాకు ఐదు గంటలు ప్రయాణ సమయం కలిసివస్తుంది. చైనా ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ ఫ్లయిట్




తరువాయి 12లో

కొన్ని ప్రతిపాదనలు

## ఆమోదయోగ్యంగా లేవు

ఫ్లోరిడాలో నేడు ఉక్రేన్ ప్రతినిధులతో విట్‌కాఫ్ భేటీ

**మాస్కో:** ఉక్రేన్‌లో యుద్ధ విరమణపై ట్రంప్ దూతలతో చర్చలు ఎంతో ఉపయుక్తంగా జరిగాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. ఐతే కార్యాచరణ ప్రక్రియ కష్టంగా ఉంటుందని అన్నారు. డిసెంబరు రెండో తేదీన స్టీవ్ విట్‌కాఫ్, కుష్నెర్‌లు పుతిన్‌తో ట్రంప్ శాంతి ప్రణాళికపై చర్చల తర్వాత పుతిన్ పైవిధంగా స్పందించారు. ఈ ప్రణాళికలో కొన్ని ప్రతిపాదనలు తమకు ఆమోదయోగ్యంగా లేవన్నారు. గురువారం ఢిల్లీలో పర్యటనకు


తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చైనా, కజఖస్థాన్, బంగ్లాదేశ్‌లలో భూకంపం

**బీజింగ్:** చైనా,కజఖస్థాన్, బంగ్లాదేశ్ ప్రాంతాలను భూకంపం కుదిపేసింది. కిర్గిస్థాన్ దేశ సరిహద్దులవైపు ఉన్న చైనా వాయువ్య గ్జిన్ జియాంగ్ ప్రాంతంలో ఈ భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై 6.0గా నమోదైంది. కిర్గిస్థాన్‌సరిహద్దుల్లో అక్సి వద్ద భూమిలో10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు భూభౌతికశాఖాధికారులు గుర్తించారు. భవనాలు కూలిపోవడం, ప్రాణనష్టం సంభవించడం వంటి ఘటనలు జరిగినట్లు సమాచారం తెలియరాలేదు. కాగా కజఖస్థాన్‌లోని అతిపెద్ద నగరం అల్మటీని భూకంపంకుదిపేయడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. వీధుల్లోకి పరుగులు తీశారు. స్కూళ్ళు, కార్యాలయాలు, దుకాణాలను ఖాళీచేసి అందరూ రోడ్లమీదకు పరుగులు తీశారు. భూకంపం కారణంగా తురాన్ విశ్వవిద్యాలయంలో పరీక్షలను రద్దుచేశారు. అదేవిధంగా బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో, పొరుగున జిల్లాల్లో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై 4.1 గా నమోదైంది. నర్సింగ్డి ప్రాంతంలో30కి.మీ లోతున భూకంపం కేంద్రం ఉన్నట్లుసంబంధిత విభాగాధికారులు గుర్తించారు.



ముఖాముఖీ భేటీలో జిన్‌పింగ్‌ను కోరిన మేక్రాన్

# జోక్యం చేసుకుని రష్యాను ఒప్పించండి

**బీజింగ్:** ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు వీలుగా జోక్యం చేసుకుని రష్యాపై గట్టి ఒత్తిడి తీసుకురావాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కోరారు. మూడు రోజులు చైనా పర్యటనకు వెళ్ళిన మేక్రాన్ గురువారం బీజింగ్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ప్రపంచ సంక్షోభాలు, వాణిజ్య, దౌత్య సంబంధాలపై సహకరించుకోవాలని వారిద్దరూ ప్రతిజ్ఞ చేశారు. నాయకులు ఇద్దరూ సమావేశంలో ఉక్రేన్ యుద్ధంగురించి,చైనా–ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గురించి ప్రధానంగా చర్చించారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, శాశ్వత శాంతి,స్థిరత్వాల గురించే ప్రధానంగా జిన్‌పింగ్‌తో మేక్రాన్ చర్చించారు. ఐతే మేక్రాన్ చేసిన విజ్ఞప్తిపై జిన్‌పింగ్ ప్రత్యక్షంగా స్పందించలేదు. శాంతికోసం జరిగే అన్ని ప్రయత్నాలకు తమదేశం పూర్తి అండదండలు ఇస్తుందని భరోసా ఇచ్చారు. శాంతి ఒప్పందాన్ని అన్ని పక్షాలు అంగీకరించవలసి ఉంటుందని అన్నారు. చైనా పర్యటనకు ముందుగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఫ్రాన్స్ వెళ్ళి మేక్రాన్ తో సమావేశమై చర్చించారు. ఉక్రేన్‌లో యుద్ధం ఆగిపోయేందుకు వీలుగా చైనా కూడా తనవంతు సహాయం చేయాలని, ఈ విషయంలో జోక్యం చేసుకుని రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని జిన్‌పింగ్‌ను మేక్రాన్ కోరారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ దూతలు డిసెంబరు రెండో తేదీన మాస్కోలో సమావేశమై శాంతి ప్రణాళికపై చర్చించిన తరుణంలో జిన్‌పింగ్‌కు మేక్రాన్ చేసిన విజ్ఞప్తి ప్రాధాన్యం సంతరించుకుంది. ''అంతర్జాతీయంగా శాంతి విచ్ఛిన్నం అవుతోంది, మనం ఎన్నో అపాయాలు ఎదుర్కొంటున్నాం, దశాబ్దాలుగా ప్రపంచ శాంతికి ఆటంకాలు కలుగుతున్నాయి, ఈ పరిస్థితుల్లో చైనా–ఫ్రాన్స్ మధ్య సంభాషణలు గతంకంటే భిన్నంగా చాలా అత్యవసరం'' అని మేక్రాన్ గురువారం చెప్పారు. ''రష్యాను శాంతికి ఒప్పించే విషయంలో చైనా జోక్యం చేసుకుంటుందని నేను ఆశాభావంతో ఉన్నాను.వీలైనంత త్వరలో మా కృషి ఫలించాలి, కనీసం కాల్పుల విరమణ జరగాలి, కీలకమైన, మౌలికమైన ప్రాతిపదిక సౌకర్యాలపై, పౌర సదుపాయాలై దాడులుజరగకుండా నిషేధం విధించాలి, కనీసం దానిని సాధించాలి'' అన్నారు. మొదటినుండీ రష్యాకు మద్దతుగా ఉండే చైనా గాజాలో సంక్షోభంపట్ల కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. గాజాలో మానవతా సహాయానికి మద్దతుగా 100 మిలియన్ డాలర్లు చైనా సమకూర్చనున్నది. ప్రపంచ సంబంధాల్లో చైనా ఇప్పటివరకూ తటస్థవైఖరి అనురిస్తూ వచ్చింది. ఫ్రాన్స్ దేశంతో కూడా రాజకీయ విశ్వసనీయతను చైనా పటిష్టం చేసుకుంటుందని, రెండు దేశాల స్వాతంత్ర్యానికి పూర్తి మద్దతుగా ఉంటుందని చర్చల సందర్భంగా మేక్రాన్‌కు జిన్‌పింగ్ చెప్పారు. కీలక విషయాలలో, ముఖ్యమైన అంశాలలో రెండుదేశాలు పరస్పరం మద్దతు ఇచ్చిపుచ్చుకుంటాయని మేక్రాన్ అన్నారు. ప్రధానంగా వాణిజ్య సంబంధాలపై కూడా చర్చించామని ఆయన చెప్పారు. రెండు దేశాలూ ఆర్థిక సహకారం, గతనతలం, ఏరోనాటిక్స్,అణుఇంధనం, హరిత ఇంధన రంగాలలో సహకారాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయని జిన్‌పింగ్ చెప్పారు.

వచ్చే ఏడాది జి–7 సమావేశాలకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధపడుతున్న తరుణంలో మేక్రాన్ చైనా పర్యటనకు వెళ్ళారు. దీంతో ఇప్పటివరకూ ఆయన నాలుగు సార్లు చైనా పర్యటన చేసినట్లయింది. యూరప్ నుండి చైనాతో వాణిజ్య సంబంధాలను బలంగా పటిష్టం చేసుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్న ఏకైక మొదటి యూరప్ దేశం ఫ్రాన్స్.

## నింగిలోకి చైనా పునర్వినియోగ రాకెట్ జుక్–3



**బీజింగ్:** మళ్ళీ మళ్ళీ ఉపయోగించుకోవడానికి వీలైన ఉపగ్రహ వాహకనౌకను చైనా తయారు చేసింది. చైనాలోని ప్రైవేటు సంస్థ ల్యాండ్ స్పేస్ ఈ పునర్వినియోగ వాహకనౌక జుక్–3ని తయారు చేసింది. పర్యావరణ హానిని తగ్గించే ఈ పునర్వినియోగ వాహకనౌకవైపే ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఈ వాహకనౌక మొదటిసారి గురువారం నింగిలోకి దూసుకువెళ్ళింది. దీంతో ల్యాండ్ స్పేస్‌కు సర్వత్రా ప్రశంసలు లభించాయి. రాకెట్ మొదటి దశలో పనిచేయడంలో సమస్యలు తలెత్తినప్పటికీ రెండోదశ కక్ష్యలోకి నిర్ణీత ప్రదేశంలోకి ప్రవేశించింది. ఈ రాకెట్ బూస్టర్ ల్యాండింగ్‌కు సంబంధించి కొన్ని దిద్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రయోగంపై నాసా స్పందిస్తూ, మొదటి ప్రయత్నంలోనే ఈ ప్రయోగం విజయానికి కొద్ది మీటర్ల దూరానికి చేరుకుందని పేర్కొంది. ఈ ప్రయోగంపై భారత అంతరిక్ష సంస్థ మాజీ శాస్త్రవేత్త జాన్‌పాల్ స్పందిస్తూ, శాస్త్ర ప్రయోగాల్లో విజయాలు వైఫల్యాలూ రెండూ ఉంటాయని, వైఫల్యం నుండే విజయాలు పుట్టుకు వస్తాయని చెప్పారు. వైఫల్యం,విజయం రెండూ లక్ష్యసాధనకు చాలా ముఖ్యమైనవని లక్ష్యం చేరుకున్నా చేరుకోకపోయినా విజయానికి కావాల్సిన పరిస్థితులను అవి సృష్టిస్తాయన్నారు.

## ఇమ్రాన్‌ఖాన్ పార్టీ రాజకీయ కమిటీ రద్దు

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ తన పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ రాజకీయ కమిటీని రద్దుచేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సల్మాన్ అక్రమ్ రాజాకు సంపూర్ణ అధికారాలు ఇచ్చారు. ఒక చిన్న రాజకీయ కమిటీ ఏర్పాటు చేసుకుని పార్టీని నడిపేందుకు ఇప్పుడు పూర్తి అధికారాలు ఆయనకు దక్కాయి. పార్టీలో ఏర్పడిన అంతర్గత వైరుధ్యాల నేపథ్యంలో, ఆయన బాహ్య ప్రపంచానికి అందుబాటులో ఉండకపోవడంవల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకూ పిటిఐ రాజకీయ కమిటీలో 40మంది సభ్యులున్నారు. వారే పార్టీని నడిపించారు. ఇక ఈ కమిటీ రద్దయింది.షాహిద్ కట్టక్‌ను పాకిస్థాన్ జాతీయ అ సెంబ్లీ పార్లమెంటరీ నాయకుడుగా నియమిస్తున్నట్లు ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు. ఎక్స్ వేదిగా ఆయన ఈ ప్రకటన చేశారు. ''మనపార్టీని అణచివేసేందుకు ప్రయత్నాంచేవారితో పార్టీలో కొంతమంది చేతులు కలపడంవిచారకరం, ప్రత్యర్థులతో చేతులు కలిపేవారికి పార్టీలో చోటులేదు'' అని స్పష్టం చేశారు. నేషనల్ డిఫెన్స్ యూనివర్సిటీ ఆతిథ్యం ఇస్తున్న వర్క్‌షాపులో పాల్గొంటున్న అనేకమంది పిటిఐ నాయకులను ఆయన ప్రస్తావించారు. ఇమ్రాన్‌ఖాన్ రావల్పిండిలోని జైలులో 2023 ఆగస్టు నుండి ఏకాంతవాసం గడుపుతున్నారు.

# త్వరలో గాజా ప్రణాళిక రెండో దశ



**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్**

**వాషింగ్టన్:** అతి త్వరలోనే గాజాలో రెండో దశ ప్రణాళికను అమలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడి చొరవతో రూపుదిద్దుకుని కార్యాచరణలోకి వచ్చిన గాజా ప్రణాళిక నిలిచిపోతుందని వస్తున్నవార్తలు, వ్యక్తమతువున్న ఆందోళనమధ్యట్రంప్ బుధవారం పైవిధంగా ఒక ప్రకటన చేశారు. ఐతే ఇప్పటివరకూ గాజా ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని అమలు చేయడానికి ఉద్దేశించి చర్చలు మాత్రమే జరిగాయి. ఈ చర్చల ప్రకారం ఆ మేరకే ఒప్పందం పూర్తయింది. ప్రణాళికలోని రెండోదశ అమలుపై ఇప్పటివరకూ చర్చలు జరగలేదు. ఈ ప్రక్రియ కూడా జరగాల్సి ఉంది. గాజాలో హమాస్–ఇజ్రాయెల్ ప్రభుత్వం మధ్య రెండు నెలలుగా మొదటి దశ కింద ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇజ్రాయెల్‌కు హమాస్ ఉగ్రవాదులు సజీవులైన, నిర్జీవులైన బందీలను అప్పగించారు. అదేవిధంగా ఇజ్రాయెల్ కూడా సజీవులైన, నిర్జీవులైన పాలస్తినా ఖైదీలను గాజా ఆసుపత్రికి స్వాధీనం చేసింది.ఈ ప్రక్రియ పూర్తికావడానికి ముం దుగా ట్రంప్ నిర్దేశించిన గడువు కంటే చాలా ఎక్కువ సమయం పట్టింది. మృతదేహాలను గుర్తుపట్టి, వాటిని తవ్వి వెలికి తీసి ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయడంలో హమాస్ దగ్గరే ఎక్కువగా జాప్యం జరిగింది.ఈ లోపు ఇజ్రాయెల్ కొన్ని వందల సార్లు అంతర్జాతీయ ప్రమాణాలకు విరుద్ధంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. కానీ ఒప్పందంలో అతి ముఖ్యమైన అంశాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. గాజాలోకి స్వేచ్ఛగా ఆహార సరఫరాలను, మానవతా సహాయాన్ని అనుమతించాలన్న నిబంధనను ఐడిఎఫ్ ఉల్లంఘించింది. ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత గురువారం (డిసెంబరు 04) వరకూ 350 మంది పాలస్తీనియన్లను కాల్చి చంపి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. తాజాగా గురువారం (డిసెంబరు 04) జరిగిన దాడుల్లో ఏడుగురు పాలస్తీనియన్లు హతులయ్యారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో పాలస్తీనియన్ల నివాసాలను ధ్వంసంచేసి వారికి వెళ్ళగొట్టింది. దీంతో రెండేళ్ళుగా గాజాలో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 70,125కు పెరిగింది. ఐతే హమాస్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని ఐడిఎఫ్ ఆరోపిస్తున్నది. ఐడిఎఫ్ నియంత్రణలలో లేని యాభైశాతం ప్రాంతంలో హమాస్ బలమైనశక్తిగా ఉందని, ఈ శక్తి ఒప్పంద ఉల్లంఘనలు చేస్తూ మారణహోమం చేస్తోందని ఐడిఎఫ్ ఆరోపిస్తున్నది. ట్రంప్ ప్రకటించిన 20 అంశాల గాజా శాంతి ప్రణాళికపై మొదట అరబ్, ముస్లిం దేశాల నాయకులతో సమావేశాలు జరిపిన అమెరికా అధ్యక్షుడు వారిని మెప్పి ంచారు. ఆ తర్వాత ఈ ప్రణాళిక ము సాయిదాను హమాస్ అగ్రనాయకత్వానికి కూడా అందించారు. హమాస్ అగ్రనాయకత్వం ఈ ప్రణాళికపై చర్చి ంచేందుకుసమావేశమైనప్పుడు వారు న్న భవనంపై ఇజ్రాయెల్ సైనికులు గగనతల బాంబుదాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన అమెరికాసహా అనే క దేశాల ఆగ్రహానికి గురైంది. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రధానమంత్రి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు క్షమాపణచెప్పారు. ట్రంప్ గాజా ప్రణాళికలో అనేక అంశాలను హమాస్ అగ్రనాయకత్వం వ్యతిరేకించింది. కానీ మొదటిదశ ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. రెండోదశ ఒప్పందంఅమలుకుతిరిగి చర్చలు జరపాల్సి ఉంటుందని కూడా హమాస్ ఆనాడే ప్రకటించింది. ఇక ఇప్పుడు ఈ ఒప్పందంలో రెండో దశ అమలుపై హమాస్ కోరినవిధం గా చర్చలు జరపాల్సి ఉంటుంది. ఐతే రెండో దశ ప్రణాళిక అత్యంతకీలకమైనది. ఇందులో హమాస్ నిరాయుధీకరణ,గాజాపరిపాలనకుప్రత్యేక పాలక మండలి ఏర్పాటు, హమాస్ కార్యకర్తలు ఆయుధాలు స్వాధీనం చేయడం, వారుస్వేచ్ఛగా గాజాను వదలివెళ్ళిపోవడానికి అవకాశం ఇవ్వడం, గాజాను నిస్సైనికీరణ మండలంగా మార్చడం వంటి అంశాలు తదుపరి ప్రక్రియతో ముడిపడి ఉన్నాయి.

**ఒప్పందాన్ని సమర్థంగా అమలు చేయాలి : చైనా**

గాజాలో శాంతి ఒప్పందాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చైనా ఆశాభావం వ్యక్తం చేసింది. గాజాలో ఈ ఏడాది అక్టోబరు పదో తేదీ నుండి ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన దగ్గర నుండి కొన్ని వందలసార్లు ఇజ్రాయెల్ సైన్యం ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని పదే పదే గాజా పరిపాలనా యంత్రాంగం మొత్తుకుంటున్న దశలో చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం రోజువారీ పత్రికాగోష్ఠిలో పాత్రికేయుల ప్రశ్నలకు పైవిధంగా స్పందించారు.

## భీకర ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మిన్పాలో జరిగిన ఘటనతోపాటు సుక్మాలో జరిగిన మెరుపుదాడి ఘటనలో కూడా వెల్ల పాల్గొన్నాడని చెప్పారు. ఈ మెరుపుదాడిలో ఆనాడు 17 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. తెకల్‌గూడెం(బిజాపూర్)లో జరిగిన దాడికి బాధ్యుల్లో వెల్ల ఉన్నాడని, 2021లో జరిగిన ఈ దాడిలో 22 మంది భద్రతా సిబ్బంది మరణించారని చెప్పారు. వెల్లను పట్టి ఇచ్చినవారికి రూ.8 లక్షలు నగదు బహుమానం గతంలో ప్రకటించామని సుందర్రాజ్ గుర్తు చేశారు. ఒర లైట్ మెషీన్ గన్, సింగిల్ లోడింగ్ రైఫిల్స్, ఇన్సాస్ రైఫిల్స్, 303 రైఫిల్స్, ఇతర ఆయుధాలు, ఆయుధ సామాగ్రిని ఘటనాప్రదేశాల నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

**మరణించిన భద్రతా సిబ్బందికి నివాళులు**

కాగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన ముగ్గురు భద్రతా సిబ్బంది మృతదేహాలను బిజాపూర్ పోలీస్ లైన్స్‌కు తరలించి అక్కడే అధికారులు నివాళులు అర్పించారు. వారికి నివాళులు అర్పించే కార్యక్రమంలో సుందర్రాజ్‌తోపాటు సిబ్బంది కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. హెచ్ కానిస్టేబుల్ మోను వదది, కానిస్టేబుల్ దుకరు గోండు, జవాన్ రమేశ్ సోధి మరణించినవారిలో ఉన్నారు. వీరంతా బిజాపూర్ నివాసితులే. వారి మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు డిఆర్‌సి సిబ్బంది గాయపడ్డారు.

## కీరవాణి కచేరి

(మొదటి పేజీ తరువాయి)

90 నిమిషాల పాటు కీరవాణి ప్రత్యేక సంగీత కచేరి ఏర్పాటు చేశారు. ప్రముఖ వీణా విద్యాంసురాలు పి.జయలక్ష్మి వీణా కార్యక్రమం, కళా కృష్ణ ఆధ్వర్యంలో పేరణి నాట్యం అతిథులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు తన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. వీటితో తెలంగాణ సంప్రదాయ కళా రూపాలు సందడి చేయనున్నాయి. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి కళలను ప్రతిబించేలా కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళారూపాలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించనున్నారు. డిసెంబర్ 10 నుంచి 13 తేదీ వరకు ఈ వేడుకలను ప్రజలందరూ చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నాలుగు రోజులు రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారని సంబంధిత ప్రభుత్వ అధికారులు తెలిపారు.

## శిక్షలతో నిందితుల్లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు అదేశాలిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని సూచించారు. సిఎం అదేశాలతో ఎక్సైజ్ శాఖ ఎన్డిపిఎస్ మాదవ ద్రవ్యాలను అరికట్టడానికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్వాజ్ ఖాసిం ఇచ్చిన అదేశాలతో ఎక్సైజ్ శాఖ గంజాయి, డ్రగ్స్‌తో పాటు నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారా అమ్మకాలు లేకుండా చర్యలకు ఎక్సైజ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు.

**నాలుగేళ్లలో భారీగా డ్రగ్స్, గంజాయి సీజ్..**

ఎక్సైజ్ శాఖ గత నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో గంజాయి, డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 2021 నుంచి 2025 వరకు 4194 కేసులు నమోదు చేసి, మొత్తం 7131 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు 1824 వాహనాలను సీజ్ చేసి, 24,236 కేజీల డ్రై గంజాయి , 21,035 గంజాయి మొక్కలను సీజ్ చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ పరంగా చూస్తే 2803.13 ఎండిఎంఎ, 689 ఎల్‌ఎస్డి బాస్ట్స్, 46.47 కెజిల హ్యాష్ అయిల్, 383 గ్రాముల కొకైన్,701.3 గ్రాముల హెరాయిన్, 227.6 గ్రాముల ఒపిఎంను పట్టుకున్నామని తెలిపారు.

**ఎక్సైజ్ శాఖలో శిక్షల పురోగతి 3.23 శాతం..**

ఎక్సైజ్ శాఖలో ప్రస్తుతం 2659 గంజాయి, డ్రగ్స్ కేసులు కోర్టుల్లో నడుస్తున్నాయి. తెలంగాణ ఏర్పడిన 2014 నుంచి 2022 వరకు ఎక్సైజ్ శాఖలో 22 కేసుల్లో శిక్షలు పడ్డాయి. 2023 నుంచి 2025 వరకు 49 కేసుల్లో 152 మందికి శిక్షలు పడ్డాయి. ఎక్సైజ్‌శాఖలో 2023లో 16, 2024లో 11, 2025లో రికార్డు స్థాయిలో 22 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. తెలంగాణలో ఇప్పటి వరకు 71 కేసుల్లో నిందితులకు శిక్షలు పడినట్లు రికార్డులు చెబుతున్నాయి. శిక్షలు పడడం చూస్తే ఎక్సైజ్‌శాఖలో 3.23 శాతంగా శిక్షలు పడుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. పోలీస్‌శాఖలో 2.29 శాతంగా ఉందని అధికారులు చెపుతున్నారు. ఎక్సైజ్‌శాఖలో కన్విక్షన్ రేట్‌తో గంజాయి, డ్రగ్స్ నేరస్థుల్లో భయం చోటు చేసుకుందని భావిస్తున్నారు.

**శిక్షలు పడితేనే భయం ఏర్పడుతుంది: షాన్వాజ్ ఖాసిం (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్)**

నేరం చేసినపుడు శిక్షలు పడితేనే నిందితుల్లో భయం ఏర్పడుతుంది. ఈ మధ్య కాలంలో ఎక్సైజ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతుండడం శుభ పరిణామం. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలపై ఎక్సైజ్ శాఖ యంత్రాంగం మరింతగా పని చేసేలా చర్యలు చేపడుతాం.

## ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఆయన పర్యటన సందర్భంగా పుతిన్‌కు ఇష్టమైన వంటకాలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం భారత్ రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాతో భారత్ సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో రష్యాతో ద్వైపాక్షిక వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యం బలోపేతం కానుంది. పుతిన్ భారత పర్యటనను అమెరికా ఐరోపా దేశాలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం అందుకోనున్నారు. పదకొండున్నరకు రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీ సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో భారత్ రష్యా శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో జలాంతర్గామి లీజుకు సంబంధించిన ఒప్పందం కూడా ఖరారు కావచ్చని తెలుస్తోంది. ఆ ఒప్పందం విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లు అని సమాచారం. ఈ జలాంతర్గామి కోసం పదేళ్లుగా జరిగిన చర్చలు ఎట్టకేలకు పుతిన్ భారత పర్యటన సందర్భంగా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

**ఉక్రెయిన్ యుద్ధంపై చర్చ!**

భేటీలో ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొంటారు. రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే రష్యా టుడే న్యూస్ ఛానెల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఇచ్చే అధికారిక విందులోపాల్గొంటారు.

శుక్రవారం రాత్రి 9.30 గంటలకు రష్యాకు తిరిగి పయనమవుతారు. పుతిన్ భారత పర్యటన వేళ దేశ రాజధాని ఢిల్లీ భద్రతా వలయంలోకి వెళ్లింది. స్వట్ బృందాలు, స్నైపర్లను పెద్దఎత్తున మోహరించారు.

## ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనే ఉద్దేశ్యంతో ప్రజల సౌకర్యార్థం 'హిల్ట్ పాలసీ'

**టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్**

**కిషన్ రెడ్డి వ్యాఖ్యలతో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అని తేలిపోయింది**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనే ఉద్దేశ్యంతో, ప్రజల సౌకర్యార్థం 'హిల్ట్ పాలసీ' రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, కానీ ప్రజాపాలన రెండేళ్ల సంబరాల దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ నాయకులు గత పదేళ్ల తెలంగాణను అమ్మేసుకున్నారని, హైదరాబాద్‌లో అడ్డగోలుగా దోచుకుంటే బిజెపి నాయకులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అవుటర్ రింగ్ రోడ్ భూములను ప్రైవేటుపరం చేసినప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యాలతో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అని తేలిపోయిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో విచ్చలవిడితనంగా దోపిడీ జరిగిందని మండిపడ్డారు.హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సామేత రూపంలో దేవుళ్ళ అంశాన్ని ప్రాస్తవిస్తే దీనిని కూడా మత రాజకీయం చేయడం తగదని హితువు పలికారు. కుల, మతం పేరుతో రాజకీయాలను ప్రజలు జీర్ణించుకోలేరన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు తాప త్రయ పడుతున్నామని,హైదరాబాద్‌ను గ్రీన్‌సిటీగా మార్చాలని సిఎం రేవంత్ రెడ్డి తాపత్రయం హిల్ట్ పాలసీని ప్రవేశ పెట్టారని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణమన్నారు. హిల్ట్ పాలసిపైన విమర్శలు చేయడం దారుణమన్నారు. హిల్ట్ పాలసీ వల్లన హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గుతుందని, భూముల ధరలు తగ్గుతాయన్నారు. బాలసుబ్రమణ్యం విషయంలో అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, ఆయన తెలుగు వారని,తెలంగాణ ఆంధ్ర భౌగోళికంగా విడిపోయినప్పటికీ అన్నదమ్ముల తరహా కలిసే ఉందామని, ఎస్‌పి దేశం గర్వించదగిన గాయకుడని అన్నారు. కళాకారులు,సాహిత్యకారులకు కుల మతాలను ఆపాదించడం తగదని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

## ఏడాదిలోపు ఎయిర్‌పోర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, ఖానాపూర్ శాసనసభ్యులు వెద్మ బొజ్జు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పేద ప్రజల ఆశీస్సులతో ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందని, కొమురం భీమ్, రాంజీగోండు స్ఫూర్తితో ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించడమే కాకుండా అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి, నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాబోవు 2 నెలలలో ప్రత్యేకమైన ప్రణాళికలు తీసుకొని ఇక్కడికే వచ్చి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నెలకొన్న సమస్యలపై అధికారులను ప్రజా ప్రతినిధులను ఒక చోట చేర్చి నివేదికలు స్వీకరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోతుమ్మిడి హెడ్డి నుండి చేవెళ్ల వరకు 16 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 38 వేల 500 కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అంచనా కొరకు టెండర్లు పిలవడం జరిగిందని, వ్యవసాయ భూములకు గోదావరి నీటి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని అపారమైన సున్నపు గనులను వినియోగించుకుని సిమెంటు కర్మాగారాలను నెలకొల్పి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని, ఖమ్మంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరిట ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మంజూరు చేసి పనులు ప్రారంభించామని, ఆదిలాబాద్‌లో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం బాద్యత తీసుకుంటుందని తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 700 ఎకరాలలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు భూసేకరణ జి.ఓ జారీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా 40 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఆదిలాబాద్ నుండి కార్యక్రమాన్ని ప్రారంభించాలని, రైతులు తమ పొలాలకు వెళ్లే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. 30 సంవత్సరాలుగా జిల్లాలో మూసి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీని నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం తెరవాలని, కోట్ చనాక ప్రాజెక్ట్ పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన భూసేకరణ పనులు పూర్తి చేస్తే దాదాపు 65 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొమురంభీం ఆదివాసీ కాలనీలో గుడిసెలలో నివసిస్తున్న 2వేల కుటుంబాల వారికి పట్టాలు ఇవ్వాలని, జైనథ్‌లోని లక్ష్మీ నారాయణ ఆలయం, బేల మండలంలో సదల్పూర్‌లో బైరాన్‌దేవ్ శివుని ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు జారీ చేయాలని, రైతులను ఆదుకోవాలని, జొన్న పంటను కొనుగోలు చేయాలని కోరారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, కలెక్టరేట్ భవన సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్, పోలీస్ గృహ సముదాయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం పట్టణ మహిళా సమాఖ్య 160 స్వయం సహాయక సంఘాలకు 19 కోట్ల 69 లక్షల 33 వేల రూపాయల బ్యాంకు రుణం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ ప్రతినిధి పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నేడో రేపో ముసాయిదా నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

గ్రేటర్‌హైదరాబాద్‌అతిపెద్దమహానగరంగాఆవిర్భవించింది

**ఈనెల 27 నాటికి వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తి..**

వార్డుల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసేందుకు గత వారం రోజులుగా జిహెచ్‌ఎంసి యంత్రాంగం తలమునకలైంది. రెండు మూడు రోజుల్లో ముసాయిదా నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది, టౌన్‌ప్లాంగ్ సిబ్బంది సమన్వయంతో వార్డుల పునర్విభజన ప్రక్రియలో పలుపంచుకుంటున్నారు. ముసాయిదా నోటిఫికేషన్ వెలువరించి, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఏడు పని దినాలలో సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. వార్డుల పునర్విభజన ముసాయిదాను ఈనెల 11వ తేదీన జరిగే జిహెచ్‌ఎంసి స్థాయిసంఘం ముందు ప్రతిపాదించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పాలక మండలి సర్వసభ్య సమావేశంలో సైతం ప్రతిపాదనలు ప్రవేశపెట్టనున్నారు. స్థాయిసంఘం, పాలక మండలి సర్వసభ్య సమావేశాలు ఆమోదం తెలిపిన అనంతరం ప్రభుత్వానికి వార్డుల తుది ప్రతిపాదనలను అధికారులు పంపించనున్నారు. వార్డుల పునర్విభజన మొత్తం ప్రక్రియను ఈనెల 27 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని జిహెచ్‌ఎంసి అధికారులు నిర్ధేశించుకున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్) వరకు విస్తరించడానికి వీలుగా తెలంగాణ మునిసిపాలిటీల చట్టం, 2019, జిహెచ్‌ఎంసి చట్టం, 1955 లను సవరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గతంలో ఆమోదించిన మూడు కీలక ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపి నగర విస్తరణకు మార్గం సుగమం చేసిన విషయం తెల్సిందే.

**విలీన ప్రాంతాలతో కలిపి ఒకే బడ్జెట్..**

జిహెచ్‌ఎంసి తన పరిధి విస్తరణకు అనుగుణంగా రాబోయే బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. విలీనం తర్వాత జిహెచ్‌ఎంసి పరిధి మునుపటి 650 చదరపు కిలోమీటర్ల నుండి దాదాపు 2735 చదరపు కిలోమీటర్లకు పెరిగిన నేపథ్యంలో, బడ్జెట్ పరిమాణం కనీసం రూ.2000 నుంచి రూ. 2500 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనగా ఉంది. బడ్జెట్ ప్రతిపాదనలను ఒక వారంలోగా స్టాండింగ్ కమిటీ ముందు ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపడానికి పాలకమండలి సమావేశం జనవరిలో జరిగే అవకాశం ఉంది. పాలకమండలి ఆమోదం పొందిన తర్వాత, ఈ ప్రతిపాదనలను రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చడం కోసం ప్రభుత్వానికి పంపనున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైటెక్స్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే పర్యాటకరంగ వ్యాపార మార్కెట్లలో హైదరాబాద్ అత్యంత శక్తివంతమైన స్థానంలో కొనసాగుతోందని పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ (ఐఐటిఎం) కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎస్‌కెఎఎల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్, ప్రెసిడెంట్ ఎన్‌ఎస్‌ఎన్ మోహన్, టిఎఎఐ అధ్యక్షుడు సునీల్ కుమార్, టిఏఎటి అధ్యక్షుడు లియాఖత్ అలీ, ఎపిఎఫ్‌టిసిసిఐ టూరిజం కమిటీ చైర్మన్ వాల్మీకి కిషన్, యుఎఫ్‌టిసి సమన్వయకర్త సిరాజ్ అన్సారీ, టిఏఎటి ఉపాధ్యక్షురాలు సుజున కుమార్ హాజరయ్యారు.
తెలంగాణ పర్యాటక శాఖ ఆతిథ్యం ఇస్తున్న మూడు రోజుల ఈ కార్యక్రమంలో ఒడిశా, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ అండ్ కాశ్మీర్,మేఘాలయ, జార్ఖండ్ తదితర 20కి పైగా పర్యాటక శాఖలు పాల్గొంటున్నాయి.

### ఆపరేషన్ కగార్ పేరుతో...
# మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్

**గ్రామపంచాయతీ ఎన్నికలలో స్థానికంగా వుంటూ ప్రజలకు సేవ చేసే వారిని గెలిపించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం సుభాష్‌నగర్ సిరిసిల్ల సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దండకారణ్యంలో కొనసాగుతున్న అమాయక గిరిజన ట్రైబల్ నివాస ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి దండకారణ్యంలో మైనింగ్ కార్యక్రమాల కోసం పేద ప్రజల సంక్షేమానికి ముందుండి నడిపే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా పీపుల్స్ వార్ లాంటి అన్ని రకాల మావోయిస్టు పార్టీలను అంతం చేసే కుట్ర జరుగుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, రాజ్యాంగ విలువల్ని తుంగలో తొక్కుతూ, ప్రజా ధనాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నిజాయితీగా ఉండి, స్థానికంగా వుంటూ ప్రజలకు సేవ చేసే వారినే గెలిపించాలని అన్నారు. నిజాయితీతో ప్రజల మేలు కోరే అభ్యర్థులను ఎన్నుకోవలసిన బాధ్యత ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డబ్బున్న వారే ఎక్కువ పోటీల్లో ఉన్నారని అన్ని వర్గాల ప్రజలు పోటీ చేయాలని, చదువుకున్న యువత ముందుకు రావాలని, డబ్బుతో బలంతో అధికారం చేపట్టలేరని, పెన్నుతో సమాధానం చెప్పాలని యువకులకు పిలుపునిచ్చారు. మొన్నటి రోజున తెలంగాణ రాష్ట్రంపై చిన్న చూపు చూసే విధంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార మదంతో ఇష్టం వచ్చిన వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇన్ని రోజులు తెలంగాణలో ఉండి, తెలంగాణలో వేలకోట్ల ఆస్తులు సంపాదించి అధికారం వచ్చి గర్వంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, వడ్డెపెల్లి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల నిరసన

**ఆటో డ్రైవర్లకు గత రెండేళ్లుగా ప్రభుత్వం బకాయిపడ్డ ఆర్థిక సహాయం రూ.24వేలు వెంటనే చెల్లించాలి**

**ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తున్నాం ఆటో డ్రైవర్ల జెఎసి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనట్లయితే డిసెంబర్ 9న హైదరాబాద్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయం ముట్టడితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లు నల్లబ్యాడ్జిలు ధరించి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తారని తెలంగాణ రాష్ట్ర ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి నేతలు హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఆటో డ్రైవర్ల అన్ని సంఘాల యూనియన్ నాయకుల సమావేశం గురువారం హైదరాబాద్ హిమాయత్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశంలో జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం, నేతలు ఎం.ఎ.సలీం (తెలంగాణ జాగృతి), ఈ.ప్రవీణ్ (టియుసిఐ), ఎస్.దయానంద్ (ఐఎన్‌టియుసి), రామ్‌రెడ్డి, (ఐఎఫ్‌టియు), ఎస్.రామ్ కిషన్ (బిఆర్‌టియు), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), పి.యాదగిరి (టిఎన్‌టియుసి), ఎస్.అశోక్, ఎం.కృష్ణ, ఎం.నరసింహ (ఎఐటియుసి) పాల్గొన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తుండగా, ఆటో డ్రైవర్ల సమస్యలపై మొత్తం 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచితే ఇప్పటివరకు కేవలం ఒక్క హామీని మాత్రమే అమలు చేయడం దారుణమన్నారు.
ఆటో డ్రైవర్ల హక్కులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని హెచ్చరించారు.
ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.12వేలు, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రూ.5లక్షల ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలని, 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం (ఆర్ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం) అమలు చేసి, ఆటో డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేశారని, ఆ సమయంలో ఆటోడ్రైవర్ల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ ప్రతి ఏటా రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా, అది నేటికీ అమలు కావడంలేదన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పేరుతో ఘనంగా సంబురాలు చేసుకుంటున్నారని, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేస్తే తాము కూడా ప్రభుత్వంతో కలిసి సంబురాలు చేసుకుంటామన్నారు. వేలాది కోట్ల పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ధనిక రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల హామీలు నెరవేర్చడానికి మార్గం దొరకట్లేదా? అని ప్రశ్నించారు. ఎపిలో మహాకూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రతి యేటా రూ.15 వేలు చెల్లిస్తున్నదని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి సేవలను నిలిపివేసి, వాటి స్థానంలో ప్రభుత్వమే ఒక కొత్త యాప్ తీసుకురావాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు రాష్ట్రంలో 169 మంది ఆటో డ్రైవర్లు మరణించారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫారం-7
(చట్టం-30/2013 లోని సెక్షన్ 19(1) లోని సబ్ రూల్ - 1 రూల్ 25 ప్రకారం)
**తెలంగాణ ప్రభుత్వం**
**కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి వారి డిక్లరేషన్ ప్రచురణ**
**(PUBLICATION OF DECLARATION)**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాజ పత్రం నెం. జేఎస్‌కె/బిహెచ్.పిఎల్/ఎల్.ఎ./34/2025,** **దివి: 22-11-2025**
**శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి వారి ఉత్తర్వులు నెం. జి/681/2024,** **దివి: 20-11-2025**

తెలంగాణ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలము, గూడూరు గ్రామ శివారులోని భూములు విస్తీర్ణము **ఎ.03-23 గుంటల** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం (గూడూరు (పెద్ద చెరువు) ట్యాంక్ బండ్ పొడిగింపు మరియు మెరుగైన నిల్వ సామర్థ్యాన్ని విస్తరించడం) కొరకు గూడూరు గ్రామము, కాటారం మండలము లోని బాధిత కుటుంబాలకు పునరావాస మరియు పునరాశ్రయమునకై ఈ దిగువ చూపిన పట్టా / ప్రభుత్వ భూములు అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకపునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం-2013 లోని సెక్షన్ 19(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది. బాధిత కుటుంబాల పునరాశ్రయ మరియు పునరావాసం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గారిని అడ్మినిస్ట్రేటర్ గా నియమించబడినారు.
కావున జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, గూడూరు గ్రామములోని భూములు విస్తీర్ణము **ఎ.03-23 గుం.** భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం డిక్లరేషన్ ప్రచురణ జారీ చేయనైనది.

**షెడ్యూల్**
**గ్రామం: గూడూరు మండలం: కాటారం జిల్లా: జయశంకర్ భూపాలపల్లి**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి స్వభావం (పట్టా / ప్రభుత్వ) | SDR విస్తీర్ణం (ఎ-గుం.) | పట్టాదారుని పేరు ధరణి రికార్డు ప్రకారంగా (తండ్రి / భర్త) | అనుభవదారు పేరు (తండ్రి / భర్త) | సేకరించు విస్తీర్ణం (ఎ-గుం.) | చెట్లు / నిర్మాణాలు | రిమార్క్స్ |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 33/1 | పి.పి. | 1-34 | జలంపల్లీ రాజ్ కుమార్ తండ్రి రాయమల్లు, పోట్ల భానుమూర్తి తండ్రి ఎల్లయ్య, పోట్ల పోచయ్య తండ్రి ఎల్లయ్య | పోట్ల రాజయ్య తండ్రి ఎల్లయ్య | 00-06 | - | - |
| 2 | | | | | ఇప్పటికే ఉన్న బండ్ | 00-04 | - | - |
| 3 | | | | | సుంకరి మధునయ్య తండ్రి బుచ్చయ్య | 00-01 | - | - |
| 4 | | | | | ఇప్పటికే ఉన్న బండ్ | 00-10 | - | - |
| 5 | | | | | కమ్మగోని సునీత భర్త నరహరి | 00-20 | - | - |
| 6 | | | | | సుంకరి సమ్మక్క భర్త లచ్చయ్య | 00-12 | - | - |
| 7 | | | | | స్ట్రీమ్ | 00-21 | - | - |
| 8 | 33/22 | పి.పి. | 0-14 | సుంకరి మదునయ్య తండ్రి బుచ్చయ్య, సుంకరి లచ్చయ్య తండ్రి బుచ్చయ్య | స్ట్రీమ్ | 00-14 | - | - |
| 9 | 33/50 | పి.పి. | 0-09 | బద్ది సమ్మయ్య తండ్రి లస్మయ్య | సుంకరి మధునయ్య తండ్రి బుచ్చయ్య | 00-04 | - | - |
| 10 | | | | | ఇప్పటికే ఉన్న బండ్ | 00-05 | - | - |
| 11 | 33/51 /1 | పి.పి. | 0-17 | పోట్ల రాజయ్య తండ్రి ఎల్లయ్య | సుంకరి మధునయ్య తండ్రి బుచ్చయ్య | 00-04 | - | - |
| 12 | | | | | పెరుమాండ్ల పొట్టయ్య తండ్రి ఎర్రయ్య | 00-02 | - | - |
| 13 | | | | | పోట్ల రాజయ్య తండ్రి ఎల్లయ్య | 00-03 | - | - |
| 14 | | | | | ఇప్పటికే ఉన్న బండ్ | 00-08 | - | - |
| 15 | 33/52 /1 | పి.పి. | 0-08 | గద్దల రజిత భర్త రాజబాపు | పోట్ల రాజయ్య తండ్రి ఎల్లయ్య | 00-06 | టేకు చెట్లు - 4 | - |
| 16 | | | | | మంతెన బాపు తండ్రి రామయ్య | 00-02 | - | - |
| 17 | 34 | పట్టా | 0-21 | అన్మల సత్యవతి భర్త శంకరయ్య, పార్నోఇన పర్వతాలు తండ్రి మల్లయ్య, సునిత కమ్మగొని భర్త నరహరి | అనుమాల సత్యవతి భర్త శంకరయ్య | 00-18 | - | - |
| 18 | | | | | సుంకరి సమ్మక్క భర్త లచ్చయ్య | 00-03 | - | - |
| మొత్తం విస్తీర్ణం : 03-23 | | | | | | 03-23 | | |

సెక్షన్ 15 చట్టం 30/2013 క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ నిర్మాణం భూసేకరణ ద్వారా ఏ కుటుంబం కూడా ఈ గ్రామంలో నిర్వాసితులు గావించబడరు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి మరియు భూసేకరణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి వారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సం/- భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జయశంకర్ భూపాలపల్లి
సం/- జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి

DIPR RO No. 918/LA/PP/Advt/Pub/2025-26

**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)**
**యూనిట్-1, నాగర్‌కర్నూల్ జిల్లా.**
**Gaz. No. 153/2025**
**సంఖ్య: G2/781/25** **తేది: 07.11.2025**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

**ఫారం. VII**
**(Declaration) రూఢీ ప్రకటన**

నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలములోని పొల్మూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్ లో ఉదహరించిన **ఎ. 0.38 1/2 గుంటలు** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ -28 (MJR-1/MR-15) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు **0.38 1/2 గు.ల** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ -28 (MJR-1/MR-15) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**
**గ్రామము: పొల్మూర్ మండలం: తాడూర్ జిల్లా: నాగర్‌కర్నూల్**

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూమి వర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 304 | పట్టా | మెట్ట | 0.22 | దేసాని గాల్ రెడ్డి తండ్రి వాసుదేవా రెడ్డి (0.22) దేసాని నవకాంత్ రెడ్డి తండ్రి గాల్ రెడ్డి దేసాని గురునాథ్ రెడ్డి తండ్రి గాల్ రెడ్డి | 303 | 306 | 125 | 329 | లేవు | లేవు | బోర్ వెల్ | 0.22 |
| 2 | 306 | పట్టా | మెట్ట | 0.16 | చంద్రమ్మ భర్త రామస్వామి (0.04) పెరుమాల్ల ఉషన్న తండ్రి రాములు (0.08) పెరుమాల్ల ఈశ్వరమ్మ భర్త రామస్వామి (0.01) పెరుమాల్ల వెంకటయ్య తండ్రి రాములు (0.03) కావలి అంజనేయులు తండ్రి వెంకటయ్య పెరుమాల్ల సాయిలు తండ్రి రాములు లక్ష్మి శేరి భర్త మల్లేష్ దేసాని నవకాంత్ రెడ్డి తండ్రి గాల్ రెడ్డి దేసాని గురునాథ్ రెడ్డి తండ్రి గాల్ రెడ్డి దేసాని గాల్ రెడ్డి తండ్రి వాసుదేవా రెడ్డి | 304 | 307 | 125 | 305 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 307 | పట్టా | మెట్ట | 0.00 1/2 | గాని హరిత భర్త కృష్ణ కుమార్ (0.001/2) జాజాల వెంకటయ్య తండ్రి జంగయ్య జాజాల శ్రీనివాసులు తండ్రి జంగయ్య జాజాల తిరుపతయ్య తండ్రి జంగయ్య జాజాల వెంకటమ్మ భర్త నారాయణ | 306 | 308 | 125 | 306 | లేవు | లేవు | లేవు | లేవు |
| మొత్తం: ఎ.0.38 1/2 గుం. | | | | | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.
భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.
సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 909/LA/PP/Advt/Pub/2025-26

### బ్యాంకుల విలీనంతో
# ప్రపంచ దేశాలతో పోటీ సిగ్గుచేటు

**వి.ఎస్.బోస్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశంలో బ్యాంకుల విలీనంతో ప్రజలకు జరిగే మేలు, లాభం ఏమిటో చెప్పకుండా నాలుగు పెద్ద బ్యాంకులను మార్చి ప్రపంచ దేశాలతో పోటీ పడుతామనడం ప్రధాని మోదీ మోసపూరిత చర్య అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. భారతదేశంలోని బ్యాంకులు కూడా అనేక దేశాల బ్యాంకులతో సమతూగాలని చెప్పడంలో మోదీ అంతరార్థం, అభిప్రాయం ప్రజలకు అర్థమవుతుందన్నారు. కార్పొరేట్ సంస్థల పరపతి, అవకాశాలు పెంచడానికి, వారికి అనుకూలంగా బ్యాంకులు పనిచేసేలా చేయడమే మోదీ ప్రధాన ఉద్దేశమనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. నాలుగు పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయడం మూలంగా ప్రజలు దాచుకున్న డబ్బులకు వడ్డీ పెరుగుతుందా? అని ప్రశ్నించారు. ఈ పెద్ద బ్యాంకుల ద్వారా కార్పొరేట్ సంస్థలు ఒకేచోట వారికి కావాల్సిన అధిక మొత్తంలో అప్పు దొరికేందుకు సౌలభ్యం ఏర్పడుతుందన్నారు. ఈ పెద్ద బ్యాంకుల్లో కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులను బ్యాంకు బోర్డులలో నియమించి, తద్వారా కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు చేసేలా ఆ బ్యాంకులను ప్రభావితం చేస్తారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని కార్పొరేట్ సంస్థలు రాజమార్గంలో దోపిడీ చేయడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.
ఉన్న బ్యాంకులను కుదించి, నాలుగు బ్యాంకులుగా కేంద్రీకరించడం మూలంగా ప్రజలకు బ్యాంకు సర్వీసులు అందుబాటులో లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ దురుద్దేశమని మండిపడ్డారు. ఈ నిర్ణయాలతో బ్యాంకులలో అదనపు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడంతోపాటు ఉన్నవారికి పనిభారం పెరిగి, ప్రజలకు చేయాల్సిన సేవలలో అనేక అంతరాయాలు ఏర్పడుతాయని, దీంతో ప్రజలకు ప్రభుత్వ బ్యాంకు సర్వీసులపై విముఖత ఏర్పడి వేరే మార్గాలు అన్వేషిస్తారన్నారు. బ్యాంకులలో ప్రజలు దాచుకున్న డబ్బులకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత లేదని గతంలోనే మోదీ ప్రభుత్వం ఒక చట్టం ద్వారా ప్రకటించిందని, దీంతో ప్రజలందరు వెంటనే ప్రభుత్వ బ్యాంకుల్లో తమ ఎఫ్‌డిఐలను ఉపసంహరించుకోవడంతో ఆ చట్టాన్ని కేంద్రం ఉప సంహరించుకున్నదని బోస్ గుర్తు చేశారు. నాలుగు పెద్ద బ్యాంకుల ఏర్పాటు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బోస్ హెచ్చరించారు.

### జనగామ డిపో ఎడిసి ఉప్పలయ్యపై దాడి చేసిన..
## అసిస్టెంట్ మేనేజర్ (టి)పై చర్యలు తీసుకోవాలి

**ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జనగామ డిపోలో ఎడిసి ఎం.ఉప్పలయ్యపై దాడికి పాల్పడిన సూపర్‌వైజర్ డి.హుస్సేన్ నాయక్ తక్షణమై చర్యలు తీసుకోవాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. ఉప్పలయ్యను డి.హుస్సేన్ నాయక్ అసభ్య పదజాలంతో దూషిస్తూ, కర్కశంగా ప్రవర్తిస్తూ, పెన్నుతో అతని అరచేతిలో పొడిచి తీవ్రంగా గాయపర్చడం దుర్మార్గమన్నారు.
ఎడిసి క్యాష్ అవార్డు పేపర్లపై సంతకాల కోసం ఆ సూపర్ వైజర్ దగ్గరికి వెళ్ళిన సందర్భంగా తన కింది స్థాయి ఉద్యోగులను గౌరవించాలన్న సంస్కారం లేకుండా శాడిస్టులాగా ప్రవర్తించడం దారుణమన్నారు. కొత్తగా సూపర్‌వైజర్లు తన కింది స్థాయి ఉద్యోగులపై మాన్ హాండిలింగ్ చేయటం కాండక్ట్ రెగ్యులేషన్స్ ప్రకారం నేరమని, ఇలాంటి నేరప్రవృత్తి గల డి.హుస్సేన్ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ (టి) జనగామ డిపో వారిని ఉద్యోగం నుండి డిస్మిస్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా డ్రైవర్లు, కండక్టర్లు ఒక చిన్న పొరపాటు చేస్తే సస్పెన్షన్, రిమూవల్ ఫ్రం సర్వీస్ ఉత్తర్వులిచ్చే డిపో మేనేజర్ ఈ సూపర్ వైజర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఈనెల 15న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి

**చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలంటే ప్రస్తుతం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బిసి అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి, బిసిల రాజకీయ చైతన్యాన్ని చాటి చెప్పాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం బిసి జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 15,16వ తేదీలలో చేపట్టబోయే పార్లమెంట్ ముట్టడి వాల్‌పోస్టర్‌ను బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి ఎ కులాల అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం బాగయ్య, సంచార జాతుల సంఘం అధ్యక్షులు కె.విరస్వామిలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేమని, పార్టీపరంగా 60 శాతం ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ మొన్న గాంధీభవంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో గానీ, మక్తల్, కొత్తగూడెం, హుస్నాబాద్‌లలో జరిగిన బహిరంగ సభలో గానీ సిఎం రేవంత్ రెడ్డి గానీ, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌లు ఆ మాటే మాట్లాడడం లేదని, బిసిలను మోసగించడానికి 60 శాతం అంటూ డ్రామాలాడాలని ఆయన మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఈనెల 15వ తేదీన ఢిల్లీలో పార్లమెంట్‌ను ముట్టడించడానికి తెలంగాణ నుండి పార్టీలకతీతంగా వేలాదిమంది ఢిల్లీకి తరలి రావాలని, 16వ తేదీన ఢిల్లీలో జరిగే అఖిలపక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి నేతలు జిల్లాల నరసింహ, కౌలే జగన్నాథం, జాజుల లింగ గౌడ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, తారకేశ్వరి, సంధ్యారాణి, శ్యామల, నరసింహ చారి, గూడూరు భాస్కర్ మేరు, బ్రహ్మ చారి, ఉదయ్ నేత, ఇంద్రమ్ రజక, బండి గారి రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రజల భాగస్వామ్యం

**10 నుంచి 13వ తేదీ వరకు ఫ్యూచర్ సిటీకి ఉచిత బస్సు సౌకర్యం**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజన్ 2047లో ప్రజలను సైతం భాగస్వామ్యం కల్పిస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా పబ్లిక్ ఎగ్జిబిషన్‌ను ద్వారా తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను, గ్లోబల్ విజన్‌ను దగ్గరగా చూసే అద్భుత అవకాశాన్ని కలగజేయనుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజన్ 2047 ఫ్యూచర్ సిటీలో ఈనెల 8న ప్రారంభం కానుండగా, 10 నుంచి 13వ తేదీ వరకు ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించనుంది. ఇందులో పాల్గొనే ప్రజలు భవిష్యత్తు ప్రాజెక్టులకు సంబంధించిన సెషన్లు, ప్రభుత్వ నిపుణులతో సంభాషణలతో పాటు, ప్రభుత్వ శాఖల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించవచ్చు. ఈ 4 రోజుల పాటు ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం ఫ్యూచర్ సిటీకి ప్రతిరోజూ ప్రత్యేక ఉచిత బస్సు సేవలను ఏర్పాటు చేయనుంది.
వెళ్లేందుకు ఈ బస్సులు ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు తిరిగి వచ్చేందుకు సాయంత్రం 4:00 నుండి రాత్రి 9:00 వరకు నడుస్తాయి. బస్సులు ఎంజిబిఎస్, జెబిఎస్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్‌బినగర్ వంటి ప్రధాన కేంద్రాల నుండి అందుబాటులో ఉండనున్నాయి.

TELANGANA RISING GLOBAL SUMMIT DECEMBER 8-9, 2025

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-5**
**NIT No. 24/EE5/SRNR/GHMC/2025-26, తేది: 03.12.2025**
**పని పేరు:** (6) పనుల కొరకు ''క్యాచ్ మరమ్మతులు & లిఫ్ట్ మరమ్మతులు''. **అంచనా వ్యయం:** రూ.51.20 లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 10.12.2025న సా.05.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930602. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11699-PP/CL/ADVT/1/2025-26, Date: 04-12-2025

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**NIT No.** 49, **పని పేరు:** (1) పని కొరకు జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో తుపాను నీటి కాలువ నిర్మాణం. **అంచనా వ్యయం / ఇసివి:** రూ.18.10 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 04.12.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 12.12.2025న మ.2.45గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-IX, (ఆర్‌జెఎస్‌ఆర్), జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11712-PP/CL/ADVT/1/2025-26, Date: 04-12-2025

## రసూల్‌పురం సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మండలం రసూల్ పురం గ్రామ పంచాయతీ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన గుండెబోయిన వెంకన్న యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వార్డు సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం నల్లగొండ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వెంకన్న యాదవ్ మాట్లాడుతూ గ్రామ సర్పంచిగా 2సారి అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఐ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్




**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ఉస్తెల నారాయణరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలపక్షాన సుదీర్ఘ కాలం భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు చేసిన కామ్రేడ్ ఉస్తెల వీరారెడ్డి, నందిరెడ్డి రాంరెడ్డి ఆశయాల సాధన కోసం తాను స్థాన్నిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. చింతలపాలెం గ్రామ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం పాటుపడు తానని అన్నారు. గ్రామ ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మోర్తాల సీతారెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, కాంగ్రెస్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

### సిపిఐ సర్పంచ్ అభ్యర్థి సురిగి ఎల్లమ్మ



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని ఎలగల గూడెం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని సిపిఐ సర్పంచ్ అభ్యర్థి సురిగి ఎల్లమ్మ చలపతి అన్నారు. గురువారం గ్రామంలో సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో సిపిఐ అభ్యర్థి సురిగి ఎల్లమ్మ చలపతిల బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్,కట్కూరు మల్లయ్య, లింగస్వామి,గోపగోని సైదులు,బక్క లక్ష్మయ్య, బక్క యాదయ్య,మాధగోని విజయ్, ఈదులకంటి అరుణమ్మ, కట్కూరి వెంకటమ్మ,కట్కూర్ నరసింహ, వెంకన్న పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియ

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, సాధారణ పరిశీలకులు గౌతమి, సమక్షంలో నిర్వహించారు. గురువారం వీసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆలేరు, ఆత్మకూరు, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 153 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1286 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1441, ఓపీఓలు 1500 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీపీఓ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఎడి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలి తీవ్రత దృష్ట్యా వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిందని పొగమంచు పడే వేళల్లో రాత్రిళ్లు, తెల్లవారుజామున వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని, పొగమంచు ప్రభావం వల్ల రహదారులపై ముందు ఉన్న వాహనాలు కనిపించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నందున జాగ్రత్తగా వాహనాలను నడుపాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో మంచు తీవ్రత వల్ల జిల్లావ్యాప్తంగా 77 రోడ్డు ప్రమాదాలు జరిగి 34 మంది మృత్యువాత పడగా, 94 మంది క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు. చలిలో ప్రయాణం కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురికావచ్చు అందుకు వాహనదారులు రోడ్లపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాహనదారులు లైటింగ్ కండిషన్ చూసుకోవడంతోపాటు తక్కువ వేగంతో డ్రైవ్ చేయాలని, మ్యూజిక్ పెట్టుకోకుండా జాగ్రత్తగా నడుపాలన్నారు. ఓవర్ టేకులు అసలే చేయవద్దని, ఖచ్చితమైన మార్గంలో ఒకే లైన్‌లో వాహనం నడపడం ద్వారా, వాహనాలు మలుపులు తిప్పే సమయంలో ఇండికేటర్‌లను తప్పక వేయాలని, వాహనాల మధ్యలో దూరం పాటించాలని, హారన్స్ వాహన శబ్దాలను గమనిస్తూ వాహనాలు నడిపించాలన్నారు.

## నర్సింహ మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** చామల నర్సింహా మృతి సిపిఐకి అతని కుటుంబానికి తీరని లోటు అని యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ దామర నరసింహా అనారోగ్యంతో మరణించడంతో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, గ్రామ సహాయ కార్యదర్శి జివికలపెల్లి పాండు, బోలగని ఆశోక్‌లు మోటకొండూరు దామర నరసింహ అలియాస్ గద్దర్ మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ దామర నరసింహ గత ఆరు నెలల నుండి నరసింహ బ్రెయిన్ సర్జరీ అయి తన ఇంట్లోనే అనారోగ్యంతో బాధ పడుతూ తుది శ్వాస విడిచాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవికలపల్లి గణేష్, ఎండి వంశీ, గట్టికొప్పల శ్రీధర్, యాదగిరి, బొట్ల యాదయ్య, బీరకాయల మధు, బీరకాయల పరుశురాములు, బోగారం పాండు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం నార్కెట్‌పల్లి పట్టణానికి చెందిన బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ బాణాల భాస్కర్ రెడ్డి,మాజీ వార్డు మెంబర్ చాంద్ పాష తోపాటు పార్టీకి సంబంధించిన సుమారు 50 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వార్డు మెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

# 'స్థానిక'లో ప్రజాపాలనకే పట్టం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాపాలనలో విశేష అభివృద్ధిని ప్రజాకర్షక పథకాలను చూసి అఖండ మెజారిటీతో పట్టం కడతారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పోచంపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో నామినేషన్ల పర్వం పూర్తయిన సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు నివాసంలో గురువారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు నామినేషన్ వేసిన అభ్యర్థులతో ఆయన అంతర్గత సమావేశం ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసిన కాంగ్రెస్ పార్టీలోని అసమ్మతి వాదులతో బుజ్జగింపులు చేసి పార్టీ విజయానికి చిత్తశుద్ధితో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. అధిష్టానం నిర్ణయించిన నేతలని సర్పంచ్ బరిలో నిలవాలని ఆశావహులు పార్టీ కోసం ఉపసంహరణ చేసుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో అత్యధిక సర్పంచ్, వార్డు మెంబర్లు తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని అన్నారు. మండల వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న అన్ని బ్రిడ్జి పనులను ప్రత్యేక బిల్లులు పెట్టి మంజూరు చేయించి పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ మహిళ పథకం దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమని ప్రతి గ్రామంలో ఒక పండుగ వాతావరణంలో ఇల్లు నిర్మించుకొని అన్ని రంగాల కార్మికులకు జీవనోపాధి దొరుకుతుందని తెలిపారు. సన్న బియ్యంతో పేదలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ ప్రజల పక్షాన నిలిచిన ప్రభుత్వమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యను పార్లమెంటులో ప్రస్తావన : ఎంపి

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** 2010 ఆగస్టు 23కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అకస్మాత్తుగా టెట్ పరీక్షను తప్పనిసరి చేయడం వల్ల లక్షలాది ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గురువారం లోక్ సభలో ప్రస్తావించారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక మార్లు స్పష్టం చేసినట్లు ఆ తేదీకి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ వర్తించదని చెప్పడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఈ పరీక్షకు హాజరు కాలేదని ఇప్పుడు వారికి రెండు సంవత్సరాల లోపు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేయడం పూర్తిగా అన్యాయమన్నారు. వారి ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని అలాగే వేలాది సీనియర్ ఉపాధ్యాయుల భవిష్యత్ సంక్షోభంలో పడుతుందని సభ దృష్టికి తీసుకెళ్ళారు. నియమితులైన ఉపాధ్యాయుల హక్కులను రక్షించడానికి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆర్‌టిఈ యాక్ట్ 2009, ఎన్‌సిటిఈ యాక్ట్ 1993లలో తగిన సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆది మూలం వెంకట్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్యలు ఉపాధ్యాయుల సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని వారి ఆందోళనకు దారితీస్తున్న ఈ అంశాల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పోస్టల్ బ్యాలెట్ జాగ్రత్తగా జారీ : కలెక్టర్



**ప్రజాపక్షం/అర్వపల్లి :** రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను జాగ్రత్తగా జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. గురువారం జాజిరెడ్డిగూడెం, నాగారం ఎంపిడిఓ కార్యాలయంలో స్టేజ్ 1, 2 రిటర్నింగ్ అధికారులతో పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మొదటి విడత ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది కొరకు సంబంధిత ఎంపిడిఓ కార్యాలయంలో డిసెంబర్ 6 నుండి 9 వరకు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి స్టేజి 1 ఆర్ఓలు 37ఏ రిజిస్టర్‌లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. స్టేజి 2 ఆర్ఓలు 37సి రిజిస్టర్‌లో ఎన్నికల్లో విధులు నిర్వహించే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఫారం 14తోపాటు సరైన సర్టిఫికెట్స్ జతపరిస్తే మార్క్డ్ కాపీలో మార్క్ చేసి పోస్టల్ బ్యాలెట్ మొదటి నుండి వరస క్రమంలో జారీ చేయాలని వివరించారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయితీలకు 64 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 152 వార్డులకు 343 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. నాగారం మండలంలో 14 గ్రామ పంచాయితీలకు 48 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 132 వార్డులకు 4 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని మిగిలిన 128 వార్డులకు 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కలెక్టర్‌కు ఎంపిడిఓలు వివరించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్‌లు శ్రీకాంత్, హరికిషోర్ శర్మ, ఎంపిడిఓలు ఝాన్సీ, భీమ్‌సింగ్, ఎంపిఓలు గోపి, సుమలత, రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

## డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** చలికాలంలో పొగ మంచు కారణంగా డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ సూచించారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ చలికాలం నేపథ్యంలో పొగమంచు వలన ప్రయాణం సమయంలో రోడ్డు పైన వాహనాలు, పాదచారులు, జంతువులు, సిగ్నల్స్ సరిగ్గా కనిపించవు కాబట్టి ఈ కాలంలో డ్రైవర్లు ముందు ఉన్న వాహనాలు,ఆగి ఉన్న వాహనాలు ఎంత దూరం ఉన్నాయో అంచనావేయడం కష్టం అవుతుందన్నారు. ఈ చలికాలంలో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చునని సూచించారు. ప్రమాదాల నివారణకు గమ్యస్థానానికి వెళ్ళవలసిన క్రమంలో కొద్దిగా ముందుగానే బయలుదేరాలని పొగమంచు వలన ఆలస్యం అయ్యే ప్రమాదం ఉంది కనుక ముందుగా బయలుదేరితే డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తొందరగా వెళ్ళాలనే ఆలోచనను నివారించవచ్చు అన్నారు. ముందుగా ఉన్న వాహనాలు రోడ్ కనిపించకపోవడం వలన వాహనం కంట్రోల్ తప్పే ప్రమాదం ఉందని తెలిపారు. చలికాలంలో రోడ్డు తడిగా ఉండటంవలన వాహనాలు స్కిడ్ అవడం, స్లిప్ అవ్వడం జరుగుతుంది. నిర్దిష్ట స్పీడ్‌తో వాహనాలను నడపడం వలన, స్లిప్పరీ రోడ్ల నుండి వాహనాలు స్కిడ్ కాకుండా నివారించవచ్చని సూచించారు.

## పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

### హరిజన కుటుంబాల భూమిని కాపాడాలి
### సిపిఐ తుర్కపల్లి మండల కార్యదర్శి దుర్గయ్య




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గత వంద సంవత్సరాలుగా తమకు చెందిన భూమిని కొందరు అక్రమార్కులు చేజిక్కించుకోవాలని చూస్తున్నారని, మా హరిజన కుటుంబాల చెందిన భూమిని మాకే ఉండేలా చేయాలని యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని గోపాల్ పూర్ గ్రామ నిరుపేద హరిజన కుటుంబాల బాధితులు అటు జిల్లా, ఇటు మండల అధికారులను వేడుకుంటున్నారని, అక్రమార్కుల పన్నాగం నుండి బైట పడేసి, హరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని తుర్కపల్లి సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధిత హరిజన కుటుంబ సభ్యులతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్ పూర్ గ్రామంలో సుమారు వంద సంవత్సరాల క్రితం 25 గుంటల భూమిలో నివాస గృహాలు ఉండి జీవనం సాగించిన పది హరిజన కుటుంబాలు కొన్ని సంవత్సరాల తర్వాత ఉన్న అవాస గృహాలు కూలిపోయి వేరే దగ్గర ఇండ్లు నిర్మించుకొని నివాసిస్తున్నారని, కాలిగా అట్టి భూమిలో అడపా దడపా సేద్యం చేసుకుంటూ గడుపుతున్నారని, కాగా ఇటీవల కొందరు ఆ భూమి తమదే అని అట్టి భూమిని కొనుగోలు చేశామని చెపుతూ, దౌర్జన్యంగా పంటలను నాశనం చేస్తూ, అడ్డొస్తే బయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని, హరిజన కుటుంబాలను మోసగించి పంచనామాను సృష్టించి భూమిపైకి రావొద్దని బెదిరిస్తున్నారని అన్నారు. వీరికి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర గ్రామస్థులు సహకరిస్తూ ఇటీవల వేసిన ఉలవ చేనును సర్వ నాశనం చేశారని మండి పడ్డారు. పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, హరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. సీపీఐ రాష్ట్ర నాయకులు గోద శ్రీరాములు ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాశబోయిన పెద్దులు, హరిజన కుటుంబాల సభ్యులు మోత్కుపల్లి నరసయ్య, మల్లయ్య, నరసయ్య, రాములమ్మ, ఆగయ్య, యాదగిరి, మల్లేశం, బాలయ్య, బాలమణి, కొండమడుగు రాజయ్య, గద్దకింది రాములు, కనకయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

### యాదాద్రి ఎసిపి శ్రీనివాసు నాయుడు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో సజావుగా జరగాలని యాదాద్రి ఎసిపి శ్రీనివాసు నాయుడు అన్నారు. ఆయన గురువారం మోటకొండూర్ మండలంలోని ఎన్నికల క్లస్టర్ గ్రామాలైన మోటకొండూర్, కాటేపల్లి, చాడ, చందేపల్లి గ్రామాలను సందర్శించారు. ఎన్నికల సమయంలో గ్రామాలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు, పోలీసు సిబ్బంది నిత్యం నిఘా వేసి చూడాలన్నారు. ఎన్నికల సమయాలలో మద్యం, డబ్బులు పంపకాలపై నిఘా పెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అనంతరం మోటకొండూరులోని మహాత్మా జ్యోతిబా ఫూలే గరల్స్ స్కూల్ మరియు కాలేజీలను సందర్శించి విద్యార్థినులకు చట్టాల పై అవగాహనా కల్పించారు. విద్యార్థులకు స్పష్టమైన లక్ష్యాలు మరియు పాత్ర స్పష్టత ఉండాలని, వారి చదువుల్లో కష్టపడి భవిష్యత్లో ఉన్నత స్థానాలు పొందాలని ప్రోత్సహించారు. వారు ప్రేరేపణాత్మక ప్రసంగం చేపట్టి, అత్యవసర సమయంలో పోలీసు సహాయం అం దుబాటులో ఉంటుందని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట రూరల్ సిఐ శంకర్ గౌడ్, మోటకొండూర్ ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లేని మహిళలకు రిజర్వేషన్..

### ఎన్నికలకు దూరంగా పేరూరు గ్రామం!

**ప్రజాపక్షం/హాలియా:** గ్రామ పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్ ప్రక్రియలో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల పలు గ్రామాలు,గ్రామాలలో కొన్ని వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరు గ్రామం ఎస్‌టి మహిళలకు రిజర్వేషన్ ఖరారు అయ్యింది. అయితే ఆ గ్రామంలో ఎస్‌టి మహిళలే లేకపోవడంతో ఈ ఎన్నికలకు ఆ గ్రామం దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పేరూరు, వీర్లగడ తండా కలిపి ఉమ్మడి గ్రామపంచాయతీ గా ఉండేది. కాలక్రమంలో వీర్లగడ్డ తండాను పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ సమయంలో కొన్ని ఓట్లు పేరూరు గ్రామంలోని ఉండిపోయాయి.ఈక్రమంలో రిజర్వేషన్ కేటాయింపుల్లో ఈసారి పేరూరు గ్రామం ఎస్‌టి మహిళకు రిజర్వేషన్ కేటాయింపుల్లో ఖరారు చేశారు. అయితే గ్రామంలో ఉన్న ఎస్‌టి ఓట్లలో ఒక మహిళా ఓటు కూడా లేకపోవడంతో ప్రభుత్వం సర్పంచ్‌కు కేటాయించిన రిజర్వేషన్ మహిళా లేకపోవడంతో అక్కడ పోటీ చేసేవారే కరువయ్యారు.ఈ కారణంగా ఈ గ్రామంలో ఉన్న ప్రజలు ఎన్నికల్లో తాము పోటీ చేయమంటూ ఒకరు కూడా నామినేషన్ వేయకపోవడంతో ఈసారి ఈ గ్రామంలో ఎన్నికలు జరిగే పరిస్థితి లేకుండా పోయింది. అధికారుల తప్పిదం మూలంగా ఈసారి ఈ గ్రామానికి సర్పంచ్ ఎన్నిక నిలిచిపోయింది. అయితే గత నెలలో కేటాయించిన రిజర్వేషన్లలో పేరూరు గ్రామానికి ఎస్‌టి మహిళ వచ్చినప్పుడే గ్రామస్తులు పలు సందర్భాలు జిల్లా కలెక్టర్ దృష్టికి స్థానిక అధికారులకు విజ్ఞప్తులు చేశారు. కానీ ఎవరు దీనిపై స్పందించ పరిస్థితి లేకపోవడంతో ప్రస్తుతం ఇక్కడ ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. ఇదే విషయమై ఎంపీడీవో సుజాత వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎస్‌టి మహిళ లేకపోవడంతో సర్పంచ్ పదవికి నామినేషన్లు రాలేదని చెప్పా రు. ఈ కారణంగా ఎన్నికలు జరిగే పరిస్థితి లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. దీని పై జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్ స్పందించాల్సి ఉంది.

## ఉత్సాహం.. ఉత్కంఠ భరితం...

### ముమ్మరంగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు





**ప్రజాపక్షం/హాలియా:** 51వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ఉత్కంఠ భరితంగా ప్రేక్షకులను అలరిస్తూ కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు రెండో రోజు ఆయా జిల్లాల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠంగా మారి ప్రేక్షకులను అలరించాయి. ముఖ్యంగా మహబూబాబాద్ నల్లగొండ జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.ఈ మ్యాచ్లో రెండో భాగం నల్లగొండ జట్టు మహబూబాబాద్ జట్టుపై పైచేయి సాధించింది. 5413 పాయింట్లు నల్లగొండ జట్టు గెలుపొందింది. మరోపక్క ఖమ్మం కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కూడా ఆద్యంతం రసవతరంగా కొనసాగింది. జోగులాంబ గద్వాల రంగారెడ్డి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ కూడా కబడ్డీ ప్రియులకు మంచి అనుభూతి కలిగించింది.గురువారం రాత్రికి సెమీఫైనల్స్,ఫైనల్స్ నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.


## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ బలపరిచిన గరిక సత్యనారాయణకు సీపీఐ పార్టీ మద్దతు తెలిపి ఆయన గెలుపు కోసం కృషి చేస్తానని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరొద్దిన్, మహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, మొహమ్మద్ అక్రం, సీపీఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, బాలగోని మల్లయ్య, వీరమల్ల వెంకటయ్య, ఉట్కూరి భగవంతు, గంగాపురం యా దయ్య, సీహెచ్.మల్లేష్, ఉట్కూరి కృష్ణ, రమేష్, నరసింహా, శంకర్, మల్లేష్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల విధులపై సమీక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు,ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి సమక్షంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమం లో డిపిఓ వెంకయ్య,జెడ్‌పి సీఈఓ శ్రీనివాసరావు,ఈ జిల్లా మేనేజర్ దుర్గారావు, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ నుండి ప్రేమ్ ర్యాండమైజేషన్ పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అంతర్రాష్ట్ర బస్సులో పట్టుబడ్డ రూ.72 లక్షలు : ఇద్దరు అరెస్టు

**తిరువనంతపురం:** కేరళలోని కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీకేరళ మధ్య నడిచే అంతర్రాష్ట్ర బస్సులో ఈ నగదు గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం పండుగలు సహా కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాదకద్రవ్యాలు, నల్లధనం అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీల్లో అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా.. వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.

## అమెరికా నుంచి 18,822 మంది భారతీయుల బహిష్కరణ

విదేశాంగమంత్రి ఎస్.జై శంకర్
బహిష్కరణ వెనుక మానవ అక్రమ రవాణా కీలక కారణమన్న మంత్రి



**న్యూఢిల్లీ :** అమెరికా దేశ బహిష్కరణ గావించిన భారతీయుల సంఖ్యపై విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టత ఇచ్చారు. 2009 నుంచి ఇప్పటివరకు 18,822 మంది భారత పౌరులను అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించిందని రాజ్యసభకు తెలిపారు. వీటిలో ఈ ఏడాది (2025) జనవరి నుంచి ఇప్పటివరకు 3,258 మందిని వెనక్కి పంపినట్లు పేర్కొన్నారు. గురువారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి అందించిన వివరాల ప్రకారం.. 2023లో 617 మంది, 2024లో 1,368 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. ఈ ఏడాది వెనక్కి వచ్చిన 3,258 మందిలో 2,032 మంది (సుమారు 62.3 శాతం) సాధారణ కమర్షియల్ విమానాల్లో రాగా, మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రత్యేక చార్టర్ విమానాల్లో భారత్‌కు పంపించారు. ఈ బహిష్కరణల వెనుక మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) కీలక కారణంగా ఉందని జైశంకర్ సభకు వివరించారు. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విచారణ జరుపుతున్నాయని, పంజాబ్‌లో ఈ తరహా కేసులు అత్యధికంగా నమోదయ్యాయని తెలిపారు. ఎన్ఐఏ ఇప్పటివరకు 27 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు చేసి, 169 మందిని అరెస్ట్ చేసిందని మంత్రి పేర్కొన్నారు. 132 మందిపై ఛార్జిషీట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 7న హర్యానా, పంజాబ్‌లో ఇద్దరు కీలక ట్రాఫికర్లను, అక్టోబర్ 2న హిమాచల్ ప్రదేశ్‌లో మరో ఇద్దరిని ఎన్ఐఏ అరెస్ట్ చేసిందని జై శంకర్ వివరించారు.

## వాయు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

### ప్రధాని ప్రకటనలు ఆపి సమస్యను పరిష్కరించాలి

ప్రతిపక్ష నేతలు డిమాండ్ : పార్లమెంట్ వెలుపల నిరసన ప్రదర్శన




**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన రోజు నుంచి ప్రతిపక్షాల పార్లమెంట్ కాంప్లెక్స్ వెలుపల రోజుకో సమస్యపై నిరసన ప్రదర్శన వ్యక్తం చేస్తున్నాయి. తొలుత రెండు రోజులు ఎస్ఐఆర్‌పై, ఆ తరువాత లేబర్ కోడ్‌లపై నిరసన తెలిపారు. తాజాగా గురువారం దేశ రాజధాని ఢిల్లీలో రోజు రోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యంపై వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. వాయు కాలుష్యంపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ప్రకటనలు చేయడం ఆపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతపట్టుకుని, వివిధ ప్రతిపక్ష నాయకులు పార్లమెంటు మకర్ ద్వార్ వెలుపల నినాదాలు చేశారు. కొంత మంది ఎంపిలు వాయు కాలుష్య సమస్యను ఎత్తిచూపడానికి ముసుగులు ధరించి నిరసనలో పాల్గొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభంలో ప్రధాని మోదీ 'మౌసం కా మజా లిజియే' (వాతావరణాన్ని ఆస్వాదించండి) అంటూ చేసిన వ్యాఖ్యలను రాసిన, ప్రధాని ఫోటో కలిగిన పెద్ద బ్యానర్‌ను కూడా వారు ప్రదర్శించారు. వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని నిరసనలో పాల్గొన్న వివిధ పార్టీల ఎంపిలు డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'కాలుష్యకారులు జరిమానాలు చెల్లించేలా చేయండి..పౌరులను కాదు, 'గాలి నాణ్యతపై ఇప్పుడే చర్య తీసుకోండి', 'మా భవిష్యత్తును ఉక్కిరిబిక్కిరి చేయవద్దు', 'స్వచ్ఛమైన గాలి ఒక హక్కు, విలాసం కాదు' అనే పోస్టర్లను ప్రదర్శించారు. 'పిల్లలు చనిపోతున్నందున ఏదైనా చేయడం ప్రభుత్వ బాధ్యత. నాలాంటి వృద్ధులు కూడా దీని కష్టంగా భావిస్తున్నారు' అని సోనియా గాంధీ నిరసనలో పాల్గొన్న తర్వాత విలేకరులతో అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కూడా నిరసనలో పాల్గొన్న ప్రతిపక్ష నాయకులలో ఉన్నారు. 'కలుషితమైన గాలిపై మా ప్రశ్న... ఈ నగరంలోని ప్రతి ఒక్కరూ ఎందుకు ఇబ్బందికరంగా కనిపిస్తున్నారు. మోదీ జీ ప్రతిస్పందన 'వాతావరణాన్ని ఆస్వాదించండి'. విషపూరిత గాలి పట్ల బిజెపి ఉదాసీనతకు వ్యతిరేకంగా పార్లమెంటులో మా నిరసన' అని ఖర్గే తరువాత ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో నిరసన వీడియోను పంచుకుంటూ అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ ఈ అంశంపై రాజకీయం కాని చర్చ, నిర్దిష్ట చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. వాతావరణ కాలుష్యం రాజకీయ సమస్య కాదు, ప్రభుత్వం నిర్దిష్ట చర్య తీసుకోవాలి, తామందరూ ప్రభుత్వానికి అండగా ఉన్నామని, ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. 'వాతావరణాన్ని ఆస్వాదించండి' అని ప్రధాన మంత్రి ప్రధాని వ్యాఖ్యలను ఆమె విమర్శిస్తూ, ఢిల్లీలో, పిల్లలు, వృద్ధులు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారన్నారు. ప్రతి సంవత్సరం పరిస్థితి మరింత దిగజారుతుంది, కానీ ప్రభుత్వం ఎటువంటి నిర్దిష్ట చర్యలు తీసుకోదు, కేవలం ప్రకటనలు జారీ చేస్తుందని మండిపడ్డారు. దీపావళి తర్వాత ఢిల్లీ గాలి నాణ్యత సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

## వేతనాలు పెంచాలంటూ 108 ఉద్యోగుల ధర్నా



**గువహటి:** న్యాయమైన వేతనాలు ఇవ్వాలని, తమ ఉద్యోగాల్ని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ అసోంలోని 108 మత్యుంజయ ఎంప్లాయిస్ అసోసియేషన్ గురువారం ధర్నా చేపట్టింది. తమ న్యాయమైన కోర్కెలని హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ... వారు ఆందోళన బాట పట్టారు. అర్ధనగ ప్రదర్శన చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రాంజల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ... 'తాము రోజూ 12 గంటలు పని చేస్తాం. కానీ 10 గంటలకే మేము జీతం పొందుతాము. సెలవు దినాల్లో లేదా అత్యవసర సమయాల్లో కూడా మేము విధుల్లో ఉంటాము. అయినా మాకు ప్రభుత్వం వేతనం పెండం లేదు'. మాకు న్యాయంగా జీతాలివ్వాలి. మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలి. అదే మా డిమాండ్' అని ఆయన అన్నారు.

## విషవాయువు లీక్.. ఇద్దరు మహిళల మృతి

**రాంచీ:** జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో భూగర్భ గనుల నుంచి విషపూరిత వాయువు లీకవడంతో ఇద్దరు మహిళలు మరణించగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విష వాయువు వెలువడుతుండడంతో ఆ ప్రాంతంలోని ప్రజలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్)కు చెందిన భూగర్భ గని నుంచి కార్బన్ మోనాక్సైడ్ అనే విషవాయువు లీక్ అయింది. దీంతో కెందువాడి బస్తీ కొందరు అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు మహిళలు మరణించినట్లు తెలుస్తున్నది. దీంతో ధన్‌బాద్‌రాంచీ రహదారిని ఆ ప్రాంతవాసులు దిగ్బంధించారు. రోడ్డుపై టైర్లు కాల్చి నిరసన తెలిపారు. మరో వైపు భూగర్భ గని నుంచి విష వాయువు లీక్ కావడంపై బీసీసీఎల్ కంపెనీ స్పందించింది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కోనేందుకు మూడు అంబులెన్స్‌లను అక్కడ సిద్ధంగా ఉంచింది. అక్కడి నుంచి ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని ఆ ప్రాంతవాసులకు సూచించింది. సమారు వెయ్యి మందికిపైగా ప్రజలు వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని కోరుతూ వారి ఇళ్ల గోడలకు ఆ కంపెనీ నోటీసులు అంటించింది. నివాసితులను సురక్షితమైన ప్రదేశాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏరియా మేనేజర్ తెలిపారు.

## ఆత్మాహుతి దళంలోకి మహిళలు 5 వేల మందికి జైషే శిక్షణ

**న్యూఢిల్లీ :** ఇటీవల దిల్లీ పేలుడు కుట్రలో కీలకంగా వ్యవహరించిన డా. షాహీన్ జైషే మహమ్మద్ మహిళా విభాగం 'జమాత్ ఉల్ మొమినాత్' సభ్యురాలని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా ఇప్పటి వరకు ఈ విభాగంలో 5వేల మందికి పైగా చేరినట్లు తెలిసింది. ఈ విషయంపై జైషే చీఫ్ మసూద్ అజార్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఉగ్ర సంస్థ ఉనికిని బలోపేతం చేయడం, మహిళలను నియమించుకొని దాని పరిధిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 8 నుంచి జైషే ప్రధాన కార్యాలయంలో ఇందులో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, కొట్లీ, ముజఫరాబాద్ ప్రాంతాల నుంచి మహిళలను నియమించుకున్నట్లు తెలిపాయి. వీరికి ప్రతిరోజూ 40 నిమిషాల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారట. ఐసిస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహా లో మహిళలతో ఆత్మాహుతి దాడులకు సిద్ధమయ్యేలా వీరిని నిఘా వర్గాలు పేర్కొన్నాయి.

## లోక్‌సభలో సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో 'సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు2025' బిల్లు ఆమోదం పొందింది. పొగాకు, దానితో తయారయ్యే ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. జీఎస్టీ పరిహార సెస్సు ముగిసిన తర్వాత నుంచి చట్టం అమలయ్యేలా బిల్లును ప్రతిపాదించారు. సిగరెట్లు, చుట్టలు, హుక్కా, జర్దా, నమిలే పొగాకుపై ప్రస్తుతం 28% జీఎస్టీతో పాటు వేర్వేరు రేట్లతో సెస్సు ఉంది. త్వరలో ముడి పొగాకుపై 60 70 శాతం ఎక్సైజ్ డ్యూటీ పడనుంది. సిగరెట్లు, చుట్టలపై 25% ఉంటుంది. లేదంటే ప్రతి వెయ్యి చుట్టలకు రూ.5,000 చొప్పున పడుతుంది. పొడవు, ఫిల్టర్ ఆధారంగా ప్రతి వెయ్యి సిగరెట్లకు రూ.2,700 నుంచి రూ.11,000 వరకు విధిస్తారు. నమిలే పొగాకు విషయంలో ఇది కిలోకు రూ.100 ఉంటుంది. కాగా, బిల్లుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఇది సెస్సే తప్ప, అదనపు పన్ను కాదని తెలిపారు. పరిహార సెస్సు ఖాతా కింద చెల్లించాల్సిన రుణ బాధ్యతలు తీరిపోయాక సెస్సు ముగుస్తుందన్నారు. కోవిడ్ సమయంలో పడిపోయిన ఆదాయ భర్తీకి రాష్ట్రాలు తీసుకున్న రుణాలన్నీ మరో రెండువారాల్లో తీరిపోతాయని... అప్పుడు పరిహార సెస్సు ఉండదన్నారు. అందువల్ల మునుపటిలా ఎక్సైజ్ రావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇలా వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె తెలిపారు. ఇది సెస్సే తప్ప, అదనపు పన్ను కాదని ఆమె వివరించారు. పరిహార సెస్సు ముగిశాక కూడా అయోగ్య వస్తువులపై (డీమెరిట్ గూడ్స్‌పై) పన్ను కొనసాగుతుందని చెప్పారు. "గరిష్ఠంగా 40% చొప్పున జీఎస్టీ ఉంటుంది. ఒకవేళ ఎక్సైజ్ సుంకం వేయకపోతే పొగాకు ఉత్పత్తులపై నికర పన్ను ఇప్పుడున్న స్థాయి నుంచి తగ్గిపోతుంది. అలా జరగకుండా చూడటమే బిల్లు ఉద్దేశం" అని తెలిపారు. అయితే పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచడం మంచిదే అయినా ఆ పంట సాగుమీద క్కో మహిళ నుంచి రూ.500 చొప్పున విరాళాల కింద సేకరిస్తున్నట్లు సమాచారం.ఆధారపడినవారిపై పడే ప్రభావాన్నీ దష్టిలో పెట్టుకోవాలని కొందరు సభ్యులు ప్రభుత్వానికి సూచించారు. పొగాకుపై 60 లక్షల మంది రైతులు, రెండు కోట్ల మంది కూలీలు ఆధారపడ్డారని... పన్నుల్లో మార్పులు చేసేటప్పుడు రైతుల ప్రయోజనాలనూ దష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## ఇండిగో సంక్షోభం యధాతథం ఆగిన విమాన సర్వీసులు

రంగంలోకి పౌర విమానయాన శాఖ
ప్రయాణికుల ఇక్కట్లు... ఆగ్రహం

**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతమవుతున్న ఇండిగో... నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులు రద్దు చేసినట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతేకాకుండా కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. దిల్లీ, ముంబై, హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్టుల వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో క్షమాపణలు కోరింది. అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వెలిబుచ్చారు. విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహం తో సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి.




## మోదీ విధానాల ఫలితమే...

● పెరగనున్న ద్రవ్యోల్బణం పేదలపై ఆర్థికభారం ● రూపాయి పతనంపై కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** కేంద్రంలోని నరేంద్ర మోదీసర్కారు అవలంబిస్తున్న అసమర్థ ఆర్థిక విధానాల వల్ల ప్రపంచంలో భారత కరెన్సీ రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో పడిపోయిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. గురువారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు సరైనవి అయితే రూపాయి పడిపోయేది కాదన్నారు. ఈ పరిణామం దేశ ఆర్థిక పరిస్థితి బాగోలేదని స్పష్టం చేస్తోందన్నారు. 'మనం ఏది కావాలంటే అది చెప్పుకోవచ్చు, ఎంతైనా పొగడవచ్చు. కానీ రూపాయి పతనం దేశ నిజమైన ఆర్థిక పరిస్థితిని వెల్లడిస్తుంది. ప్రపంచంలో మా కరెన్సీకి విలువ లేదని ఇది స్పష్టం చేస్తోంది' అన్నారు. 2014కు ముందు రూపాయి విలువ ఎందుకు పడిపోయిందో సమాధానాలు చెప్పాలని మోదీ ప్రశ్నించారు. ఈ రోజు తాము కూడా ప్రధాని మోదీని అదే ప్రశ్న వేస్తున్నామని... దీనికి ఆయన సమాధానం చెప్పి తీరాలని ఖర్గే డిమాండ్ చేశారు.

**రూపాయి విలువ ప్రధాని వయసును దాటిపోయింది**

కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ రూపాయి విలువ పడిపోవడంపై వ్యంగ్యంగా స్పందించారు. ప్రస్తుతం మన రూపాయి విలువ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వయసును దాటిపోయిందని ఎద్దేవా చేశారు. 2013లో రూపాయి విలువ పడిపోతుందని బీజేపీ నాయకుడు రవిశంకర్ చేసిన విమర్శలను గుర్తు చేస్తూ... రూపాయి విలువ పై రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ వయసులను పోల్చుచూ రవిశంకర్ వ్యంగ్య వ్యాఖ్యానాలు చేశారన్నారు. ఇదే విషయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో రూపాయి పడిపోయినప్పుడు బీజేపీ చేసిన విమర్శలను గుర్తుచేశారు. 'అప్పుడు విమర్శించారు కదా ఇప్పుడు వారి సమాధానంసమాధానం ఏమిటి?' అని ప్రియాంక గట్టిగా ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ప్రజలపై ఆర్థికభారం**

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ తీవ్రంగా క్షీణించడంపై రాజ్యసభ కాంగ్రెస్ సభ్యుడు వివేక్ కె తంఖా గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ కరెన్సీ పడిపోవడం సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపిందన్నారు. సభలో జీరో అవర్ సందర్భంగా ఈ విషయాన్ని లేవనెత్తుతూ రూపాయి 90 డాలర్ల స్థాయిని అధిగమించిందని, భారత చరిత్రలోనే ఇంతలా పతనమవడం ఇదేనన్నారు. "నేను చాలా సందర్భోచిత విషయం పై మాట్లాడుతున్నాను. భారత రూపాయి స్వేచ్ఛగా పతనం కావడం అంటే సాధారణ భారతీయులకు ఆర్థిక బాధలు పెపెరుగుతున్నాయని అర్థం. రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే 90 డాలర్లను దాటి పడిపోయింది. భారత చరిత్రలో అత్యంత బలహీన రికార్డు ఇది" ఆయన అన్నారు. కేవలం ఐదేళ్లలో రూపాయి దాని విలువ నుండి 20 నుండి 27 శాతం కోల్పోయిందని, ఈ ఏడాది మాత్రమే రూపాయి విలువ 5 శాతం పడిపోయిందని తెలిపారు. ఇది 2022 తర్వాత అత్యంత దారుణంగా ఉందన్నారు. 2025లో ఆసియాలో అత్యంత చెత్తగా పనితీరు కనబరిచిన కరెన్సీగా నిలిచిందని సభ దృష్టికి తెచ్చారు. ఒకే నెలలో భారతదేశం 40 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లోటును నమోదు చేసిందని, ఇది ఎగుమతుల కంటే దిగుమతులను ఎంత లోతుగా అధిగమిస్తుందో తెలియజేస్తుందని తెలిపారు. అలాగే, విదేశీ పెట్టుబడిదారులు ఈ సంవత్సరం భారత మార్కెట్ నుండి 17 బిలియన్ డాలర్లకు పైగా ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఇది గడచిన కొన్ని సంవత్సరాలలో అతిపెద్ద నిష్క్రమణ అని చెప్పారు. రూపాయి బలహీనపడటం దిగుమతుల ఖర్చును పెంచుతుందని, ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందన్నారు. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలను, అలాగే సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రభావితం చేస్తుందని తంఖా అన్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, వైద్య పరికరాలతో సహా ప్రతిదీ ఖరీదైనదిగా మారుతుందని తెలిపారు. అలాగే, వస్త్రాలు, రసాయనాలు, ఇంజనీరింగ్ వంటి అనేక ఎగుమతి రంగాలు దిగుమతి చేసుకున్న మధ్యవర్తులపై ఎక్కువగా ఆధారపడటం వలన ఎగుమతిదారులు పెద్దగా ప్రయోజనం పొందరు.

## కోవర్టుల కారణంగానే హిడ్మా ఎన్‌కౌంటర్

### మావోయిస్టుల ఆరోపణ



**ప్రజాపక్షం/ఖమ్మం:** కోవర్టుల కారణంగానే మావోయిస్టు నేత హిడ్మా పోలీసులకు చిక్కాడని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. పోలీసులు హిడ్మాను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్ కథ అల్లారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. గత నెల 27న వికల్ప్ పేరుతో మావోయిస్టులు విడుదల చేసినట్లుగా చెబుతున్న లేఖ ఇప్పుడు బహిర్గతమైంది. లేఖలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హిడ్మాను అతనితో పాటు మరో ఐదుగురిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు గత నెల 15న అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి 18న ఎన్‌కౌంటర్ కథ అల్లారని లేఖలో ఆరోపించారు. హిడ్మా అక్టోబర్ 27న విజయవాడకు వెళ్లారన్నారు. నవంబర్ తొమ్మిదిన మావోయిస్టు పార్టీకి చెందిన కోసాల్ పారిపోయి పోలీసులకు లొంగిపోయాడని అతనితో పాటు విజయవాడకు చెందిన కలప వ్యాపారి, ఒక బిల్డర్ ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేశారని లేఖలో పేర్కొన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మరుసటి రోజు మరో ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు పోలీసులు చెప్పారని కానీ వారిని కూడా తీసుకు వచ్చి కాల్చి చంపారన్నారు. వైద్యం కోసం వచ్చిన హిడ్మాను తిరిగి తాము రమ్మని చెప్పే లోపే ఘటన జరిగిపోయిందని వికల్ప్ తెలిపారు. పోలీసుల అదుపులో మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ, మల్లా రాజీరెడ్డి లు ఉన్నట్లు ప్రచారం జరుగుతుందని ఇది నిజం కాదని వికల్ప్ తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలను కాపాడుకునేందుకు పోలీసులతో ఎటువంటి ఒప్పందం చేసుకోలేదని ఆయన తెలిపారు.

## విదేశీ ప్రముఖులను ప్రతిపక్ష నేతను కలవనీయరా?

అభద్రత వల్లేనని కేంద్రంపై రాహుల్‌గాంధీ మండిపాటు
గత సంప్రదాయాన్ని తుంగలో తొక్కిందని విమర్శ

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం విదేశీ ప్రముఖులను ప్రతిపక్షనేతను కలవనీడయం లేదని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. భద్రతను కల్పించడంలో వైఫల్యం చెందుతుండడం వల్లే ఈ విధంగా చేస్తోందని విమర్శించారు. భారత్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల విచ్చేసిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. విదేశీ ప్రముఖులను సందర్శించే వారు ప్రతిపక్ష నాయకుడిని కలవడం ఒక సంప్రదాయమని, కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నియమాన్ని పాటించడం లేదని మండిపడ్డారు. 'సాధారణంగా విదేశాల నుండి వచ్చే వారు ప్రతిపక్ష నాయకుడితో సమావేశం కావడం సంప్రదాయం. ఇది (అటల్ బిహారీ) వాజ్‌పేయి జీ కాలంలో, మన్మోహన్ సింగ్ జీ కాలంలో జరిగేది. ఇది ఒక సంప్రదాయం, కానీ ఈ రోజుల్లో జరిగేది ఏమిటంటే విదేశీ ప్రముఖులు వచ్చినప్పుడు, నేను విదేశాలకు వెళ్ళినప్పుడు, ప్రభుత్వం వారికి ప్రతిపక్ష నాయకుడిని కలవవద్దని సూచిస్తుంది' అని రాహుల్‌గాంధీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. ఇది వారి విధానమని, వారు ప్రతిసారీ ఇలాగే చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను విదేశాలకు వెళ్ళినప్పుడు, అక్కడి ప్రముఖులు ఇక్కడికి వచ్చినప్పుడు వారు ఇలాగే చేస్తారని, ప్రభుత్వం 'మిమ్మల్ని కలవవద్దని' చెప్పిందని వారికి చెప్పబడిందని తమకు సందేశం వస్తుందన్నారు. ఇటువంటి సమావేశాల ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, ప్రతిపక్ష నాయకుడి మరొక దృక్పథాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. 'మేము భారతదేశానికి కూడా ప్రాతినిధ్యం వహిస్తాము, ప్రభుత్వం మాత్రమే భారతదేశానికి ప్రాతినిధ్యం వహించదు. ప్రతిపక్ష నాయకులు విదేశీ నాయకులను కలవాలని ప్రభుత్వం కోరుకోవడం లేదు. ఇది ఒక సంప్రదాయం (ప్రతిపక్ష నాయకుడిని కలవడానికి విదేశీ ప్రముఖులను సందర్శించడం), ఒక నియమం, కానీ మోదీజీ ఈ నియమాన్ని పాటించరు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నియమాన్ని పాటించదు' అని పుతిన్ పేరు చెప్పకుండానే గాంధీ అన్నారు. ప్రభుత్వం ఎందుకు అలా చేస్తోందని రాహుల్‌ను ప్రశ్నించగా, 'ఇది వారి అభద్రత' అని ఆయన అన్నారు. తన సోదరుడి అభిప్రాయాలను ఏకీభవిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. భారత్‌ను సందర్శించే ప్రముఖులు ప్రతిపక్షనాయకుడిని కలవడం ఒక ప్రోటోకాల్ అని అన్నారు. 'ఈ ప్రభుత్వ విధానాలన్నీ ఒకే సూత్రంపై ఆధారపడి ఉన్నాయి. వారు ప్రతిదీ స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటారు. ఇతరుల గొంతులను వినిపించనివ్వరు. ఇతరుల గొంతులను వినడానికి ఇష్టపడరు. ప్రోటోకాల్‌లను ఉల్లంఘిస్తున్నారు. ప్రతి ప్రజాస్వామ్యంలో ఒక ప్రోటోకాల్ ఉంటుంది, దానిని అనుసరించాలి' అని ఆమె పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. ఈ ప్రభుత్వం చాలా అభద్రతతో ఉందని, ప్రముఖులు వచ్చినప్పుడు, వారు ఎల్ఒపిని కలుస్తారు, ఇది ప్రోటోకాల్ కాబట్టి ఆ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించాల్సిన అవసరం ఏమిటి? ఇది అభద్రత మాత్రమే అవుతుందని, కానీ తమ సొంత మన్ కీ బాత్‌ను మాత్రమే మాట్లాడాలనుకునే వారికి మన విదేశాంగ విధాన కార్యక్రమాలకు ముఖ్యమైన స్తంభాలుగా పనిచేసే ఈ సంప్రదాయాల పట్ల ఎటువంటి గౌరవం లేదని ఆయన అన్నారు. పుతిన్ గురువారం సాయంత్రం ప్రధాన మంత్రి మోదీ తో శిఖరాగ్ర సమావేశానికి భారత్‌కు విచ్చేసారు.

## అదనపు సిబ్బందిని నియమించుకోండి

### బిఎల్‌ఓల ఆత్మహత్యల నేపథ్యంలో 'సుప్రీం' సూచన




**న్యూఢిల్లీ :** నిర్దిష్ట కాలపరిమితితో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కొనసాగుతున్న రాష్ట్రాలలో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న కొందరు బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ) అనారోగ్యానికి గురవడం, రాజీనామాలు చేస్తుండడం, ఆత్మహత్యలకు పాల్పడటంపై గురువారం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. బిఎల్ఓల పని గంటలను తగ్గించేందుకు అదనపు ఉద్యోగులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రాలను ఆదేశించింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకు, పని ఒత్తిడి కారణంగా చాలామంది బిఎల్‌ఓలు ఆత్మహత్య చేసుకున్నారని, నిర్దిష్ట కాలంలో కేటాయించిన పనిని పూర్తిచేయని బిఎల్‌ఓలపై ప్రజాప్రాతినిధ్య (ఆర్‌పి) చట్టం కింద వారిపై బలవంతపు చర్యలు తీసుకోద్దని ఎన్నికల సంఘాన్ని (ఇసి) ఆదేశించాలని ఎత్తిచూపుతూ తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ దాఖలు చేసిన దరఖాస్తును సుప్రీంకోర్టు విచారించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి ధర్మాసనం టివికె తరపున ఈ కేసు విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ చేసిన సమర్పణల నోట్‌పై స్పందించింది. ఉపాధ్యాయులు లేదా అంగన్‌వాడీ వర్కర్లుగా ఉన్నటువంటి చాలామంది బిఎల్‌ఓలు ఎన్నికల సంఘం అధికారుల తీవ్ర ఒత్తిడి కారణంగా మరణించినందున కొన్ని సూచనలను జారీ చేయాల్సిన అవసరం ఉందని గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. బూత్ లెవల్ అధికారులు వారికి నిర్దిష్ట కాలపరిమితితో కేటాయించిన విధులను నిర్వర్తించడంలో విఫలం అయితే వారిపై ఎన్నికల సంఘం అధికారులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేస్తున్నారని ధర్మాసనానికి తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ బిఎల్‌ఓల పని ఒత్తిడి నుంచి విముక్తి పొందేందుకు అదనపు సిబ్బందిని నియమించే అవకాశాన్ని పరిశీలించాలని రాష్ట్రాలను ఆదేశించారు. బిఎల్‌ఓలు తమ దినచర్య విధులతో పాటు ఎన్నికల సంఘం కేటాయించిన అదనపు విధులతో ఇబ్బందులను ఎదుక్కొంటున్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వం అలాంటి ఇబ్బందులను తొలగించే ప్రయత్నంలో భాగంగా అదనపు సిబ్బందిని నియమించే చర్యలు చేపట్టవచ్చని ధర్మాసనం ప్రస్తావించింది. బూత్ లెవల్ అధికారులపై ఎన్నికల సంఘం ఆర్‌పి చట్టంలోని సెక్షన్ 32కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందని టివికె తరపు సీనియర్ న్యాయవాది శంకరనారాయణన్ విచారణ సందర్భంగా ధర్మాసనానికి చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ బిఎల్‌ఓల పని ఒత్తిడి నుంచి విముక్తి పొందేందుకు అదనపు సిబ్బందిని నియమించే అవకాశాన్ని పరిశీలించాలని రాష్ట్రాలను ఆదేశించారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 05 డిసెంబరు

# హిల్ట్‌పై పునఃసమీక్ష మేలు

గత పది రోజులుగా హిల్ట్‌గా పిలవబడుతున్న హైదరాబాద్ పారిశ్రామిక భూములు మార్పిడి విధానంపై రాజకీయ దుమారం రేగుతోంది. మహానగరంలోని పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు పంపే ఉద్దేశ్యంతో హిల్ట్‌ను రూపొందించారు. పరిశ్రమలను నగరం బైటికి పంపడంపై ఎవరికీ అభ్యంతరం లేదు. అయితే, ఆయా పరిశ్రమలకు గతంలో పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన భూములను స్వల్ప మొత్తానికే నివాస, ఇతరత్రా అవసరాల వినియోగం కోసం మార్పిడి చేసుకునే వెసులుబాటు కల్పించడంపై వివాదం రాజుకుంది. ఇటీవల వరుస అపజయాలతో వెనకబడుతున్న ప్రతిపక్ష బిఆర్ఎస్, అలాగే బిజెపి ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టే అస్త్రంగా మార్చుకున్నాయి. భూముల వినియోగ స్వరూపం మార్పు వెనుక రూ.ఐదారు లక్షల కోట్ల కుంభకోణం దాగుందంటూ తీవ్ర ఆరోపణలు సంధిస్తున్నాయి. బిఆర్ఎస్ ఒక అడుగు ముందుకేసి ఎనిమిది నిజనిర్ధారణ బృందాలు వేసి పారిశ్రామికవాడల పర్యటన కార్యక్రమాన్ని పెట్టుకుంది. స్వయంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సైతం కొన్ని ప్రాంతాలలో పర్యటించారు.మరోవైపు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా బిజెపి అగ్ర నేతలంతా ప్రభుత్వాన్ని దునుమాడుతున్నారు. గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కన ఉన్న భూముల వ్యవహారంలో ఇదే రీతిలో బిఆర్ఎస్, బిజెపిలు విరుచుకుపడ్డాయి.

అసలు విషయానికి వస్తే హైదరాబాద్‌లో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా 1960, 70 దశకాలలో 11 ముఖ్య పారిశ్రామిక వాడలలో వరుస ప్రభుత్వాలు భూములను కేటాయించాయి. వాటిల్లో కూకట్‌పల్లి, సనత్‌నగర్, బాలానగర్, నాచారం, ఉప్పల్, జీడిమెట్ల, మల్లాపూర్, మౌలాలీ, పటాన్‌చెరు, కాటేదాన్ తదితర పారిశ్రామిక వాడల్లో భూములను పారిశ్రామిక అవసరాల కోసం పలు సంస్థలకు కేటాయించారు. ఈ ప్రాంతాల్లోనే అనేక ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఇవన్నీ కూడా 1991లో సరళీకృత ఆర్థిక విధానాల ప్రవేశానికి ముందు హైదరాబాద్ నగర ఆర్థిక చోదక శక్తులుగా ఉండేవి. లక్షల సంఖ్యలో ఉద్యోగాల కల్పన, అనుబంధ ఉపాధి అవకాశాలతో కొన్ని తరాలకు ఆర్థిక ఆలంబనగా నిలిచాయి. నగరాభివృద్ధికి కూడా దోహదం చేశాయి. దురదృష్టవశాత్తు ప్రభుత్వ ప్రైవేటీకరణ అనుకూల విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, అలాగే ప్రైవేటు కంపెనీలు కూడా పోటీకి నిలవలేక మూతపడ్డాయి. నాడు పరిశ్రమలు పరిఢవిల్లిన సమయంలో ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారస్తులు, అనుబంధ ఉపాధితో ఆ ప్రాంతాలన్నీ వేగంగా విస్తరించి, అధిక జనసాంద్రతను సంతరించుకున్నాయి. ఒకప్పుడు నగరానికి దూరంగా ఉన్న ఆ ప్రాంతాలే వ్యాపార, ఆర్థిక కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. మిగిలిన కొద్ది పరిశ్రమలు పాత సాంకేతికతనే కొనసాగిస్తూ నగర నడిబొడ్డున కాలుష్యాన్ని వెదలజల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాననగరంలో భాగంగా మారిన నాటి పారిశ్రామిక వాడల నుంచి పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు పంపాలని గతంలో పాలకులు అనేకులు ప్రయత్నాలు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కూడా ఆ దిశగా ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు ఆవల తరలించేందుకు కంకణబద్ధురాలైంది. అయితే, పరిశ్రమలు తరలిపోయాక అవి నెలవైన 9,292 ఎకరాల భూముల విషయంలో గత మాసాంతంలో తెరపైకి వచ్చిందే ఈ హిల్ట్ విధానం. పాత ప్రభుత్వాలు పారిశ్రామిక అవసరాల కోసం భూములు కేటాయించిన పారిశ్రామిక వాడలను బహుళ వినియోగ జోన్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూములను ఎకరాకు లక్ష రూపాయల కంటే తక్కువ కే గతంలో ప్రభుత్వాలు కేటాయించాయి. వాటిని ప్రభుత్వ నిర్ణీత మార్కెట్ ధరలో 30 నుంచి 50 శాతం, అది కూడా రూ.కోటి లోపే వన్ టైమ్ డెవలప్‌మెంట్ ఫీ(డిఫ్) కింద చెల్లించడం ద్వారా భూయజమానులకు భూమిని ఇతర అవసరాలకు మార్పిడి చేసుకునే వీలు హిల్ట్ కల్పించింది.

గతంలో ప్రస్తుత మార్కెట్ ధరలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాల కల్పన, అభివృద్ధి సాధ్యమనే సదుద్దేశ్యంతోనే ప్రోత్సాహక ధరకు భూములిచ్చారు. కాలక్రమేణ ఆ ప్రాంతాలు వాణిజ్యకేంద్రాలుగా మారిపోవడంతో ఎకరం భూమి ధర పదుల కోట్లలోనే పలుకుతుంది. అందుకు ఇటీవల హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల వేలం పాటలో ఎకరం రూ.200కోట్ల దరిదాపుల్లో పలకడమే నిదర్శనం. హిల్ట్ కింద ప్రభుత్వానికి రూ.5వేల కోట్లు మాత్రమే సమకూరనున్నట్లు అంచనా. ఆ భూముల మార్కెట్ విలువ ఎకరా రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఉంటుందని, ఆ లెక్కన అసలు విలువ ఐదారు లక్షల కోట్లు ఉంటుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. గతంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పక్కన కంచె గచ్చిబౌలిలో భూములను ప్రభుత్వం వేలానికి సిద్ధం చేస్తుండగా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ద్వారా ఆగిపోయింది. వాస్తవాలు ఆలస్యంగానైనా వెలుగులోకి వచ్చాయి.

పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన భూములను నిర్ణీత మొత్తం చెల్లించడం ద్వారా ఇతర అవసరాలకు మార్చడం ప్రస్తుత ప్రభుత్వంతోనే మొదలుకాలేదు. గత బిఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లోని ఆజామాబాద్ పారిశ్రామిక వాడలో 110 ఎకరాల భూములను క్రమబద్ధీకరించేందుకు చట్టం తీసుకువచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వమైతే విశాఖ ఉక్కు కర్మాగారం భూములను ప్రైవేటుపరం చేసేందుకు అడుగులు వేసి, ప్రజావ్యతిరేకతతో తగ్గింది. కానీ, హిల్ట్ విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలను తేలికగా కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. ఈ విధానంలో పారదర్శకత పాటించకపోతే ప్రభుత్వానికి మరక అంటుకునే ప్రమాదం లేకపోలేదు. నిజానికి ఆ భూములను ప్రభుత్వమే తీసుకొని, యజమానులకు భూమికి బదులుగా ఒఆర్ఆర్ వెలుపల భూమి కేటాయించే అంశాన్ని పరిశీలించాలి. స్వాధీనం చేసుకున్న భూముల్లో కొంత వేలం వేయడం, మరికొంత పేద, మధ్యతరగతి వర్గ గృహపథకాలకు కేటాయించడంపై ఆలోచన చేయాలి. తద్వారా ఖజానాకు ఆదాయం, ప్రజలకు ఆవాసం సమకూర్చిన ప్రజాప్రభుత్వంగా చరిత్రలో నిలిచే సువర్ణావకాశం లభిస్తుంది. కాబట్టి, హిల్ట్ విషయంలో పునః సమీక్ష సముచితం.

# రేవంత్‌కు ప్రత్యర్థి సిఎం అభ్యర్థి ఎవరు?


ఎస్.కె. జకీర్

వచ్చే టర్మ్‌లోనూ తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి ఢిల్లీలో డిసెంబర్ 3 న చెప్పారు.ఈ ప్రకటన ఇదివరకు కూడా ఆయన చాలా సార్లు చేశారు. ఇందులో మర్మం ఉం ది. వ్యూహాత్మక వైఖరి కూడా ఉంది. తనతో సిఎం పదవికి పోటీ పడే వారికి, అవతల ప్రధా న ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీకి ఒకే సమయంలో చెక్ పెట్టడానికి సిఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు. సొంతపార్టీలో ఉన్న సీనియర్లకు రేవంత్ వ్యాఖ్యలు నచ్చవు. తామెందుకు సిఎం కాకూడదనుకుంటున్న వారు నలుగురైదుగురు ఉండవచ్చు. వాళ్లంతా నివ్వెరపోయేలా రేవంత్ రెడ్డి దూకుడు నిర్ణయాలు, ప్రకటనలు కనిపిస్తున్నవి. ఇక బిఆర్ఎస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న చర్చకు సైతం రేవంత్ అవకాశం కల్పించారు. బిఆర్ఎస్‌లో కెసిఆర్ మినహా మరొకరు ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కాదని ఆ పార్టీ శ్రేణులు అనుకోవచ్చు కానీ కాలం కలిసివస్తే ఆ పదవిని అందుకోవడానికి గాను కెటిఆర్, హరీశ్ రావు, కవిత పోటీపడే వాళ్ళే. ఇందులో దాపరికమేమీ లేదు. సిఎం రేవంత్ వ్యాఖ్యలు సహజంగానే ఆసక్తిని రేకెత్తిస్తున్నవి. పార్టీ హైకమాండ్ నుంచి తనకు లభిస్తున్న మద్దతు, తన శక్తి సామర్థ్యాలపై తనకున్న నమ్మకం వలన రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారు. ఏవైనా అనూహ్యమైన పరిణామాలు జరిగేంతవరకు వచ్చే ఎన్నికల్లో రేవంతే తమ సిఎం అభ్యర్థిగా ఉంటారని ఆయన మద్దతుదారుల వాదన.

కాగా స్థానిక సంస్థల ఎన్నికలు దూసుకు వచ్చేశాయి. జూబ్లీ హిల్స్ ఫలితం ఇచ్చిన కిక్కుతో అధికార కాంగ్రెస్ పార్టీ కదన కుతూహలంతో కనిపిస్తున్నది. మరోవైపు కెసిఆర్ పార్టీకి గ్రామస్థాయి నిర్మాణం లేకపోవడంతో ఆ పార్టీ వ్యవహారమంతా 'దైవాధీనం సర్వీసు' వలె కనిపిస్తున్నది. 'జనతా గ్యారేజ్' తెలంగాణ భవన్‌లో 'కారు'కు మరమ్మతులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ భవన్ చుట్టూ తిరిగే వాళ్లనే నాయకులుగా పరిగణిస్తున్నారు. కెటిఆర్ భజన బృందానికి తప్ప మరెవరికీ ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు పార్టీని తిరస్కరించిన విషయాన్ని మరచిపోయారు. పార్టీ కార్యక్రమాలు తెలంగాణ భవన్‌కు పరిమితమైపోయాయి''. అని కొందరు పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వాపోతున్నారు. పార్టీ నాయకత్వంపై ముఖ్యంగా కెటిఆర్ పై ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు.

తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్, రేవంత్ రెడ్డిలలో ఎవరు సమర్థులంటూ ఇటీవల ఒక సంస్థ సోషల్ మీడియాలో ఒక ప్రశ్నను సంధించింది. ఇద్దరూ తమ తమ శైలిలో చాణక్యాన్ని ప్రదర్శించినట్టు ఎక్కువమంది జవాబు చెప్పారు. రాజకీయాల్లో లోతైన ప్లానింగ్, నిశ్శబ్ద వ్యూహాలు, దీర్ఘకాల దృష్టితో పనిచేసే వ్యూహకర్తగా కెసిఆర్ గుర్తింపు పొందారు. ఆయన రాజకీయ నిర్ణయాలు సాధారణంగా పలు దశల ముందుగానే ఆలోచించి తీసుకునేవారు. రేవంత్ రెడ్డి వేగవంతమైన నిర్ణయాలు, దూకుడు రాజకీయ శైలి, ప్రజలతో నేరుగా కమ్యూనికేషన్ చేసే సామర్థ్యంతో ప్రత్యేకతను చూపిస్తున్నారు. పరిస్థితులను అప్పటికప్పుడు తనకు అనుకూలంగా మార్చుకునే తత్వం రేవంత్ సొంతం. అందువల్ల వేగం, దూకుడు, ప్రత్యక్ష పోరాట ధోరణిలో కెసిఆర్ కన్నా రేవంత్ రెడ్డి మెరుగ్గా కనిపిస్తున్నట్టు నెటిజన్లు జవాబిచ్చారు.

''రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. మనం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోటి మందికి కోటి చీరలను ఆడబిడ్డలకు సారెగా అందిస్తున్నాం. ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదే. గ్రామాలవారీగా సమన్వయం చేసుకుంటూ పంపిణీ పూర్తి చేయాలి. డిసెంబర్ లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తయ్యేలా చూడాలి. మార్చిలో పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 35 లక్షల చీరలను పంపిణీ చేయాలి. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, పరిపాలనపై గ్రామ గ్రామాన చర్చ పెట్టండి. సంక్షోభంలో మనకు రాష్ట్రాన్ని అప్పగిస్తే సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నాం. 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నెల 7న ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజీ ముందు సభపెట్టి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం. ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం. 8, 9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించుకుంటున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించుకోబోతున్నాం. కోర్ అర్బన్ లో సమస్యలను దృష్టిలో పెట్టుకుని CURE చేయాలని నిర్ణయించుకున్నాం. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను బయటకు తరలిస్తాం. రీజనల్ రింగ్ లోపల ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (PURE) ప్రాంతంలో పరిశ్రమలకు ఏర్పా టు చేసుకోబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్ బయట రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ ( RARE) ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోబోతున్నాం. తెలంగాణలో మరో నాలు గు విమానాశ్రయాలు, ఒక డ్రై పోర్టు ఏర్పాటు చేసుకోబోతున్నాం. కేంద్రంతో కొట్లాడి హైదరాబాద్ బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నాం. పనులు చేయడమే కాదు, రాజకీయాల్లో చేసింది చెప్పుకోవాలి. జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యత. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి' అని డిసెంబర్ 2న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి కొనసాగుతున్నది. పిసిసి కమిటీలను పూర్తి చేసుకొని ఆ పార్టీ జిల్లా, బ్లాక్, మండల, గ్రామస్థాయి కమిటీల నియామకం ప్రక్రియ ముగుస్తోంది. కానీ అటు ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పార్టీలో సంస్థాగత కోలాహలమేదీ లేదు. అసెంబ్లీ, పార్లమెంటు, కంటోన్మెంటు, జూబ్లీహిల్స్... ఇలా వరుసగా ఓటములు చవిచూస్తున్న కారణంగా అంత టా నిస్పృహ అలుముకొని ఉన్నది. బిఆర్ఎస్‌లో సంస్థాగత ఎన్నికల నిర్వహణ ఎప్పుడు చేపడతారన్న అంశంపై ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. బిజెపి సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో బూత్, గ్రామ, మండల, జిల్లా కమిటీల ఎన్నికతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎంపిక కూడా పూర్తి చేసుకుంది. పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీ ఏర్పాటుకు బిజెపి నాయకులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పక్షాలలో కాంగ్రెస్, బిజెపిల సంస్థాగత ఎన్నిక ప్రక్రియ తుది దశకు చేరుకోగా బిఆర్ఎస్‌లో మాత్రం సంస్థాగత ఎన్నికల ఊసు లేదు.

ప్రాంతీయ పార్టీగా, ఒక కుటుంబ ఆధిపత్యంలోని పార్టీగా పాపులర్ అయిన బిఆర్ఎస్‌లో సంస్థాగత ఎన్నికల వ్యవహారంపై ప్రశ్నించడం సంగతి పక్కనబెడితే, కనీసం ఆ అంశంపై ప్రస్తావన చేసే సాహసానికీ ఎవరూ పూనుకోలేకపోతున్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులే పార్టీ హైకమాండ్ కనుక ఏది మాట్లాడినా కెసిఆర్, కెటిఆర్ కు ఎదురు తిరిగినట్లవుతుందన్న భావన పార్టీ నాయకుల్లో ఉన్నది. కెసిఆర్ తర్వాత కెటిఆర్ మాటే ఫైనల్ అనీ, హరీశ్ రావుకు నాయకత్వ ప్రతిభ ఎంత ఉన్నా ఆయన మాట చెల్లుబాటు కావడం లేదని హరీశ్‌ను నమ్ముకున్న కార్యకర్తల వాదన. రాజకీయ విశ్లేషకులు ఇదే మాట అంటున్నారు. సంస్థాగత నిర్మాణం లేకుండా పార్టీని ఎంత కాలం నడిపిస్తారన్న ప్రశ్న క్యాడర్ నుంచి బలంగా వినిపిస్తున్నది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి రెండేండ్లు గడచినా ఇంకా పార్టీ నిర్మాణంపై ఫార్మ్‌హౌజ్ హైకమాండ్ దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ''నేను జైలులో ఉన్న సందర్భంలో తమ పార్టీని బిజెపిలో విలీనానికి కొందరు ప్రయత్నించారు'' అని కెసిఆర్ కూతురు కవిత చేసిన వ్యాఖ్యలను కొందరు ప్రస్తావిస్తున్నారు. 'వేరొక పార్టీలో విలీన ప్రయత్నాలు నిజమే అయితే ఇంక సంస్థాగత నిర్మాణం ఎందుకు' అని కొందరు పార్టీ సీనియర్లే వ్యంగాస్త్రాలు సంధిస్తున్నారు.

గత ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆ సభకు జనసమీకరణ కూడా భారీగానే జరిగింది. క్యాడర్‌లో జోష్ నింపేందుకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రయత్నించారు. మే మొదటి వారం నుంచి సభ్యత్వం నమోదు చేపడతామని రజతోత్సవ సభ ముగిశాక ప్రకటించారు. సభ్యత్వాలు కూడా డిజిటల్ రూపంలో ఉంటాయని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు సహా అనుబంధ సంఘాల కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని రామారావు చెప్పారు. అక్టోబర్లో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. 'కార్యకర్త కేంద్రం'గా పార్టీ నిర్మాణం జరుగుతుందని కెటిఆర్ గొప్పగా చెప్పారు. కమిటీల ఏర్పాటు తర్వాత జిల్లాల వారీగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తయితే కనీసం పార్టీ పదవులైనా దక్కుతాయన్న ఆశావహులలో కెటిఆర్ ప్రకటన ఆశలు రేపింది. కానీ రజతోత్సవ సభ ముగిసిపోయి ఆరు నెలలు గడచిపోయినా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఏ రాజకీయ పార్టీ మనుగడకు అయినా సైద్ధాంతిక పునాది, సంస్థాగత నిర్మాణం కీలకం. బిఆర్ఎస్‌కు సైద్ధాంతిక పునాది తెలంగాణ నినాదమే. తెలంగాణ అభివృద్ధి, దాని హక్కుల కోసమే పోరాడుతున్నట్టు పార్టీ నాయకత్వం చెబుతూ ఉంటుంది. బిఆర్ఎస్‌గా పేరు మార్చుకున్న అనంతరం పార్టీ 'తెలంగాణ ఆత్మ'ను కోల్పోయిందన్న విమర్శలు కెసిఆర్, కెటిఆర్ ఖాతరు చేయడం లేదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల ఎన్నికలు సజావుగా జరిగాయి. పార్టీ అధికారంలోకి వచ్చాక మొత్తం గాడి తప్పింది. పార్టీ రాష్ట్ర కమిటీని చివరిసారిగా 2017లో ప్రకటించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాక సంస్థాగత ఎన్నికల ప్రక్రియను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జీలతోనే పార్టీని నడిపిస్తున్నారు. 2021లో గ్రామ, మండల కమిటీలను నియమించారు. 2022లో 33 జిల్లాలకు జిల్లా అధ్యక్షులను ప్రకటించినప్పటికి ఎక్కువమంది ఎమ్మెల్యేలే. ఇక జిల్లా కార్యవర్గాలు, అనుబంధ కమిటీల నిర్మాణాన్నీ విస్మరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీల పెత్తనం ఇష్టంలేని వారంతా, వారి ఓటమికి కృషి చేశారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ అసంతృప్తి నేతలు తమ తడాఖా చూపారు. అధికారం కోల్పోయాక ఆత్మవిమర్శ, అంతర్మథనం చేసుకొని పార్టీ ప్రక్షాళన, పునర్నిర్మాణం వంటి కీలక అంశాలపై దృష్టి పెడతారన్న ప్రచారం జరిగింది. పార్టీ పదవులు ఆశిస్తున్న వారికి శాశ్వతంగా నిరాశ ఎదురవుతోందని పార్టీ వర్గాలు వాపోతున్నాయి. పార్టీ పదవులైనా లేకుండా ఖర్చులు పెట్టుకొని, పార్టీని నడిపించడం ఎందుకని చాలామంది కింది స్థాయి నాయకులు చెబుతున్నారు. బిఆర్ఎస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత పదవులను భర్తీ చేయనందున స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఆ పార్టీ గ్రామ స్థాయి కార్యకర్తలే అంటున్నారు. జిల్లా అధ్యక్షుల ఎంపికకు పరిమితం చేసిన అధిష్ఠానం జిల్లా, పార్టీ అనుబంధ సంఘాలకు పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమించకపోవడాన్ని పలువురు పార్టీ క్యాడర్ తప్పుబడుతున్నది. పైగా ''ఎమ్మెల్యేలను జిల్లా అధ్యక్షులుగా నియమించినందున వాళ్ళు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో సామంత రాజుల్లా చెలరేగిపోయారు. ప్రజల్ని, పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం చేశారు. నేను ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన నా మాట వినలేదు. నీకెందుకు? నీకేమీ తెలియదు. పార్టీని స్థాపించిన వాడ్ని పార్టీని ఎట్లా నడపాలో నాకు తెలియదా? అని కెసిఆర్ తోసిపుచ్చారు'' అని గత మే లోనే ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ రెబల్ నాయకురాలు కవిత అన్నారు.

ఏడేళ్ల క్రితం టిఆర్ఎస్ అధిష్ఠానం జిల్లా కమిటీలను రద్దు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులకు పార్టీ వ్యవహారాలను అప్పగించింది. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా తీసుకునే కీలక నిర్ణయాలపై సర్వాధికారాలను స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలకు అప్పగించింది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో పొసగని పలువురు సీనియర్ నేతలు కొంతకాలంగా రాజకీయపరంగా నిశ్శబ్దంగా ఉన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి నేతలకు రాజకీయ నిర్ణయాల్లో అవకాశం కల్పించకపోవడం, వారిని ఎందులోనూ భాగస్వాములు చేయకపోవడంతో వాళ్ళు ఎదగలేకపోయారు. పార్టీలో సంస్థాగతంగా ఉన్న విభేదాలు సమసిపోవాలంటే పార్టీని జిల్లా కమిటీలకు అప్పగించాలని అనుకున్నారు. సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను పునరుద్ధరించనున్నట్టు గతంలోనే బిఆర్ఎస్ ప్రకటించింది. జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీలు హైకమాండ్ సూచన మేరకు పనిచేస్తాయని, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపిల ఒత్తిడి, పెత్తనం ఉండదని పార్టీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. కార్యవర్గం లేకుండానే ఏకపక్షంగా అధ్యక్షుడు, మండల కమిటీలతోనే నామమాత్రంగా పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టిఆర్ఎస్ పార్టీ 2001లో ఆవిర్భవించింది. ఉద్యమ పార్టీగా మొదలై రాజకీయ పార్టీగా మారిపోయింది. కెసిఆరే ఆ పార్టీకి అధ్యక్షుడిగా 25 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రిగా కెసిఆర్ బాధ్యతలు చేపట్టినప్పటికీ పార్టీ బాధ్యతలనూ ఆయనే నిర్వర్తించారు. గతంలో ఏడాదికోసారి పార్టీ ప్లీనరీ ఏర్పాటు చేసేవారు. అధ్యక్షుడి కోసం పేరుకు ఎన్నికలు నిర్వహించినా నామినేట్‌గా కెసిఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొనేవారు. మిగతా కార్యవర్గాన్ని నామమాత్రంగా నియమించే వారు. 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించింది. ఎప్పుడైతే పార్టీ అధికారంలోకి వచ్చిందో అప్పటినుంచి జిల్లా కమిటీలపై పర్యవేక్షణ పూర్తిగా వదిలేసింది.

# కార్పొరేట్ల కోసమే కొత్త విత్తన బిల్లు!

వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రజల అభిప్రాయాల కోసం ముసాయిదా విత్తన బిల్లు 2025 విడుదల చేసింది. డిసెంబర్ 11 లోపు తమ అభిప్రాయాలను ఫార్మాట్‌లో పంపాలని కోరింది. 'ఒక్క మెతుకు పట్టుకుని చూస్తే అన్నం ఉడికిందా లేదో తెలుస్తుంది' అనే నానుడి లాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ బిల్లులో ఏ అంశం పరిశీలించినా సాగు దారుల కోసం కాదు, కార్పొరేట్ల కోసమే నూతన విత్తన బిల్లు 2025 అని అర్థం అవుతుంది.

వ్యవసాయానికి విత్తనమే ప్రాథమిక పెట్టుబడి. ఇది లేకుండా, మనం పంటల సాగు గురించి ఆలోచించలేము. అధిక దిగుబడి, ఉత్తమ నాణ్యత గల పంట కోసం మనకు నాణ్యమైన విత్తనాలు అవసరం. సాగు దారుల తోపాటు 145 కోట్లమంది భారతీయులకు ఆరోగ్య దాయక ఆహార ప్రయోజనం వ్యవసాయంలో దాగి ఉంది. భారతదేశంలో మొత్తం సాగు భూమి దాదాపు 1.5 మిలియన్ హెక్టార్లు.

ప్రస్తుతం భారతదేశ విత్తన పరిశ్రమ వ్యాపార విలువ 3.82 బిలియన్ల డాలర్లుగా అంచనా. ఇందులో 85% ప్రైవేటు విత్తన కంపెనీలు, 15% సాంప్రదాయ రైతుల వాటా. వ్యవసాయం భారతీయ శ్రామిక శక్తి లో 50 % కంటే ఎక్కువ. వ్యవసాయ పరిశ్రమ మన ఆర్థిక వ్యవస్థ లో ప్రధాన భాగాల లో ఒకటి. ఇది జిడిపి, ఉపాధి రెండింటికీ దోహదం చేస్తుంది. వ్యవసాయ రంగం ప్రాధాన్యత రీత్యా సాగు దారుల ప్రయోజనాల పరిరక్షణ ప్రథమ లక్ష్యంగా మార్పులు తీసుకు రావాలి. విత్తన రంగాన్ని నియంత్రించే నిబంధనలను సమూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనాల బిల్లు,2025 సాగు దారుల ప్రయోజనాల కంటే కార్పొరేట్ల లాభాల కోసం రూపొందించింది.

1966 విత్తనాల చట్టం, 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వుల స్థానంలో 2025 విత్తన బిల్లు కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. నూతన చట్టం నాణ్యమైన విత్తనాల సరఫరా ను మెరుగు పరుస్తుందని,నకిలీలను అరికట్టగలదని, రైతులకు రక్షణ కల్పిస్తుంది అని కేంద్ర ప్రభుత్వం అంటున్నది.

2024, 2019లోను కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం రూపొందించే ప్రయత్నం చేసింది. ఆ రెండు ముసాయిదాలలోను పరిహారం విషయం లేకపోవడం, తీవ్ర విమర్శలు రావడంతో రెండు సార్లు ప్రభుత్వం విరమించుకుంది. ప్రతిపాదిత చట్టం సాధారణ సాగు దారుల కంటే ముఖ్యంగా సాంప్రదాయ,రసాయన రహిత వ్యవసాయంపై ఆధారపడే వారికంటే విత్తన కంపెనీలు, వ్యవసాయ వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించారు.

విదేశీ సర్టిఫికెట్ ఉన్న భారతదేశంలో విత్తనాలు అమ్ముకోవడానికి అవకాశం ఇచ్చే చట్టం ఎవరి ప్రయోజనాల కోసమో ఇట్టే అర్థమవుతుంది. రైతుల సాంప్రదాయ రకాలు మరియు ఎగుమతి కోసం మాత్రమే ఉద్దేశించిన విత్తనాలు తప్ప, అన్ని విత్తన రకాలకు రిజిస్ట్రేషన్ అవసరం.

అనుమతి పొందే ముందు విత్తనం బహుళ ప్రదేశాలలో సాగు మరియు ఉపయోగం విలువ వాల్యూ ఫర్ కల్టివేషన్ అండ్ యూజ్ (విసియు) ట్రయల్స్ ఆధారంగా నమోదు చేసిన కనీస అంకురోత్పత్తి, స్వచ్ఛత ప్రమాణాలను కలిగి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలి.

విత్తనాల డీలర్లు, పంపిణీదారులు విత్తనాలను విక్రయించడానికి దిగుమతి చేసుకోవడానికి లేదా ఎగుమతి చేయటానికి రాష్ట్రం జారీ చేసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను పొందాలి.

కేంద్ర ప్రభుత్వ సీడ్ పోర్టల్ ద్వారా వివరాలు తెలుసుకొనుటకు క్యూర్ కోడ్ ఉండాలి. ప్రతిపాదిత సెంట్రల్ అక్రిడిటేషన్ సిస్టమ్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కంపెనీ లు అన్ని రాష్ట్రాలలో ఆటోమేటిక్ గుర్తింపు పొందేందుకు వీలు కల్పిస్తుంది. ఇది పెద్ద కంపెనీలకు అత్యధికంగా ప్రయోజనం చేకూరుస్తుంది. విదేశాల్లో ధృవీకరణ పొందిన విత్తనాలు ఇక్కడ అనుమతి లేకుండా దిగుమతి చేసి రైతులకు విక్రయించడానికి ఈ బిల్లు అవకాశం ఇస్తుంది.

అమెరికాలో రిజిస్టర్ అయిన విత్తన కంపెనీలు ఆఫ్రికా దేశాల్లో విత్తనాలు ఉత్పత్తి చేసి భారతదేశంలో రైతులకు సరఫరా చేయుటకు అవకాశం కలదు.ఆ విత్తనాలు మన దేశ వాతావరణ పరిస్థితుల్లో తగిన దిగుబడులు సాధించాలి లేకపోతే రైతు లు నష్టపోతారు.భారత దేశంలోకి జన్యు మార్పిడి విత్తనాలను దిగుమతి చేసుకోకుండా మరియు విక్రయించకుండా నిరోధించడానికి ముసాయిదా బిల్లులో తగిన చట్టపరమైన రక్షణలు లేవు. కఠినమైన పర్యవేక్షణ లేకుండా జన్యుపరంగా ఇంజనీరింగ్ చేయబడిన లేదా జన్యు సవరించిన విత్తనాలను అనుమతిస్తే మానవుల ఆరోగ్యానికి మరియు పర్యావరణ వ్యవస్థ కు ప్రమాదం రావచ్చు.

భూముల సారం దెబ్బతిని చిన్న రైతుల మనగడ కష్టతరం అవుతుంది. విత్తన కంపెనీలు, సరఫరాదారులు చేసే చిన్న నేరాలను ఈ చట్టం ద్వారా నేరరహితం చేయడం, తీవ్రమైన ఉల్లంఘనలకు కఠినమైన చర్యలు అంటూ ప్రతిపాదించారు.

ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, నమోదు చేయని లేదా, నాసిరకం,నాణ్యత లేని విత్తనాలను విక్రయించడానికి, డిజిటల్ పోర్టల్ లో సమాచారం నవీకరించడంలో విఫలమవడం వంటి నేరాలకు లక్ష రూపాయలు నుంచి రూ. ముప్పై లక్షల వరకు జరిమానా, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు. కంపెనీలు, విత్తన వ్యాపారుల తప్పులపై పనిష్మెంట్‌లు ఉన్నాయి,

కానీ రైతులకు జరిగే నష్టం కంపెనీలు నుంచి రాబట్టుకోవడానికి సులభతరమైన మార్గం లేదు. ప్రతిపాదిత చట్టం విత్తనాల పనితీరు తక్కువగా ఉంటే రైతులకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే, పంట దిగుబడి రాకపోతే నష్టపరిహారం నేరుగా పొందే మార్గం ఈ బిల్లు లో లేదు. రైతులు పరిహారం పొందడానికి న్యాయ స్థానాలకు వెళ్ళడం తప్ప మరో మార్గం లేదు.

కోర్టుకు వెళ్ళుటకు విత్తనాల బ్యాగు, కొనుగోలు చేసిన రసీదు, గుప్పెడు విత్తనాలు, శాస్త్రవేత్తల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. తీరా వెళ్తే ప్రకృతి వైపరీత్యం లేదంటే సరైన సాగు పద్ధతులు పాటించలేదని కంపెనీలు వాదిస్తాయి. దాంతో రైతు నష్ట పరిహారం పొందే వీలు లేకుండా పోతుంది. దీనికి ప్రత్యేక విభాగం ఉండేలా చర్యలు తీసుకోవాలి.ఇది చిన్న సన్న కారు రైతుల కోర్టు కి వెళ్ళుటకు ఆర్థిక స్థోమత లేకపోవడం, అక్కడ విజయం సాధిస్తామనే నమ్మకం లేకపోవడం తో విత్తన కంపెనీల పై కోర్టు కి వెళ్ళుటకు రైతులు జంకుతున్నారు. విదేశాల్లో ఉన్న బహుళ జాతి కంపెనీల విత్తనాలు వలన నష్టం సంభవిస్తే పరిహారం పొందడానికి అసలు అవకాశం ఉంటుందా అనేది పెద్ద ప్రశ్న. సులభతరంగా రైతులు పరిహారం పొందే అవకాశం ఉండాలి.

ప్రత్యేక సందర్భాల్లో తప్ప ధరల నియంత్రణకు ప్రభుత్వాలకు అవకాశం లేదు. కృత్రిమ కొరత లేదా భారీగా ధరలు పెరుగుదల ఉన్నప్పుడు తప్ప మిగతా సందర్భాల్లో కంపెనీలు ధరలు నిర్ణయించుకునే స్వేచ్ఛను ఈ బిల్లు కల్పిస్తుంది.

రైతు విత్తనాలు నిల్వచేయడం, మార్పిడి చేయడం , అమ్మడం వంటి స్పష్టమైన నిబంధనలు ఉండాలి. అయితే రైతు ఉత్పత్తిదారి సంస్థలు, సంప్రదాయ విత్తన నెట్ వర్క్ లు వంటి కమ్యూనిటీ సమూహాలను వాణిజ్య సంస్థలు గా వర్గీకరిస్తారు, అవి పెద్ద కంపెనీల మాదిరిగానే అధికారిక, డిజిటల్ సమ్మతి ఉండాలి. ఇది భారత దేశ జన్యు వారసత్వాన్ని దోపిడీ చేయడానికి దోహదపడుతుంది. చిన్న సంప్రదాయ విత్తన ఉత్పత్తిదారుల పై అధిక నియంత్రణను, డిజిటల్ భారం నివారించాలి. ప్రభుత్వరంగ విత్తన పరిశోధనను ప్రోత్సహించాలి. ప్రైవేటు విత్తన పరిశోధన, అభివృద్ధితో పోటీ పడడానికి ఐకార్ మరియు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. వ్యవసాయం రాష్ట్ర అంశం, విత్తన నియంత్రణ కేంద్ర పరిధిలోకి వస్తుంది కాబట్టి రాష్ట్ర, కేంద్ర సమన్వయం చాలా అవసరం .

రాష్ట్రంలో ఉన్న భూములు, వాతావరణ పరిస్థితులకు తగిన విత్తనాలు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, రైతులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలి విత్తన నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉండాలి.

**బొంతు రాంబాబు**
9490098205

# నల్లజాతి సూరీడు 'మండేలా'



ఆఫ్రికా గాంధీగా పేరు పొందిన నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా దక్షిణాఫ్రికాలో కేప్ ప్రాంతంలోని ఉమటా జిల్లా, మవెజో అనే ఊర్లో 1918, జూలై 18న జన్మించారు. దక్షిణాఫ్రికాకు పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడిగా ఆయన పేరు గడించారు. అధ్యక్షుడు కాకముందు ఇతను జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమకారుడిగా, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, దానికి సాయుధ విభాగం అయిన 'ఉంకోంటో విసిజ్వే'కు అధ్యక్షుడిగా పనిజేశారు.

జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో జరిగిన ఒక మారణకాండకు సంబంధించి 27 సంవత్సరాలపాటు 'రోబెన్' అనే ద్వీపంలో జైలు శిక్షను అనుభవించిన మండేలా, 20వ శతాబ్దపు అత్యంత సుప్రసిద్ధులైన ప్రపంచ నాయకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. దీంతో ఆయన, జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపే పోరాటాలకు, వర్ణ సమానతకు ఒక సంకేతంలాగా నిలిచారు. ఫిబ్రవరి 11, 1990లో జైలునుండి విడుదల అయిన తరువాత నెల్సన్ మండేలా రాజకీయంగా తన లక్ష్యాన్ని సాధించడానికి, దేశంలో నెలకొన్న జాతి వైర్యాన్ని నివారించడానికి, అందరి మధ్య సయోధ్య పెంచడానికి కృషి చేశారు. తన పూర్వపు శత్రువులనుండి కూడాప్రశంసలుఅందుకొన్నారు. వందకు పైగా అవార్డులు, సత్కారాలతో వివిధ దేశాలు, సంస్థలు ఈయనను గౌరవించాయి. వాటిలో 1993 లో లభించిన నోబెల్ శాంతి బహుమతి ముఖ్యమైనది. స్వదేశంలో మండేలాను 'మదిబా' అని వారి తెగకు సంబంధించిన గౌరవ సూచకంతో పిలుస్తుంటారు. 1994లో మండేలా తన 77 సంవత్సరాల వయసులో అధ్య క్ష పదవిని చేబట్టి ఆ పదవిని అలంకరించిన వారిలో అతి పెద్ద వయస్కుడయ్యారు. రెండవసారి మరలా ఎన్నికల్లో పోటీ చేయరాదని నిశ్చయించుకున్న ఆయన, 1999లో పదవీ విరమణ చేశారు. జూలై 2001లో ఆయనకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, రేడియేషన్ వైద్యం చేశారు. తన పదవీ విరమణ తరువాత ఎయిడ్స్ వ్యాధి నివారణకు మండేలా విశేషంగా కృషిచేశారు. ఆ తరువాత జూన్ 2004 లో తాను రాజకీయ జీవితం నుండి విరమించుకుని, కుటుంబంతో గడపాలని అనుకుంటున్నట్లు మండేలా ప్రకటించారు. అయితే ఆయన పూర్తిగా సమాజం నుంచి దూరం కాలేదుగానీ, 2003 తరువాత సాంఘిక కార్యక్రమాలను బాగా తగ్గించుకున్నారంతే. కొంతకాలం తీవ్ర శ్వాసకోశ సంబంధ అస్వస్థతతో బాధపడుతూ 2013 డిసెంబర్ 5 న జోహెన్స్ బర్గ్‌లో తుది శ్వాస విడిచారు.ఆయన జీవిత చరిత్ర 'ఎ లాంగ్ వాక్ టూ ఫ్రీడమ్'గా వెలువడింది. ఆయనకు భారత రత్న కూడా లభించింది.

**(05 డిసెంబర్ నెల్సన్ మండేలా వర్ధంతి సందర్భంగా)**

**ఎం.రాం ప్రదీప్**

# 'మట్టి' మర్యాదను మంటగలుపుతున్నామా!

ఖనిజలవణాలు, కర్బన పదార్థాలు, నీటి తేమ, గాలి కలిగిన భూమి ఉపరితలంపైన ఉన్న పొరను నేల అంటాం. భూమిపై వయక్షజాతి ఉనికికి ప్రధాన నెలవు నేల మాత్రమే. నేలలో 15 నుంచి 18 సహజ అత్యవసర పోషకాలు ఆక్సీజన్, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ లాంటి మూలకాలు ఉంటాయి. మనకు తీసుకునే 95 శాతం ఆహారానికి మూలం నేల మాత్ర మే. ఆరోగ్యకర భూగ్రహం అనగా పరిశుద్ధ పర్యావరణం, నాణ్యత కలిగిన నేలలు, హరిత సంపదలు, జీవవైవిధ్య పరిరక్షణ అని అర్థం చేసుకోవాలి. ప్రపంచ నేల దినం–2025 ఇతివృత్తంగా ఆరోగ్యకర పట్టణాలకు ఆరోగ్యకర నేలలు (హెల్దీ సాయిల్స్ ఫర్ హెల్దీ సిటీస్) అనే అంశాన్ని తీసుకొని పట్టణాల్లో నేల నాణ్యతను పరిరక్షించేందుకు కృషి చేయాలని ప్రచారం చేయడం జరుగుతుంది.

నేల సహజ లక్షణాలను కాపాడడానికి నాణ్యతను పెంచడం, నీటిని నిల్వ ఉంచడం, భూగర్భజలాల వృద్ధి చేయడం, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పులకు కారణమైన కార్బన్ ఉద్గారాల కట్టడి లాంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. నేల నాణ్యతను పరిరక్షించడానికి అడవుల పెంపకం, వాటర్షెడ్ నిర్వహణ, ఇంటిపై కూరగాయలు/పువ్వులు/పండ్ల మొక్కలు పెంచడం, వాలు ప్రాంతాలను దున్నడం, ఆర్గానిక్ ఫామింగ్, తరుచుగా నేల నాణ్యత పరీక్షలు చేయించడం, కాలుష్యాన్ని తగ్గించడం, యువతకు అవగాహన కల్పించడం, రైతులను చైతన్య పరచడం లాంటి చర్యలు నేల నాణ్యతను పెంచుతాయి లేదా నేల నాణ్యత తగ్గకుండా చేస్తాయి. నేల కోతను అరికట్టడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం, నేల ఎడారీకరణను అడ్డుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడం సముచితంగా ఉంటుంది.

**(05 డిసెంబర్ ప్రపంచ నేల దినం సందర్భంగా)**

## అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార సరుకుల పంపిణీ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో 2వ అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు బాలామృతం గుడ్లు పంపిణీ చేశారు.5 సంవత్సరాల పిల్లలకు ఎత్తు, బరువు, శరీర కొలతలు తీసి వారి పోషణ స్థితిని తల్లితండ్రులకు తెలిపారు.రోజు వారి ఆహారంలో పిల్లలకు పోషకాలు అందేలా చూసుకోవాలని. పిల్లల ఎదుగుదల కోసం సరైన ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని అందించాలని పిల్లలకు పాలు కోడి గుడ్లు,పండ్లు చిరు ధాన్యాలు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జానకి అంగన్వాడి టీచర్లు అనంత లక్ష్మి, పద్మ,ఆయాలు, పిల్లలు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కషాయాల తయారీపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో ఆర్ఎ ప్రాజెక్టు లో భాగంగా గురువారం రోజున రైతులకు శిక్షణ సమావేశం ఏర్పాటు చేసి కషాయాలను తయారు చేయడం జరిగింది.ఈ సమావేశంలో ఆర్ ఏ ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ ఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ పునరుజీవ పంట ఉత్పత్తిపై ముఖ్యమైన అంశాలను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు కవర్ క్రాపింగ్ సంరక్షణ పద్ధతులు సహజ ఎరువులు అయినటువంటి వర్మీ కంపోస్ట్ తయారు చేయడం జరిగింది. క్రిమిసంహారక రసాయనలు తగ్గించాలని వాటికి బదులుగా జీవామృతం నీమ్అస్త్రం వేస్ట్ డీకంపోజర్ రైతు యొక్క పత్తిక్షేత్రంలో తయారు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షేత్ర పరిశీలకులు ఈ. మహేందర్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రోశయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, పరిపాలనా అధికారి సుధాకర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### రాజన్న సిరిసిల్ల కలెక్టరెట్‌లో



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయాలు తనిఖీ చేసిన జిల్లా వ్యయ పరిశీలకులు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పలు ఎంపీడీఓ కార్యాలయాలను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. బోయినపల్లి, ఇల్లంతకుంట ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం

### పలుగ్రామాల్లో పంచాయతీ వార్డు సభ్యుల ఏకగ్రీవం..!

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** మద్దూరు, ధూల్మిట్ట మండలాల్లో గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషను రెండవ రోజు జోరు అందుకున్నాయి. సర్పంచ్‌లకు పార్టీ గుర్తులు ఉండకున్నా, అభ్యర్థులను మాత్రం ఆయా పార్టీలు తమ పార్టీ అభ్యర్థులుగా పోటీలో నిలబెడుతున్నట్లు అధికార పత్రాల ద్వార డిక్లేర్ చేశారు. శుక్రవారంతో రాష్ట్రంలో గ్రామ పంచాయితీ మూడో విడుత ఎన్నికల నామినేషన్ల పర్వం ముగియనుంది. దింతో ఎన్నికల బరిలో దిగిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్తులు వారివారి నామినేషన్లను రిటనింగ్ అధికారులకు అందించారు. ధూల్మిట్ట మండల కేంద్రంతో పాటుగా బైరాన్ పల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులు వారివారి నామినేషన్లు బలపరిచిన వారితోపాటుగా గ్రామస్థులతో కలసి ర్యాలిగా వచ్చి దాకలు చేశారు. బైరాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గందె మల్లేషం నామినేషన్ వేశారు. ధూల్మిట్టలో మాజీ జడ్పిటీసీ సభ్యురాలు నాచగోని పద్మవెంకట్ గౌడ్ బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ దాకలు చేయగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా గునుకుల నీల జగన్‌మోహన్ రెడ్డి దాకలు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు తమకు ఓటు వేసిగెలిపించాలని, అభివృద్ధితో గ్రామంను మరో మెట్టు ముందుకు తీసుక వెళ్తామని అంటున్నారు. మరో రోజు నామినేషన్లకు గడువు ఉండడంతో పోటీలో నిలిచేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. పలు గ్రామాల్లో వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడం రేపటితో చివరి రోజు కావడంతో వారి ఎన్నిక ఎకగ్రీవం అంటు ప్రచారం జరుగుతోంది.

## గుడుంబా స్థావరాలపైదాడి... ఇద్దరిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని రాశిగుట్ట తండాలో నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో లగురువారం సాయంత్రం గుడుంబ స్థావరాలపై స్టేషన్ సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దాడుల్లో పట్టుబడిన 10 లీటర్ల నాటుసారా, 80 లీటర్ల బెల్లం పాకం ను ద్వంసం చేశామని, నాటుసారా తయారు చేసిన నునావత్ నేమి, రమావత్ కవిత అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారికి ఎవరు పాల్పడిన, విక్రయించిన, రవాణా చేసిన కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్య

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ పట్టణానికి చెందిన సద్ది రాజిరెడ్డి తండ్రి మల్లారెడ్డి వయస్సు 40 సంవత్సరాలు కొన్ని సంవత్సరాల క్రితం భార్యతో విడాకులు కాగా తల్లి సత్తవ్వ దగ్గర ఉంటూ డ్రైవర్ గా పని చేస్తూ జీవితం కొనసాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన రూంలో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాగుడుకు బానిసై ఒంటరితనంపై విరక్తితో ఉరి వేసుకున్నాడని మృతుని తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

# సిపిఐ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్:** నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సిపిఐ బలపరిచే అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బోయిని తిరుపతి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. ఎట్టకేలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని కోరారు. మద్యం, డబ్బు ప్రలోభాలకు గురికావద్దని, అధికారంలో ఉండి సంక్షేమాన్ని విస్మరించే పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కష్టం ఎక్కడ ఉంటే కమ్యూనిస్టులు అక్కడ ఉంటారని, కార్మిక, కర్షక వర్గాలకు అండగా నిలబడేది కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సిపిఐ బలపరిచే అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మి రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పెద్దపల్లి మండలం హనుమంతుపేట గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు ఎమ్మెల్యే విజయ రమణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం రోజున జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయన్నారావు పార్టీలో చేరిన వారిని కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అభివృద్ధికి మెచ్చి బి.ఆర్.ఎస్ మరియు బీజేపీ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బిఆర్ఎస్, బీజేపీ మరింత దిక్కుతోచని స్థితికి వెళ్ళిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు పూర్తి నమ్మకంతో ఉన్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలుస్తారని అన్నారు.ఈ డిసెంబర్ మాసంలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుస్తారని ప్రజల సహకారంతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్టం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని భావించి పెద్ద సంఖ్యలో హనుమంతునిపేట గ్రామ నాయకులు కాంగ్రెస్లో చేరడం గొప్ప విషయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమంతునిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ డివిజన్‌లో పలు పంచాయతీలు ఏకగ్రీవం




**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా గజ్వేల్ డివిజన్ పరిదిలోని 163 గ్రామాలకు, 1432 వార్డులకు ఎన్నికలు జరగనుండగా, 16 గ్రామ పంచాయితీలలో సర్పంచ్‌లు, 224 వార్డులలో వార్డు సభ్యులు ఏకగ్రావంగా ఎన్నికైనారు. డివిజన్ పరిధి లోని దౌల్తాబాద్ మండల లింగాయిపల్లి సర్పంచ్‌గా గుగులోత్ లక్యాయ, నర్సాయిపల్లి దుబాషి లక్ష్మి, గజ్వేల్ మండలంలోని రంగంపేట నడిగొప్పుల నాగరాజు, జగదేవ్‌పూర్ మండలంలో నిర్మల్ నగర్ సర్పంచ్‌గా కర్రె పద్మారావు, కొండాపూర్‌లో సొప్పరి పుష్ప, బిజివెంకటాపూర్‌లో చెక్కల పరమేశ్వర్, పలుగుగడ్డలో నర్ర కనుకయ్య, అనంతసాగర్‌లో క్యాసరం కుమార్, మర్కూక్ మండలంలోని నర్సంపేట సర్పంచ్‌గా బాల్‌నర్సయ్య, ఎర్రవెల్లిలో నారన్నగారి కవిత, ములుగు మండలం జప్తిసింగాయిపల్లిలో బొమ్మగల్ల లక్ష్మి, రాయపోల్ మండలంలోని ఆరపల్లి సర్పంచ్‌గా బొమ్మ మంకాలమ్మ, తునిఖికల్సాలో పనుల స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## హమాలీ కార్మికుల రేట్లపెంపు కోసం చర్యలు

### ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచే విషయంలో డిసెంబర్ 11న కరీంనగర్ లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సమక్షంలో జరిగే సమావేశంలో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నగర ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్ పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు కూలీ రేట్లు పెంచలేదని, పాత కూలీ రేట్లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా హమాలీ కార్మికులకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని వినతి పత్రాలు ఇచ్చి కోరినప్పటికీని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ఇట్టి విషయంలో కరీంనగర్ లోని జిల్లా లేబర్ అధికారికి ఫిర్యాదు చేయడం వల్ల రెండు సార్లు జరిగిన సమావేశంలో చర్చలు జరిపినా ఎలాంటి నిర్ణయం తీసుకోనందున తిరిగి డిసెంబర్ 11 న కరీంనగర్ లో లేబర్ అధికారి వద్ద హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో మరియు వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకుల మధ్య చర్చలు జరుగనున్నాయని, ఇట్టి చర్చలకు వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని హమాలీ కార్మికుల కు కూలీ రేట్లు పెంచి న్యాయం చేయాలని ఆయన కోరారు, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా హమాలీ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి చట్ట బద్ధమైన సౌకర్యాలు లేవని ముఖ్యంగా ఈ.ఎస్.ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని, స్వంత ఇండ్లు లేక కిరాయి అధికంగా చెల్లిస్తూ అద్దె ఇండ్ల లో హమాలీ కుటుంబాలు జీవనం కొనసాగిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు, కనుక వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీమియ, బండారి రవి, గాలిపెల్లి సతీష్ ,తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు

## ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్ :** జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ బాస్కెట్ బాల్ పోటీలకు అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం స్థానిక కొత్తపల్లిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయని, ప్రపంచంలోనే శక్తివంతమైన క్రీడల్లో బాస్కెట్ బాల్ ఒకటని అన్నారు. పాఠశాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తూ, అవసరమైన వనరులు కల్పిస్తూ విద్యార్థులలోని ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఇటీవల కరీంనగర్ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పదవ తరగతి విద్యార్థి బి. సిద్ధార్థ, తొమ్మిదవ తరగతి విద్యార్థిని ముక్తహాసిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ వారికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు అధిక ఆదాయాన్నిచ్చే

## అరటి పంటలను సాగు చేయాలి

### జగిత్యాల జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జి.శ్యాంప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జి.శ్యాంప్రసాద్ గురువారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గం గ్రామంలోని పలు అరటి తోటలను పరిశీలించడం జరిగింది. ఈ సమయంలో అరటి తోటలను ఆశించే వివిధ రకాల చీడ పీడల గురించి వాటి నివారణకు చేపట్టే చర్యల గురించి రైతులకు వివరించడం జరిగింది. రైతులు సాంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్నించే అరటి వంటి పంటలు కూడా సాగు చేయాలనీ, అరటి మొక్కలు నాటుకోవడానికి ఇది అనువైన సమయం అని, మొక్క నాటిన 9 నెలల తర్వాత దిగుబడి ప్రారంభమై 2 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు. టిష్యూ కల్చర్ అరటి మొక్కలు తెచ్చి నాటుకుంటే అధిక దిగుబడి వస్తుందని, చీడ పీడల సమస్య తక్కువ ఉంటుందని జిల్లా అధికారి జి.శ్యాంప్రసాద్ తెలిపారు. బిందుసేద్యం ద్వారా నీరు అందించినట్లయితే కలుపు సమస్య తక్కువ ఉండి అధిక దిగుబడి సాధించవచ్చని జగిత్యాల జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జి.శ్యాంప్రసాద్ తెలిపారు. వారి వెంట జగిత్యాల నియోజకవర్గ ఉద్యాన అధికారి కె.స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్, రైతులు, పాల్గొన్నారు.

## వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తాం

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తామని, ఇందు కోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతి గదులను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని చిన్నారులను కలెక్టర్ వివిధ భాషల్లో పలుకరించి చదువు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లలందరినీ గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదిలో విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది సుమారు 500 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పి చదువు చెప్పించామని, ఈ సంవత్సరం కూడా మరిన్ని పాఠశాలల్లో ఈ పిల్లల కోసం ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని, ప్రత్యేక మెడికల్ క్యాంపుల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని తెలిపారు. వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసే పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ప్రభుత్వం నుండి వచ్చిన అన్ని ఆట వస్తువులను, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.


## ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గైనకాలజిస్ట్ ఔట్ పేషెంట్ వద్ద సీటింగ్ సామర్థ్యం పెంచాలని, గర్భిణీ మహిళలు నిలబడాల్సిన అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఫార్మసీ స్టోర్ లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎం.సి.హెచ్ నందు గర్భిణీ మహిళలకు,పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏవైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలలో పటిష్ఠ బందోబస్తు: డిసిపి



**ప్రజాపక్షం/ముత్తారం :** రామగుండం పోలీస్ కమీషనరేట్ సిపి ఆదేశాల మేరకు రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ముందస్తు భద్రత చర్యలలో భాగంగా ముత్తారం పోలీస్ ఆధ్వర్యంలో ఖమ్మం పల్లి, ఓడేడు, అడవి శ్రీరాంపూర్, కేసనపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) పై అవగాహన కార్యక్రమం ఈ కార్యక్రమాన్ని ముత్తారం ఎస్సై రవి కుమార్ తో పాటు సిబ్బంది తో కలిసి గ్రామాల వారీగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలు, అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులకు యువత కు ప్రత్యేకంగా ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలు వివరించి అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేస్తూ, ప్రచారాలు సమయంలో, పోలింగ్‌ను ముందురోజు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలు, నిషేధిత చర్యలు, డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, పోలింగ్ బూత్‌ల వద్ద ప్రభావం చూపే చర్యలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. ఎలాంటి అక్రమ చట్ట వ్యతిరేకమైన, ఎన్నికల ఉల్లాంఘన చర్యలు జరిగిన వెంటనే డయాల్ 100, స్థానిక పోలీస్ కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు కోరారు. ఎవ్వరు కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకుని దాడులకు గొడవలకు పాల్పడడం చేయకూడదు అన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంథని సీఐ బి. రాజు, ముత్తారం ఎస్సై రవి కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి కార్యక్రమం..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్,అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన ముఖ్య మంత్రిగా,మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా బిజి, ఎస్టీ,మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్ ,అంబా జీ,మోహన్ సింగ్,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,పరిశ్రమల శాఖ మేనేజరు నరసింహ రెడ్డి,హార్టికల్చర్ అధికారి రమణ, ఎల్డీఎం రామ్ గోపాల్,కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు వేలం వేస్తే క్రిమినల్ కేసులు నమోదు

**ప్రజాపక్షం/కౌడిపల్లి :**గురువారం కౌడిపల్లి మండల కేంద్రం లోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మూడవ నామినేషన్ రేపు పూర్తవుతుందన్నారు. అధికారులు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ స్వీకరించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు అర్హత గల అన్ని పత్రాలు సమర్పించాలన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులకు కుల సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అభ్యర్థులందరూ నూతన బ్యాంక్ అకౌంట్ తీయాలని ఎన్నికల ఖర్చులన్నీ నూతన బ్యాంక్ అకౌంట్ తోనే లావాదేవీలు జరగాలన్నారు. సర్పంచు, వార్డు పదవులకు లాంటి వేలం పాటలు పెట్టరాదు అన్నారు. పోటీ చేసిన అభ్యర్థులను వత్తిడి తెచ్చి, భయభ్రాంతులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామన్నారు. ఎంపిడిఒ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## భవనం దొరికితే హాస్టల్ తరలింపు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం /చెన్నూరు:**చెన్నూరు మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పడుతున్న అవస్థలు వాస్తవమేనని, పాఠశాల నిర్వహణకు అనుకూలమైన భవనం దొరికితే వెంటనే తరలిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి తెలిపారు. సోమవారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన 'నాలుగు గోడల మధ్య నలుగుతున్న బతుకులు' అనే కథనంపై ఆమె స్పందించారు. హాస్టల్ నిర్వహణకు అనువైన భవనం లేకనే ఇరుకైన గదుల్లో కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఐదేళ్లుగా భవనం కోసం వెతుకుతున్నామని, పాఠశాలకు 25 వేల చదరపు అడుగులు, జూనియర్ కళాశాలకు 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనాలు అద్దెకు దొరికితే తరలిస్తామని స్పష్టం చేశారు. పాఠశాల ప్రాంగణంలోని ఎరువుల దుకాణం వల్ల విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దీనిపై గతంలో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, మరోసారి ఫిర్యాదు చేస్తామని అన్నారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని, వారు ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు.

## రోశయ్య సేవలు చిరస్మరణీయం: కలెక్టర్



**ప్రజాపక్షం/నస్పూర్:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, పలు రాష్ట్రాల గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నోసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మహనీయుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంత్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/కొల్చారం :**కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో మండల పరిధిలో వరిగుంతం గ్రామానికి చెందిన అందాన గరం ఏసు రత్నం, బోడ దాస్ గౌడ్, తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన లో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా వరిగుంతం గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ దాఖల్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, ముత్యం గారి గోవర్ధన్, విజయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 16 సర్పంచ్‌లు 332 వార్డులు ఏకగ్రీవం



**ప్రజాపక్షం/మెదక్ :**మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉపసంహరణ అనంతరం బరిలో ఉన్న సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్థుల వివరాలు విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడతలో 160 గ్రామ పంచాయతీ సర్పంచులకు గాను 16 గ్రామాలకు సర్పంచ్ లు ఏకగ్రీవం అయ్యాయని, అదేవిధంగా 1402 వార్డులకు గాని 332 వార్డ సభ్యులు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. ఇందులో 14 గ్రామ పంచాయతీలలో సమస్త సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ల స్థానాలు ఏకగ్రీవం అవడంతో ఉపసర్పంచ్ ఎన్నికను గురువారం 04 డిసెంబర్ న ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. గెలిచిన పార్టీ అభ్యర్థికి కూడా ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే మిగిలిన 144 సర్పంచ్ మరియు 1072 వార్డులకు 11 డిసెంబర్ నాడు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళి పాటించి ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు,మద్యం లేక ఇతర మార్గాలను ఎన్నుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో 100 ఓటు హక్కు వినియోగించు కోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.


## అక్రమ ఇసుక లారీ పట్టివేత



**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామం నుంచి అక్రమ ఇసుక తీసుకొని వస్తున్న లారీని పెట్రోలింగ్ చేస్తున్న మోర్తాడ్ పోలీసులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారని మోర్తాడ్ ఎస్ఐరాము తెలిపారు. ఆర్మూర్ గ్రామానికి చెందిన 12టైర్ల లారీ తిమ్మాపూర్ గ్రామం నుంచి లారీలో అక్రమ ఇసుక నింపుకొని లారీని తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారని ఆయన తెలిపారు. మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ గ్రామం నుండైనా అక్రమ ఇసుక, అలాగే అక్రమ మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఇసుక కానీ, మొరం గాని ఇందిరమ్మ ఇండ్లకు అవసరం అయితే అధికారుల అనుమతితో తీసుకెళ్లాలని ఎస్ఐ సూచించారు. కానీ ఎవరైనా అధికారుల అనుమతి లేకుండా అక్రమ ఇసుక, మొరం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రాము హెచ్చరించారు.

# సర్పంచ్ ఎన్నికల్లో సాగుతున్న రౌడీ రాజకీయం

### రణరంగంగా మారుతుందనే భయాందోళనతో ప్రజలు..!




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్/మంచిర్యాల:**గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువల కంటే రౌడీ రాజకీయమే రాజ్యమేలుతోంది. నామినేషన్ల విరమణ కోసం ప్రత్యర్థులను బెదిరించడం, అధికార బలంతో పోలీసులను వాడుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాబలంతో గెలవలేక నాయకులు బెదిరింపు రాజకీయాలకు తెరలేపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు కూడగట్టుకోవడంలో విఫలమవుతున్న ఆయా పార్టీల నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, వేసిన నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేయడంలో సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగిస్తున్నారు.

**మహిళా అభ్యర్థిపై అధికార పార్టీ ప్రతాపం**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకున్న ఘటన అధికార పార్టీ దౌర్జన్యానికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ బలపరిచిన మహిళా అభ్యర్థి మాధవి నామినేషన్ విరమణకు తీవ్ర ఒత్తిడి చేశారు. నామినేషన్ ఉపసంహరించుకోవాలంటూ ఆమెను మానసికంగా వేధించారు. ఈ వ్యవహారానికి పోలీసు అధికారులు సైతం సహకరించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. **నామినేషన్ వేయొద్దంటూ మాజీ ఎమ్మెల్యే హుకుం** మరోవైపు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలంలోని చెడ్వాయి గ్రామంలోనూ బెదిరింపుల పర్వం కొనసాగింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న సోమన్నను నామినేషన్ వేయవద్దంటూ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారం కోల్పోయినప్పటికీ క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకునేందుకు మాజీ ప్రజాప్రతినిధులు సైతం దౌర్జన్యాలకు దిగుతుండటం గమనార్హం.

**పార్టీలకు అతీతంగా అక్రమాలు**

ఈ రౌడీ రాజకీయం కేవలం ఒక పార్టీకి పరిమితం కాలేదు. ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా అన్ని రాజకీయ పక్షాలు ఇదే ధోరణిని అవలంబిస్తున్నాయి. గెలుపు కోసం ఎంతటి అక్రమాలకైనా వెనుకాడటం లేదు. ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవాలు చేసుకోవడమో, లేదా పోటీ లేకుండా చేసుకోవడమో లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని, ప్రలోభాలకు, బెదిరింపులకు తావులేకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## నకిలీ ఉద్యోగాల పేరుతో మోసం

### నిబంధన 377 కింద అత్యవసరంగా పార్లమెంటులో లేవనెత్తిన నిజామాబాద్ ఎంపి అరవింద్ ధర్మపురి



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**యువతకు నకిలీ ఉద్యోగాల పేరుతో విదేశాలకు తరలించి, సైబర్ నేర గ్యాంగ్‌లకు బందీలుగా మార్చుతున్న అత్యంత తీవ్రమైన సమస్యపై లోక్ సభలో నిబందన 377 కింద గురువారం నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ అత్యవసరంగా లేవనెత్తారు. తెలుగు రాష్ట్రాల నుండి ముఖ్యంగా నిజామాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు ఈ ముఠాకు బలి అయి ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయి ఉన్నారని, యువతను థాయిలాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అక్కడికి చేరిన వెంటనే వారి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని, మయన్మార్‌లోని మాయావడ్డి వంటి తిరుగుబాటు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న సైబర్ నేర శిబిరాలకు విక్రయిస్తున్నారని అన్నారు. బాధితులకు తీవ్రమైన హింస, ఆహారం ఇవ్వకపోవడం, చీకటి గదుల్లో నిర్బంధం వంటి దారుణాలు ఎదురవుతున్నాయని ఆయా కుటుంబాలు తనకు సమాచారం అందించాయని అన్నారు. ఈ నేరాలకు స్థానిక మిలీషియా, సైన్యంలో కొందరు లంచాలు తీసుకుని సహకరిస్తున్నందున రక్షణ చర్యలు మరింత కష్టతరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, చిక్కుకున్న భారతీయులను రక్షించి, తిరిగి స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా వెనకబడ్డ జిల్లాల్లో విదేశీ ఉద్యోగ మోసాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఈ నేరాలకు సహకరిస్తున్న భారతీయ ఏజెంట్లు, రిక్రూటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## తనిఖీకి పూర్తి రికార్డులతో హాజరు కావాలి

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఖర్చులకు సంబంధించి ప్రతి పైసా నమోదు చేయాలనీ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకు రాకేష్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు ,వారి ప్రతినిధులు పూర్తి రికార్డులతో వ్యయ పరిశీలకుల పరిశీలనకు మూడు సార్లు హాజరు కావల్సి ఉంటుందని తెలిపారు. రెండవ విడత ఎన్నికలు జరగనున్న అందోల్, చౌటకూర్, పుల్కల్, వట్పల్లి, రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, మొగడం పల్లి ,కోహీర్, మునిపల్లి మండలాలకు సంబంధించిన డిసెంబర్ 8న మొదటి విడత ,డిసెంబర్ 10 రెండవ విడత, డిసెంబర్ 12నమూడవ విడతగా మూడు సార్లు అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులను రికార్డులను పరిశీలిస్తారని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో మూడవ విడత ఎన్నికలు జరగనున్న కల్హేర్, కంగ్టీ, మనూర్, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాలకు సంబంధించి డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 13 రెండవ విడత,డిసెంబర్ 15 మూడవ విడతగా మూడు సార్లు అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు రికార్డులను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఆయా తేదీలలో సంబంధిత మండల పరిషత్ అధికారి కార్యాలయంలో ఉదయం 10 నుండి 5 గంటల మధ్య ఎన్నికల ఖర్చుల రికార్డులను పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలనకు హాజరు కాని అభ్యర్తికి నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. నోటీసులకు సరియైన సంజాయిషీ లేనట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2011 జనాబా లెక్కల మేరకు 5 వేల పైగా జనాభా గల గ్రామ పంచాయతీలలో సర్పంచి అభ్యర్థి గరిష్ట వ్యయ పరిమితి రెండు లక్షలు , 50 వేలు కాగా వార్డు మెంబర్లకు 50 వేల వ్యయ పరిమితి గలదని ,5వేల లోపు జనాభా గల గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థికి గరిష్ట వ్యయ పరిమితి 1.5 లక్షలు, వార్డు మెంబర్‌కు 30 వేలు అని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార నిమిత్తం ఉపయోగించే వాహనాలకు స్థానిక తహసీల్దార్ దగ్గర అనుమతి పొందాలని ,అమతి లేకుండా వినియోగించినట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ప్రచార ఖర్చులకు సంబంధించి ప్రతి పైసాను తమ ఖర్చుల ఖాతాలో చూపించాలని ఆయన సూచించారు.

## పోలీస్ సంక్షేమానికి మరో అడుగు



**ప్రజాపక్షం/నిర్మల్ ;**పోలీస్ సంక్షేమాన్ని,శాఖాపరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలనే లక్ష్యంతో,గౌరవ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)శివధర్ రెడ్డి ఐపిఎస్ గురువారం రోజు నిర్మల్ జిల్లాలో పర్యటించారు.నిర్మల్ పోలీస్..మీ పోలీస్' అనే నినాదాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తూ,ఎల్లపల్లి వద్ద పోలీస్ అధికారులు,సిబ్బంది కొరకు అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన నివాస,కార్యాలయ భవనాలనుడిజిపిప్రారంభించారు.ఆధునిక వసతులతో కూడిన భవనాలు మెరుగైన సౌకర్యాలు,ఉన్నత జీవన ప్రమాణాలు కల్పించాలనే సంకల్పంతో నిర్మించిన ఈ భవనాలు, జిల్లాలోని పోలీసు సిబ్బందికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చనున్నాయి.అనంతరం,డిజిపిశివధర్ రెడ్డి,బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన చేతుల మీదుగా నూతన జిల్లా ఎస్పిక్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కొత్త కార్యాలయం,భవిష్యత్తులో నిర్మల్ జిల్లా పోలీసింగ్ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారనుంది.ప్రజా సేవలో నిబద్ధత అవసరం ఈ సందర్భంగాడిజిపిశివధర్ రెడ్డి మాట్లాడుతూ,పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని,దానిలో భాగంగానే ఈ ఆధునిక వసతులను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు.''నూతనంగా నిర్మించిన ఈ భవనాలు కేవలం పని ప్రదేశాలు లేదా నివాసాలు మాత్రమే కాదు,జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు,సేవల్లో నాణ్యతను పెంచేందుకు ఇవి దోహదపడాలి'' అని ఆయన అన్నారు.నిర్మల్ పోలీసింగ్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని,ప్రజా సేవలో అత్యున్నత నిబద్ధత,పారదర్శకత పాటించాలని అన్ని స్థాయి అధికారులను డిజిపి సూచించారు.ఈ ముఖ్యమైన కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపిఎస్ తో పాటు,స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి,ఐ.జి.పి(పి అండ్ ఎల్) ఎండిటి.జి.పి.హెచ్.సి రమేష్,జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,ఇతర జిల్లా ఉన్నతాధికారులు,పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, నోడల్, జోనల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 335 గ్రామ పంచాయతీలు, 2874 వార్డులను 87 జోన్లుగా విభజించామని తెలిపారు. జోనల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులు, రూట్ మ్యాప్, నెట్ వర్క్ పై ఈనెల 5వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని సూచించారు. మొదటి విడతలో భాగంగా ఈనెల 10న ఉదయం 9 గంటలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయాలని, 11వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, 2 గంటల నుంచి కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించాలని వివరించారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి సిబ్బందిని సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు వసతులు, భోజన ఏర్పాట్లు, వాహనాల సదుపాయాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్‌డిఒ లోకేశ్వర్ రావు, డిపిఒ బిక్షపతి, జడ్‌పి సిఇఒ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

## క్షుణ్ణంగా నామినేషన్ల పరిశీలన

### జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్



**ప్రజాపక్షం/భీమారం/ నస్పూర్ :**రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా 3వ విడత నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం భీమారం మండలం లోని భీమారం, బూర్గుపల్లి, కాజిపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను స్వీకరించరాదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని, గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని అన్నారు. విధుల్లో ఉన్న అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటిస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణ పనులను, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మధుసూదన్, సిఐ నవీన్ పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు అప్రమత్తతతో నిర్వహణ

### కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి:**గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఎనికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం కలెక్టర్ ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో భాగంగా ఈ నెల 11న ఈ మండలంలో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, నామినేషన్ల స్వీకరణ నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రక్రియల గురించి ఎంపిడిఒ, తహసీల్దార్ తదితర అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల సామాగ్రి ఓటింగ్ కోసం సిద్ధంగా ఉండాలని, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ పంపిణీ సరిగా జరగాలన్నారు. ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం తదితర ఏర్పాట్లను పక్కగా చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందితో పాటు భద్రతా బలగాలలో కొనసాగుతున్న సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో ఎంపిడిఒ శంకర్, తహసీల్దార్ దత్తాద్రి పాల్గొన్నారు.

## సృజనాత్మకతను పెంచేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :**విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. జిల్లా స్థాయి ఇన్స్‌పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారులు గురువారం స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.సైన్స్ ఫెయిర్‌కన్వీనర్ కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యారిని విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారుజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంచుకున్నటువంటి థీమ్,సబ్ థీమ్లు అభిరుచులకు తగ్గట్టుగా ఈ కాలానికి, మన దేశానికి అవసరమైనటువంటివిగా ఉన్నాయన్నారు. విద్యార్థులు కేవలం సైన్స్ చదవడం కాకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నటువంటి ఏఐఆప్స్ (చాట్ జిపిటి, జెమిని ఇటిసి) ద్వారా ఎటువంటి సమాచారాన్ని అయినా సరైన సూచనలు ఇచ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని మంచికి ఉపయోగించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని మన పాఠశాల విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ పొందే అవకాశం కల్పించిందన్నారు.సైన్స్ ఫయిర్ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులని కలెక్టర్ ప్రశంసించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, తమ తమ అభిరుచి, ఆసక్తి అనుగుణంగా తమ కోర్సు ఎంచుకొని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు గాను ఉన్న సౌకర్యాలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రదర్శన గదులలోని ప్రాజెక్టలని, కలెక్టర్ ప్రారంభించి వీక్షించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, పరికరాలను వీక్షించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సైన్స్ ఫెయిర్ 425 ఇన్స్‌పైర్50 ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు.

# క్రీడ

## ఆశిష్ నయా చరిత్ర

### ఆసియా ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం



**ఢిల్లీ :** భారత ఈక్వెస్ట్రియన్ ఆశిష్ లిమాయె సరికొత్త చరిత్ర సృష్టించాడు. పట్టాయ (థాయ్‌లాండ్) లో జరిగిన ఏషియన్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్స్‌లో అతడు స్వర్ణం సాధించి ఈ టోర్నీ చరిత్రలో భారత్‌కు తొలి వ్యక్తిగత స్వర్ణం అందించిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు.

# గిల్, పాండ్యా రీఎంట్రీ

### రింకు, నితీశ్‌కు నిరాశ

### దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన




**రాయ్‌పూర్ :** స్వదేశంలో ఈనెల 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు గాను వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్ధిక్ పాండ్యా రీఎంట్రీ ఇచ్చారు. ఈ మేరకు సీనియర్ మెన్స్ సెలక్షన్ కమిటీ.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని 15 మందితో కూడిన జట్టును బుధవారం ప్రకటించింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు సందర్భంగా మెడనొప్పితో రెండో టెస్టుతో పాటు వన్డేలకూ దూరమైన గిల్.. సిరీస్‌కు ఎంపికైనా అతడు ఆడేందుకు సీవోఈ నుంచి పూర్తిస్థాయి క్లీయరెన్స్ లభిస్తేనే ఆడే అవకాశముంటుందని బిసిసిఐ ప్రకటనలో తెలిపింది. ఇక ఆసియా కప్ ఫైనల్‌లో గాయపడి రెండు నెలల పాటు ఆటకు దూరంగా ఉన్న హార్ధిక్ సైతం ఇటీవలే పూర్తిస్థాయిలో కోలుకుని సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో తన ఫిట్‌నెస్‌ను చాటుకున్నా డు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడిన జట్టులో రెండు మార్పులతో జట్టును ప్రకటించారు. ఆ సిరీస్‌లో సభ్యులుగా ఉన్న ఫినిషర్ రింకు సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి జట్టులో చోటు దక్కలేదు. డిసెంబర్ 9న కటక్ వేదికగా మొదలుకాబోయే టీ20 సిరీస్.. 19న ముగియనుంది.

**భారత జట్టు**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్ధిక్ పాండ్యా, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజూ శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్,కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

# చరిత్ర సృష్టించిన జో రూట్

### ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ భారీ స్కోర్

ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోరూట్ చరిత్ర సృష్టించాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ రెండో టెస్ట్‌లో అజేయ శతకంతో చెలరేగాడు. ఆస్ట్రేలియా గడ్డపై జోరూట్‌కు ఇదే తొలి శతకం కావడం గమనార్హం. టెస్ట్‌ల్లో ఇప్పటి వరకు 40 శతకాలు సాధించిన జోరూట్.. ఆస్ట్రేలియాపై మూడెంకల స్కోర్ అందుకునేందుకు ఇన్నాళ్లు నిరీక్షించాడు. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌట వ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006 పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లాండ్ తరఫున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59*) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన్(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59*) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జో రూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ తలో వికెట్ తీసారు.



**ఫోకస్**


# ఆరోగ్యానికి వ్యాక్సిన్లు



వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. వ్యాక్సిన్ తీసుకోవడం అనేది ఆరోగ్యాన్ని కాపాడటానికి సులభమైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. చాలామంది చిన్నప్పుడే వ్యాక్సిన్‌లు తీసుకున్నప్పటికీ, కాలక్రమేణా రోగనిరోధక శక్తి తగ్గుతుంది. వయస్సుతో కొత్త ఆరోగ్య ప్రమాదాలు కూడా ఏర్పడవచ్చు. వయస్సు పెరిగేకొద్దీ వ్యాక్సిన్‌ల ప్రాముఖ్యత పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం, లక్షలాది మంది పెద్ద వాళ్లు వ్యాక్సిన్‌లతో నివారించగలిగే వ్యాధుల కారణంగా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జీవితమంతా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ, వయస్సుతో రోగనిరోధక శక్తి సహజంగానే బలహీనపడుతుంది, ఫలితంగా ఇన్ఫెక్షన్లు, వాటి సమస్యలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. వ్యాక్సిన్‌లు సదరు వ్యక్తినే కాకుండా, వారి కుటుంబ సభ్యులను, సమాజాన్ని కూడా రక్షిస్తాయి. ఎక్కువ మంది వ్యాక్సిన్ తీసుకుంటే, వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు తగ్గుతాయి. ఆరోగ్యాన్ని కాపాడగల వ్యాక్సిన్లు చాలానే ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది ఫ్లూ వ్యాక్సిన్. ప్రతి సంవత్సరం ప్రతి పెద్దవారికి ఫ్లూ వ్యాక్సిన్ అవసరం. ఇది న్యుమోనియా, గుండెపోటు, ఆసుపత్రిలో చేరడం వంటి తీవ్రమైన సమస్యలను నివారిస్తుంది. ఫ్లూ వల్ల కలిగే గుండె సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మధుమేహం, ఊపిరితిత్తుల వ్యాధి ఉన్నవారిలో ఆసుపత్రి చేరాల్సిన పరిస్థితులను తగ్గిస్తుంది, మీ చుట్టుపక్కల ఉన్న చిన్నపిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని కూడా రక్షిస్తుంది.




న్యుమోకోకల్ (న్యుమోనియా) వ్యాక్సిన్‌ను 65 ఏళ్లు పైబడిన ప్రతి పెద్దవారికి, అలాగే ఆస్తమా, గుండె వ్యాధి, ఊపిరితిత్తుల వ్యాధి, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి సిఫార్సు చేస్తారు. మీ ఆరోగ్య చరిత్ర ఆధారంగా మీ వైద్యుడు సరైన వ్యాక్సిన్‌ను సూచిస్తాడు. కొన్ని సందర్భాల్లో న్యుమోనియా ప్రాణాంతకంగా మారవచ్చు, కానీ వ్యాక్సిన్ దాని వ్యాప్తిని తగ్గించి ఆసుపత్రి చేరికలను తగ్గిస్తుంది. 75 ఏళ్లు పైబడిన పెద్దవారికి లేదా 50 నుంచి 74 ఏళ్ల వయస్సు గలిగి ఆస్తమా, సిఒపిడి, మధుమేహం, సిహెచ్‌ఎఫ్, సిఎడి వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ఈ వ్యాక్సిన్‌ను సూచిస్తారు. ఒకే మోతాదుతో, ఈ వ్యాక్సిన్ ఆసుపత్రి చేరికలు, అత్యవసర విభాగ సందర్శనలు, ఆర్‌ఎస్‌వి -సంబంధిత మరణాలను తగ్గిస్తుంది. ఆర్‌ఎస్‌వి అనేది కఫం, తుమ్ము, లేదా వైరస్ ఉన్న వ్యక్తుల ద్వారా వ్యాపిస్తుంది.




టెటనస్, డిఫ్తీరియా, పర్టుసిస్ (టిడాప్) బూస్టర్‌ను ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి ఇవ్వాలి. టెటనస్ వ్యాధి గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశించి ప్రాణాంతకమవుతుంది. కాగా, డిఫ్తీరియా గుండె వైఫల్యానికి దారితీసే శ్వాస సంబంధిత వ్యాధి. పర్టుసిస్ (వూపింగ్ కఫ్ లేదా కోరింత దగ్గు) ఎంత సమస్యాత్మకమైనదో మనలో చాలా మందికి తెలిసే ఉంటుంది. తీవ్రమైన దగ్గుతో పాటు, శ్వాసలో ఇబ్బంది కలిగించే ఈ వ్యాధి రాకుండా బూస్టర్ డోస్‌లు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల దుష్ప్రభావాలు ఉంటాయన్న అపోహ చాలా మందిలో ఉంది. నిజానికి వ్యాక్సిన్‌ల వల్ల వచ్చే దుష్ప్రభావాలు చాలా స్వల్పమైనవేనని వైద్యులు అంటారు. చేతి నొప్పి లేదా స్వల్ప జ్వరం వంటి లక్షణాలు కనిపించి, త్వరగానే తగ్గిపోతాయి. తీవ్రమైన దుష్ప్రభావాలు చాలా అరుదు. వ్యాధుల వల్ల కలిగే ప్రమాదం వ్యాక్సిన్‌లతో పోలిస్తే చాలా ఎక్కువ. వ్యాక్సిన్‌లు ప్రతి సంవత్సరం ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్లో బిలియన్ల డాలర్లను ఆదా చేస్తాయి. వ్యాధులను నివారించడం అంటే తక్కువ వైద్య సందర్శనలు, ఆసుపత్రి చేరికలు తగ్గుతాయి. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభిస్తుంది. క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి, వారి సలహాలు, సూచనలు తీసుకోవడం మరచిపోకూడదు. నిర్లక్ష్యం అసలే పనికిరాదు. వారు మీ వయస్సు, ఆరోగ్య పరిస్థితి ఆధారంగా సరైన వ్యాక్సిన్‌లను సిఫార్సు చేస్తారు. వారు సలహాలు, వైద్య సేవలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మీకు సహాయపడుతుంది. వ్యాక్సిన్లను వయస్సు పెరిగిన తర్వాత కూడా మీరు చురుకుగా, స్వతంత్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు శక్తివంతమైన సాధనాలుగా పేర్కోవచ్చు.

షింగిల్స్ వ్యాక్సిన్‌ను 50 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ వేయించుకోవడం అవసరం. ఈ వ్యాక్సిన్‌ను 2 మోతాదులుగా 2 నుంచి 6 నెలల విరామంతో ఇస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నివేదికను అనుసరించి ప్రతి 3 మందిలో ఒకరికి షింగిల్స్ వ్యాధి సోకుతుంది. చికెన్‌పాక్స్ కలిగించే వైరస్ వల్ల వచ్చే నొప్పిగా ఉండే దద్దుర్లను షింగిల్స్‌గా పేర్కొంటారు. దీనికి వేసే వ్యాక్సిన్ 97 శాతం వరకు షింగిల్స్‌ను నివారిస్తుంది, దీర్ఘకాలిక కీళ్ల నొప్పులను 91 శాతం వరకు నివారిస్తుంది.




విదేశీ ప్రయాణం చేయాలనుకునే వారు గమ్యస్థానాన్ని బట్టి అవసరమైన వ్యాక్సిన్ల కోసం వైద్యుడిని లేదా ట్రావె ల్ క్లినిక్‌ను సంప్రదించాలి. సాధార ణంగా ఎల్లో ఫీవర్, టైఫాయిడ్, కలరా, మలేరియా, జపనీస్ ఎన్‌ఫ లైటిస్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి వ్యాక్సిన్లు అవసరం. వీ టి వల్ల మీరు వెళ్లే ప్రాంతాల్లో ఉండే తీవ్రమైన వ్యాధుల నుండి రక్షణ లభిస్తుంది. ఆయా ప్రాంతాల్లో చికిత్స పరిమితంగా లేదా అందుబాటులో లేకపోవచ్చు. కాబట్టి, ముందుగా వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది. అంతేకాదు, ఈ వ్యాక్సిన్ మీరు తిరిగి వచ్చినప్పుడు ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారిస్తుంది.



## కమ్యూనిస్టుల విజయంతో అమరవీరుల ఆత్మకు శాంతి

### తనికెళ్లలో సిపిఐ అభ్యర్థిని గెలిపించాలి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థిని గడల కళావతి తరుపున సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు తనికెళ్లలో సిపిఐ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. తనికెళ్లలో భారత కమ్యూనిస్టుపార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కమ్యూనిస్టుపార్టీ మీద నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ, బిఆర్‌ఎస్, బిజెపి, సిపిఎం మద్దతునిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాలని అప్పుడే అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థిని గడల కళావతి, గడల భాస్కర్‌రావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పివిరావు, పిన్నం పుల్లయ్య, బాణోత్ వీరయ్య, పెదమల్ల రత్తమయ్య, భూక్యా ఆదిలక్ష్మి, బాసా నాగరాజు, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి జనార్ధన్, చల్లా నరసింహారావు, పొట్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికులపై పనిభారం



### ఉమ్మడి ఆదిలాబాద్ రీజినల్ గౌరవ అధ్యక్షుడు కలవేన శంకర్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఆర్‌టిసి కార్మికులపై పనిభారం తగ్గించాలని, ఆర్‌టిసిలో పేరుకుపోయిన సమస్యలను ప్రజా ప్రభుత్వంలో పరిష్కరించాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఆర్‌టిసి రీజినల్ గౌరవ అధ్యక్షుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పోలు రాజేశం అధ్యక్షతన జరిగిన మంచిర్యాల డిపో కార్మికుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసిలో యూనియన్లను నిర్వీర్యం చేయడంతో కార్మికుల సమస్యలు అనేకం పేరుకుపోయాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఆర్‌టిసి కార్పొరేషన్ సంస్థను ఆదుకోవాలని, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పలు డిపోలలో మేనేజర్లు నిబంధనలు విస్మరించి సొంత ఎజెండాతో కార్మికులను బానిసలుగా చూస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లను టిం డ్యూటీ చేయాలని ఒత్తిడి చేయడం సరికాదని, దీనివల్ల కార్మికులు ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు డిపోల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని ఈ సందర్భంగా కలవేన శంకర్ హెచ్చరించారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడిపెల్లి శ్రీనివాస్, పాషా, డిపో సెక్రటరీ గోలి శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, రాష్ట్ర నాయకుడు బొడ్డు లక్ష్మ ణ్‌తో పాటు పలువురు ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ర్యాగింగ్ అమానుషం

### కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులపై ర్యాగింగ్ ఘటన అమానుషమని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని వైద్య కళాశాల హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాగింగ్ అరికట్టాలని సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ సమత సంఘం ఆద్వర్యంలో కొత్త బస్టాండ్ ఎదుట ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వెంకట్రాజ్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం మొద టి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ముగ్గురు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడం అమానుషమన్నారు. గతంలో అడిషనల్ కలెక్టర్, ఇంతర స్వచ్ఛంద సంస్థల వారు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేసినప్పటికి ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసినప్పటికి ఆ కమిటీలు సక్రమంగా పనిచేయకపోవడం, అధికారులు, ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా జూనియర్ విద్యార్థులకు ధైర్యాన్ని ఇస్తూ విద్యార్థుల భవిష్యతును కాపాడాలని కోరారు. హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు బాబు జగ్జీవన్ రామ్, సమతాసంఘం, వేణుగోపాల్, వడ్ల నర్సింలు, సయ్యద్ సమిద, కాశా శివ శంకర్, పాముల రమేష్, పన్యాల బాబా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు అంకితమైన వారికి కమ్యూనిస్టుల మద్దతు

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, బోదన్, నిజామాబాద్ డివిజన్‌లలో సర్పంచ్, వార్డు ఎన్నికలలో సిపిఐ, ఇతర కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులతో పాటు గడచిన ప్రజాసేవకే అంకితమై పనిచేసిన అభ్యర్థులకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని నిజామాబాద్ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాతప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతున్నాయని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ డివిజన్లలో భారతీయ కమ్యూనిస్టు పార్టీ పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగే ఈ ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి గ్రామాభివృద్ధికి పాటుపడే వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. భవిష్యత్తు కాలంలో ప్రజాక్షేమము, సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధికి పనిచేసే వారిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య, జిల్లా నాయకులు పి. రంజిత్, ఆనంద్ పాల్గొన్నారు.

## జిఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు

### ఎఐటియుసి గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్

### ఆస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మూడోరోజూ నిరసన



**గద్వాల:** ప్రభుత్వ ఆస్పత్రిల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల సంఖ్య పెంచి ఉన్న కార్మికుల కు పనిభారం తగ్గించాలని, జిఒ 60ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఎఐటియుసి గద్వాల జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కొత్త టెండర్లు పిలచి శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్మెంట్ సర్వీసెస్ (ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్) పద్ధతిలో ఎక్కువ మందిని నియమించి, నియమించిన కార్మికులకు జిఒ 60 ప్రకారం వేతనాలు నెలకు రూ.26,000 ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, అధిక పని భారం తగ్గించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేస్తూ మూడో రోజు గురువారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని అన్ని విభాగాల కార్మికులు నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మూడేళ్ల కాల పరిమితి దాటినందున వెంటనే పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని కోరారు. కార్మికులు అనేక సంవత్సరాల నుంచి తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తక్కువ సంఖ్యలో కార్మికులు ఉండటంతో ఉన్న కార్మికులకు పని భారం పెరిగిందన్నారు. సరైన వేతనాలు ఇవ్వటం లేదన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటైనా సిబ్బంది కార్మికులు కొరత ఉందని దానికి అనుసంధానంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో జిల్లా హాస్పిటల్ కొనసాగుతున్న నేటికీ కార్మికుల సమస్యలు స్థితిగతులు మారలేదని ఎలైన్ సంస్థ కాంట్రాక్టర్ అందుబాటులో లేక సూపర్వైజర్ల వేధింపులతోటి తీవ్రమైన ఇబ్బందులకు కార్మికులు గురవుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. హాస్పిటల్‌లో 320 బెడ్లకు గాను 60 మందిలోపే శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ వర్కర్లు ఉండడం దారుణమైన విషయమన్నారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామారెడ్డి, ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రంగన్న మాట్లాడుతూ హాస్పిటల్‌లో పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా అదనపు పని భారం పెంచి వెట్టిచాకిరికి గురి చేస్తున్నారని ఆరోపించారు వెంటనే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్పందించి వర్కర్ల సంఖ్యను పెంచాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి దాటినందున పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులకు జిఒ నెంబర్ 60 ప్రకారం లేదా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26 వేల రూపాయలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 5న తలపెట్టిన చలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని కార్మికులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటస్వామి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వ, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు అంజి, కన్నా వెంకటేశ్వరి, చిట్టెమ్మ, జయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థి ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామపంచాయతీ ఒకటో వార్డుకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థి సనప ఇందిర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన గ్రామపెద్దలకు, వివిధ రాజకీయ పార్టీ నాయకులకు సిపిఐ శాంతినగర్ ఇన్‌చార్జి రావుల బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికయిన సిపిఐ అభ్యర్థి సనప ఇందిర మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండి పనిచేస్తానని తెలిపారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## జనగామ జిల్లాలో 10 పంచాయతీలు ఏకగ్రీవం

**ప్రజాపక్షం / జనగామ :** జనగామ జిల్లాలో పది పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మొదటి విడత స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, లింగాలగనపూర్, రఘునాథపల్లి, జఫర్‌గడ్‌లో నామినేషన్లు, స్క్రూటిని, విత్‌డ్రాలు పూర్తి కాగా 110 పంచాయతీలకు గాను 10 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. చిల్పూర్ మండలంలోన మూడు, స్టేషన్ ఘనపూర్‌లో ఒకటి, రఘునాథపల్లిలో ఐదు, జపర్‌గడ్‌లో ఒక పంచాయతీ ఏకగ్రీవం అయ్యింది. ఏకగ్రీవం అయన పంచాయతీల్లో గురువారం ఉప సర్పంచ్‌ల ఎన్నికల కూడా పూర్తి చేశారు. చిల్పూర్ మండలంలో 17 పంచాయతీలు ఉండగా దేశీయతండా, తీగల తండా, గార్లగడ్డ తండాలు ఏకగ్రీవం అయ్యాయి. స్టేషన్‌ఘనపూర్ మండలంలోని జిట్టగూడెం, జఫర్‌గడ్‌లో దుర్గానాయ క్ తండా ఏకగ్రీవం కాగా రఘునాథపల్లి మండలంలో రామన్నగూడెం, అయ్యవారిగూడెంలో సర్పంచ్, మెంబర్లు ఏకగ్రీవం అయ్యాయి.

## సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి పాటుపడాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సర్పంచ్ లు గ్రామాలల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి, పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొత్తగా ఏకగ్రీవమైన సర్పంచ్ లకు సూచించారు. గురువారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను గణపురం మండలం బుద్దారం ఏకగ్రీవ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్, పన్నెండు మంది ఏకగ్రీవ వార్డు సభ్యులు, రేగొండ మండలం కొత్తపల్లి(బీ) గ్రామ ఏకగ్రీవ సర్పంచ్ బూతం రజిత రమేష్ లు మర్యాదపూర్వకంగా పూల బొకేలు అందించి కలిశారు. అనంతరం ఎమ్మెల్యే సర్పంచ్ లకు శాలువాలు కప్పి, స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజల ఐక్యతతో, అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా సర్పంచ్ లను ఎన్నుకోవడం సంతోషమన్నారు. ఈ నిర్ణయం గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రజల విశ్వా సాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాల ని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగు నీరు, విద్యా, ఆరోగ్య రంగాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో అవసరమైన చోట నా(ఎమ్మెల్యే) పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

## సజావుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశం



**ప్రజాపక్షం / జనగామ:** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న మొదటి విడత ఎన్నికలు జరగనున్న చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, రఘునాథపల్లి, జఫర్‌గడ్, లింగాలఘనపూర్ మండలాలకు బ్యాలెట్ పత్రాలు అందజేశారు. ఎంపిడిఓలకు బ్యాలెట్ పత్రాలు అందజేయడంతో పాటు పోలింగ్ నిర్వయించే పాత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిడిఓలు తమ మండల పరిధిలో ఎన్నికలు జరిగబోయే గ్రామ పంచాయతీల వారిగా పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్యకు ఫారం తొమ్మిది ఆదారంగా ఆర్‌ఓ11కు ఓటరు జాబితాలోని ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కేటాయించాలనిన్నారు. ఆర్‌ఓ2 ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి ఫారం 14 ధరఖాస్తు చేసుకున్న వాళ్లు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, మొదటి వడత ఎన్నికలు జరిగే 5 మండలాల ఎంపిడిఓ కార్యాలయాల వద్ద ఈ నెల 9 వినియోగించుకోవచ్చునన్నారు.

**తొలి విడత పోలింగ్ కోసం సిబ్బందికి ర్యాండమైజేషన్ కేటాయింపు**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వాహణలో భాగంగా తొలి విడత పోలింగ్ కోసం సిబ్బందిని ర్యాండమైజేషన్ కేటాయింపు ప్రక్రియ ద్వారా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మొదటి దశ పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియ సాదారణ ఎన్నికల అబ్జర్వర్ రవి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఎన్నికల సంఘం నిభందనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా మొదటి దశలో 3042 పిఓలు, 3899 ఓపిఓలు, రెండవ దశ జరిగిన ర్యాండమైజేషన్ ధ్వారా పిఓలు1138,ఓపిఓలు1552లనుఎంపికచేయడంజరిగిందన్నారు.

## అసెస్మెంట్‌ల కొలతలు పక్కాగా నమోదు

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** అసెస్మెంట్‌ల కొలతలు పక్కాగా నమోదు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం హంటర్ రోడ్డు ప్రాంతంలో శాయంపేట జంక్షన్ విల్లాస్ రోడ్డు భద్రకాళి బండ్ వైపు వెళ్ల ప్రాంతాల్లో నమోదు చేసిన అసెస్మెంట్‌ల కొలతలను కమిషనర్ క్షేత్రస్తాయిలో పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బల్దియా రెవెన్యూ అధికారులు నమోదు చేసిన కొలతలను కమిషనర్ పునః పరిశీలించి నిర్ధారణ చేసి నమోదు తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడుతూ నూతన నిర్మిత భవనాలకు పర్మిషన్ డాక్యుమెంట్‌ను పరిశీలించి అందుకు అనుగుణంగా కొలతలు నమోదు చేయాలని సూచించారు. ఇట్టి పరిశీలనలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్ఐ రజినీ, వార్డు ఆఫీసర్ శిరీష, బిల్ కలెక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ విభాగం ఎ. ఆర్ అసిస్టెంట్ సబ్ ఇన్స్‌స్పెక్టర్లు గా పొందిన మల్లారెడ్డి, సాధిక్ అలీ,బీర్ దేవ్ లు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అధికారులు అప్పగించిన పనులను సమర్ధవంతంగా పూర్తి చేయడంతో పాటు పోలీస్ శాఖకు పేరు ప్రతిష్ట పెంచే విధంగా విధులు నిర్వహించాలని సిపి తెలిపారు.

# మేడారం మహాజాతరపై కేంద్రం వివక్ష

- జాతీయ హోదా ఇవ్వలేమన్న కేంద్ర మంత్రి
- జాతర నిధులు ఇవ్వమని కేంద్రం వెల్లడి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం గిరిజన జాతరపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. మేడారంజాతరకు జాతీయ హోదా ఇవ్వడంలోనూ కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.ఇటీవల హనుమకొండ జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేమని కుండబద్దలు కొట్టారు. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న భక్తులను కేంద్ర మంత్రి వ్యాఖ్యలు నీరుగార్చేలా చేశాయి. జాతీయ హోదా ఇవ్వక పోగా మేడారం జాతరకు నేటికీ ఎలాంటి నిధులను ఇవ్వకపోవడం మేడారం పట్ల వివక్షతను స్పష్టం చేస్తున్నది. దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాల నుండి ఏటా కోటిన్నరకు పైగా భక్తులు వన దేవతలను దర్శించుకుంటారు. వచ్చే నెలాఖరులో ఈ మహా వేడుక ప్రారంభం కానున్నప్పటికీ. మేడారం అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు నిధుల కేటాయింపులపై కేంద్రం దృష్టి పెట్టనేలేదు. గత మూడేళ్లుగా నామమాత్రపు నిధులు మాత్రమే విదిలిసస్తోంది. మరోవైపు నేటికీ ప్రత్యేక రైళ్ల ఏర్పాటుపై రైల్వే శాఖ ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో భక్తుల్లో ఆందో ళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతర అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసు కున్నది. వచ్చే నెల జనవరి 28 నుంచి 31 వరకు జరిగే ఈ పండగకు రూ.251 కోట్లు కేటాయించింది. సమ్మక్క, సారలమ్మల గద్దెల ఆధునికీకరణతో పాటు ప్రాకారం విస్తరణ, రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. కాగా కేంద్ర సాయం నామమాత్రంగానే అందిస్తున్నది. 2020లో తెలంగాణకు చెందిన నలుగురు బిజెపి ఎంపిలు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రులను కలిసి జాతరకు జాతీయ హోదాతో పాటు నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్రం గిరిజన సంక్షేమశాఖ నుంచి రూ.6.10 కోట్లు కేటాయించింది. 2022లో రూ.2.50కోట్లు, 2024లో రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకొంది. కనీసం కేంద్రం ప్రసాద్ స్కీం ద్వారానైనా రూ.50కోట్లు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు.

**జాతీయ హోదాపై ఎదురు చూపులు**

మేడారం మహాజాతరను 1996లో అప్పటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించింది. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల రద్దీ పెరగడంతో మేడారం రోడ్లను విస్తరించారు. 2002 నుంచి జాతరకు జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంది. 2018లో మేడారానికి జాతీయ హోదా ఇచ్చేందుకు అన్ని రకాల దస్త్రాలను గిరిజన సంక్షేమశాఖ కేంద్రానికి సమర్పించింది. అప్పటి నుంచి మేడారం మహాజాతరకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం తేల్చడం లేదు. రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు చొరవ తీసుకోవాల్సి ఉంది.

**జాతర రైళ్లు కూత పెట్టేనా..?**

తెలంగాణ, ఎపిలతో పాటు చత్తీష్ గఢ్, మహా రాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్‌ల నుంచి భక్తులు వస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం వీరికోసం సరైన ఏర్పాట్లు చేయటం లేదు. రైళ్ల పొడిగింపుతో పాటు జాతరకు ప్రత్యేక రైళ్లను నడి పించాల్సి ఉంది. 2014 నుంచి 2024 వరకు ఆరు సార్లు మాత్రమే రైల్వేశాఖ పదహారు ప్రత్యేక రైళ్లను నడిపింది. కాగజ్ నగర్ కాజీపేట, వరంగల్ సికిం ద్రాబాద్, ఖమ్మం వరంగల్ కాగజ్నగర్ మధ్య ప్యాసింజర్ రైళ్లను భక్తులకు అందుబాటులో ఉంచింది. వీటితో ఢిల్లీ, పుణె, ముంబయి, చెన్నై, బెంగళూరు లాంటి మెగా సిటీల నుంచి రైళ్లు వరంగల్, కాజీపేట వరకు నడిపించాలని భక్తులు కోరు తున్నారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ఆర్టీసీ బస్సుల్లో, ప్రవేటు వాహానాల్లో జాతరకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక రైళ్లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు చొరవ తీసుకుని నిధుల విడుదల, జాతీయహోదాపై కేంద్రంతో ప్రకటన చేయించాలని కోరుతున్నారు.

## సిఎం సార్.. చిరకాల సమస్యలను తీర్చండి

అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రాకపై ప్రజల్లో హర్షం

**ప్రజాపక్షం/నర్సంపేట:** సుమారు రూ.1000కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనకు నేడు(శుక్రవారం) వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. పాకాల రోడ్డులోని మెడికల్ కాలేజీ ముందు స్థలంలో బహిరంగ సభలో పాల్గొంటారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి నర్సంపేటకు వస్తుండగా స్థానికుల్లో ఆయన పర్యటన పట్ల ఆసక్తి నెలకొంది. నియోజకవర్గంలో నల్లబెల్లి, నర్సంపేట, దుగ్గొండి మండలాల్లో చపాటా మిర్చి సాగవుతోంది. ఇటీవల ఈ మిర్చికి భౌగోళిక గుర్తింపు కూడా దక్కింది. ఈ ప్రాంత మిర్చి రైతుల కోసం గత ప్రభుత్వంలో నల్లబెల్లి మండలంలో పరిశోధన కేంద్రానికి శంకుస్థాపన చేశారు. కానీ రెండేళ్లు దాటినా ఆ పనులు ఇంత వరకు మొదలు పెట్టలేదు. రైతుల శ్రే యస్సు కోసం పార్టీలను పక్కనపెట్టి ఆ పనులపై దృష్టి సారించాల్సి ఉంది. కాకతీయుల కాలం నాటి పాకాల సరస్సు పర్యాటకాభివృద్ధికి కొన్ని పనులు చేస్తున్నారు. కానీ ఆశించినంత మేర పర్యాటక ఆకర్షక పనులు జరగడం లేదని స్థానికుల్లో నిరాశ కనబడుతోంది. కట్టపై నుంచి చిలుకలగట్టు వరకు కేబుల్ బ్రిడ్జి, కట్టపై సుందరీకరణ, విద్యుత్ లైట్ల ఏర్పాటు చేసి రాష్ట్ర స్థా యిలో టూరిజం ప్రాంతంగా చేయాల్సి ఉంది. నియోజకవర్గంతో పాటుగా పర్వతగిరి, గూడూరు, సంగెం మండలాలకు చెందిన ప్రజలకు ప్రధాన రైల్వే స్టేషన్ అయినటువంటి నెక్కొండలో పలు ట్రైన్ల హాల్టింగ్ కోసం రాష్ట్ర ప్రభు త్వం తరపున కేంద్రం దృష్టికి తీసుకెళ్లేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయినందున సివిల్ ఆసుపత్రిని నెక్కొండ లేదా దుగ్గొండిలో ఏర్పాటు చేస్తే వైద్య పరంగా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. నర్సంపేటలోని పాత ప్ర భుత్వ ఆసుపత్రిని మాతా శిశు సంరక్షణ కేంద్రంగా మార్చి నిధులు కేటాయించాల్సి ఉంది. దినదినాభివృద్ధి చెందుతున్న నర్సంపేట పట్టణానికి భవిష్యత్ అవసరాల దృష్ట్యా రింగ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ట్రాఫిక్ సమస్య నిత్యం వేధిస్తున్నందునా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి. విలీన గ్రామాలతో కలుపుకొని పట్టణంలో సుమారు 90వేల జనాభా ఉంది. ఇంత పెద్ద నగరంలో ప్రజలు సేదతీరెందుకు కనీసం ఒక్క పార్కు కూడా లేదు. కు మ్మరికుంట పార్కు అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చం దంగా ఉంది. మాదన్నపేట సరస్సు సుందరీకరణ( మినీ ట్యాంక్ బండ్) కూ డా అసంపూర్తిగానే ఉంది. సిఎం పర్యటనలో నర్సంపేటకు వరాల జల్లు కురిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## తండా సందీప్, బానోత్ లింగ్య నాయక్ సిపిఐ అభ్యర్థులను ఆదరించండి

ప్రచారం ప్రారంభించిన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి. అజయ్ సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ మండలంలోని ముడుపుగల్, దా మ్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా తండా సందీప్, బానోత్ లింగ్య నాయక్ గెలుపు కోరుతూ నేడు ముడుపుగల్, దామ్య తండా గ్రామపంచాయతీ అభ్యర్థులను గెలిపించాలని గ్రామాల్లో గురువారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి. అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. మానుకోట మండలం ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ దే అన్నారు. యువకులైన తండా సందీప్, బానోత్ లింగ్య నాయక్ లను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో రైతుల సమస్యలపై కార్మికుల సమస్యలపై విద్యార్థుల సమస్యలపై యువకుల సమస్యలపై అనునిత్యం ఉద్యమిస్తూ ఈ ప్రాంతంలో చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐది అన్నారు. సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే మీ గడప ముందు నిలబడి పని చేస్తారని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో తెలంగాణ ఉద్యమం మరియు జిల్లా సాధన ఉద్యమం, యూరియా, విత్తనాలు అనేక రైతాంగ పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ దేనని గుర్తుచేశారు. ప్రజలు సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించి భారీ మెజార్టీతో ఓట్లు అభ్యర్థించారు. పొలగాని శ్రీను, సుమన్, తండ సతీష్ ,తేజ, వినయ్, విజయ్, గురు స్వామి శేఖర్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి , వీరవెల్లి రవి, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, మంద శంకర్ ,తండా శ్రీనాథ్, మంద శ్రీను, చిలువేరు వికాస్, కృష్ణ,మేక వెంకటేష్, బోళ్ల భద్రయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో మాజీ సిఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి

నివాళ్లు అర్పించిన కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్థంతిని నిర్వహించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, మెప్మా పీడీ జోనా, ఇతర అధికారులతో పాటు కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** అవసరమున్న ప్రతి డివిజన్‌లలో పార్టీలకు అతీతంగా చరిత్రలో నిలిచే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గురువారం 4వ డివిజన్ అక్షర కాలనీ, యాదవ నగర్, 9 డివిజన్ గణేష్ నగర్‌లలో సూమరు రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు,సీసీ డ్రైన్‌లు, పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా వార్డులలో స్థానిక ప్రజలతో కలిస్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ను సత్కరించికుని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. .తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం ప్రతి పనిని త్వరగతిన పూర్తి చేసేలా అధికార యంత్రంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతి డివిజన్లలో అభివృద్ధి పర్యటనలు చేస్తున్న క్రమంలో ప్రజలనుంచి విశేష ఆదరణ కనిపిస్తుందని అన్నారు.ఇటీవలే జరిగిన కౌన్సిలో సుమారు 30 కోట్ల ప్రతిపాదనలు చేశానని,జీడబ్ల్యూఎంసీ పరిధిలో గతంలోకంటే మెరుగైన సౌకర్యాలు,సంక్షేమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.వచ్చే నెలలోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు మొదలు కానున్నాయని వెల్లడించారు.యూడీసీ పనులలో కొత్త సీసీ రోడ్లకు సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.వచ్చే ఏడాది చివరకి నియోజవకర్గ పరిధిలో ప్రధాన,అత్యవసర రోడ్లు,డ్రైన్ ల నిర్మాణాలు పూర్తి అవుతాయని హామీ ఇచ్చారు.పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల విషంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## రోశయ్య సేవలు చిరస్మరణీయం

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఇతర అధికారులతో కలిసి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలామల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నో సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారని తెలిపారు. అనంతరం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. రాజకీయాలలో స్వచ్ఛమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని, రోశయ్య వర్థంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్‌బాబు, మంజుల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు

పార్లమెంట్‌లో లేవనెత్తిన వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో రవాణా వ్యవస్థ విస్తరణ, రోడ్లకు నిధుల కేటాయింపు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాల నియంత్రణ అంశాలపై వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రధానంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర రహదారి రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరి సమాధానం ఇచ్చారు.పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ విస్తరణపై వివరాలు: దేశంలో బస్సు సేవలు, రూట్ల పెంపు రాష్ట్రాల పరిధిలోనే ఉన్నప్పటికీ, మెట్రో ప్రాజెక్టులు వంటి కీలక పట్టణ రవాణా పథకాల ద్వారా కేంద్రం సహకరిస్తోందని గడ్కరి తెలిపారు. 25 నగరాల్లో 1,083 కి.మీ. మెట్రో మార్గాలు ప్రస్తుతం నడుస్తున్నాయని, వాటిలో హైదరాబా ద్ మెట్రో కూడా ఉందని చెప్పారు. 2023 ఆగస్టులో ప్రారంభించిన పిఎం—ఈబస్ సేవ పథకం కింద 10,000 ఎలక్ట్రిక్ బస్సులు అందించేందుకు రూ.20,000 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 106 నగరాలకు 9,360 ఈబస్సులను ఇప్పటికే ఆమోదించినట్లు తెలిపారు. వరంగల్ నగర రవాణా సేవలు కూడా మరింత మెరుగయ్యే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు.



**సిఆర్ఐఎఫ్ కింద గణనీయ నిధులు:** సెంట్రల్ రోడ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద తెలంగాణకు గత నాలుగేళ్లలో కేటాయింపులు, విడుదలలను మంత్రి వివరించారు. 2022—23: రూ.304.27 కోట్లు (విడుదల: రూ.275.89 కోట్లు),2023—24కు రూ.335.09 కోట్లు (విడుదల రూ.366.38 కోట్లు), 2024—25కు రూ.335.58 కోట్లు (విడుదల రూ.335.59 కోట్లు),2025—26కు (అక్టోబర్ 31 వరకూ): రూ.367.17 కోట్లు (విడుదల: రూ.344.49 కోట్లు)గా ఉన్నాయి. కొన్ని సంవత్సరాల్లో విడుదలలు కేటాయింపులకంటే ఎక్కువగా ఉండటానికి పాత ఖాళీ నిల్వలు సర్దుబాటు కావడమే కారణమని మంత్రి తెలిపారు. ఈ నిధులు రాష్ట్ర రహదారి సంరక్షణకు, వరంగల్ వంటి ప్రాంతాల కనెక్టివిటీకి కీలకమని వివరించారు.

**ప్రమాదాల నియంత్రణకు ఆధునిక ఎటిఎంఎస్:** ప్రమాదాల నియంత్రణ కోసం ఎన్‌ఎచ్ఏఐ అత్యాధునిక ఎటిఎంఎస్ వ్యవస్థను 4—6 లేన్ హైవేలపై అమలు చేస్తోందని గడ్కరి అన్నారు. 24X7 సిసిటివి, ఎఎన్ పిఆర్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కోసం సోషల్ మీడియా ప్రచారాలు, ప్రముఖుల సందేశాలు, డ్రైవర్ల ఆరోగ్య శిబిరాలు, ఓవర్‌లోడింగ్—ఓవర్‌స్పీడ్—డ్రంక్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దాడులు చేపడుతున్నట్లు వెల్లడించారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన : సిఇఒ



ప్రజాపక్షం/జూలూరుపాడు: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. జూలూరుపాడు మండల పరిధిలోని పడమటి నరసాపురం, కొమ్ముగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించాలన్నారు. నిర్దేశించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని సూచించారు.

## మహనీయుల జీవితం ఆదర్శణీయం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లు పాల్గొని రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా,ఆర్థిక, రవాణా, గృహ నిర్మాణ, వాణిజ్య పన్నులు, విద్యా, వైద్యశాఖ మంత్రిగా విశిష్ట సేవలు అందించారన్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో గవర్నర్‌గా పనిచేశారని తెలిపారు. మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తహసిల్దార్లు, ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.

## సర్పంచ్ స్థానాలకు 106 మంది పోటీ




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో సర్పంచ్ స్థానాలకు 106 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 37 గ్రామ పంచాయతీలకు గాను రేగులచలక, మల్లెపల్లి, మంగ్యాతండా, రాములు తండా గ్రామ పంచాయతీలు సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా రఘునాథపాలెం సర్పంచ్ స్థానంతో పాటు 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండు వార్డులలో పోటీ నెలకొంది. మిగిలిన 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు 106 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బద్యాతండాలో నలుగురు, బావోజీతండాలో ఇద్దరు,బూడిదంపాడులో ముగ్గురు, చెరువుకొమ్ము తండాలో ముగ్గురు, చిమ్మపుడిలో నలుగురు, చింతగుర్తిలో నలుగురు, దొనబండలో ఐదుగురు, ఈర్లపుడిలో నలుగురు, జికె బంజరలో ఇద్దరు, గణేశ్వరంలో ఇద్దరు, హర్యాతండాలో ఎనిమిది మంది, కెవి బంజరలో ఇద్దరు, కొర్లబోడుతండాలో ఇద్దరు, కోటపాడులో ముగ్గురు, కోయచలకలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీలో ఉన్నారు. లచ్చిరాంతండాలో ముగ్గురు, మంచుకొండలో ఇద్దరు, మూలగూడెంలో ఇద్దరు, ఎన్‌వి బంజరలో ఇద్దరు, పంగిడిలో నలుగురు, పాపటపల్లిలో ఆరుగురు, పరికలబోడులో ఐదుగురు, పుతాని తండాలో నలుగురు, పువ్వాడ నగర్‌లో ఏడుగురు, రజబ్‌అలీ నగర్‌లో ఇద్దరు, రాంక్యాతండాలో ఇద్దరు, శివాయిగూడెంలో ఇద్దరు, సూర్యాతండాలో ఇద్దరు, విఆర్ బంజరలో ఇద్దరు, వి. వెంకటాయపాలెంలో ముగ్గురు, వేపకుంట్లలో ఐదుగురు, జింకలతండాలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీ పడుతున్నారు. ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి.కాంగ్రెస్, సిపిఐ మధ్య పోటీ నెలకొంది.

## కాంగ్రెస్ అభ్యర్థులను బలపరిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి



ప్రజాపక్షం/బూర్గంపాడు:సారపాక సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కిషోర్ శివరాం నాయక్‌ని గెలిపించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహిమద్ ఖాన్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని, మిగతా 13 కూడా గెలిచి మొత్తం 18 పంచాయతీలను ఎమ్మెల్యేకి గిఫ్ట్‌గా ఇస్తామని అన్నారు.

## ప్రజాప్రతినిధిగా రోశయ్య సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : ప్రజాప్రతినిధిగా కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాల గవర్నర్‌గా విశిష్టమైన సేవలు అందించారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక భవిష్యత్‌కు ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. అధికారులు పరంధామరెడ్డి, విజయలక్ష్మి , రామిరెడ్డి తదితరుల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈనెల 21న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ బంధానికి చెందిన కేసులు, ట్రాఫిక్ చాలానా, డ్రక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, బ్యాంకు లావాదేవీలు, టెలిఫోన్ బకాయిల కేసులు, కొట్టుకున్నకేసులు, సైబర్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో లాజీ చేసుకుని కేసులను పూర్తి చేసుకోవాలని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# అటవీ భూముల ఆక్రమణను అనుమతించొద్దు

### వైల్డ్ లైఫ్ సంరక్షణకు పటిష్ట చర్యలు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాలువల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పొరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వంద ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను జిల్లాపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని రెవెన్యూ, అటవీ శాఖాధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అటవీ జంతువులను వేటాడితే రూ. 25వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పోడు పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడినా, అటవీ భూములను ఆక్రమించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11కెవి లైన్లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీలాద్రి అర్బన్ పార్కు పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జంతువుల పార్కు కాంపౌండ్ వాల్ దూకి రోడ్లపైకి వచ్చి ప్రమాదాల భారినపడుతున్నాయని కాంపౌండ్ వాల్ ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీలాద్రి, వెలుగుమట్ల, పులిగుండాల, అర్బన్ పార్కులను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, యువత, పిల్లలను ఆకర్షించేలా పార్కులో జంతువులను ఏర్పాటు చేయాలన్నారు. నైట్ సఫారీ ఏర్పాటు అవకాశాలు పరిశీలించాలన్నారు. గ్రామం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు కోతుల సమస్య ఉందని, రోడ్లపై కూడా కోతులకు ఆహార పదార్థాలు ఇవ్వవద్దని దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు, బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసే భూములకు ప్రభుత్వం అందించిన పోడు పట్టాలు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడానికి వీలు లేదని అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లాలోని వెట్ ల్యాండ్లను గుర్తించి వాటి సంరక్షణకు నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడత చింతకాని మండలంలో తుమ్మల చెరువు వద్ద వెట్ ల్యాండ్ గుర్తించామని దీని సంరక్షణకు నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు విడతలలో జిల్లాలో కనీసం 100 వెట్ ల్యాండ్లను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేయాలని, వెట్ ల్యాండ్ వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎమ్. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి , జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థిని బలపరిచండి



ప్రజాపక్షం/భద్రాచలం : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సిపిఐ బలపరిచిన 16వ వార్డు అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పితాని హెప్సిబా ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆమె వార్డులో గురువారం విస్తృత ప్రచారం చేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుకున్న తనకు ప్రజలకు సేవచేసే అవకాశాన్ని ఇవ్వాలన్నారు. ఎంతో కాలంగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదని, తాను గెలిచిన వెంటనే ప్రథమ ప్రాధాన్యతగా దానిని ప్రారంభిస్తానని చెప్పారు. వార్డులో నెలకొన్న మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండి పనిచేస్తానని అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్, నాయకులు పసుపులేటి నాగు, తాళ్ల చంటి, రాంబాబు, స్వప్న, మరియమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## గడగడపకు మానే ప్రచారం

ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలోని 18,19,20 వార్డుల్లో బిఆర్ఎస్ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి మానె రామకృష్ణ గురువారం ప్రచారం నిర్వహించారు. సిపిఎం, జిడిపి జెఎసి సంఘాలతో కలిసి ఆయన వార్డుల్లో కలియతిరిగారు. సౌమ్యునిగా పేరున్న మానే రామకృష్ణ ప్రచారానికి చక్కటి స్పందన లభిస్తోంది. తనను సర్పంచ్ అభ్యర్థిగా ఆదరించి దీవించాలని, ఈనెల 11వ తేదిన జరిగే ఎన్నికల్లో 5 నెంబర్‌లో ఉన్న తన ఎన్నికల గుర్తు లేడీపర్సుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తానను సర్పంచ్‌గా గెలిపిస్తే భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో దశాబ్ద కాలంగాపేరుకు పోయిన సమస్యలను పరిష్కారంచేందుకు కృషి చేస్తానని, ప్రధాన సమస్యలకు ఓ పరిష్కార మార్గాన్ని చూపుతామనని అన్నారు.



## ఏకగ్రీవాల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక






ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని రేగులచలక, మల్లెపల్లి, రాములుతండా, మంగ్యాతండా గ్రామ పంచాయతీలు సర్పంచ్ స్థానంతో పాటు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో ఆర్‌వోల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికైన వారికి పత్రాలు అందజేశారు. అనంతరం ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేగులచలక ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్ తరుపున నున్నా వెంకటేశ్వర్లు, మల్లెపల్లి ఉప సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన బండి వెంకన్న, రాములుతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ మానస, మంగ్యాతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. మల్లెపల్లిలో సర్పంచ్‌గా పనిచేశారు. నున్నా వెంకటేశ్వర్లు గత ఎన్నికల్లో రేగులచలక ఉప సర్పంచ్‌గా పనిచేశారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులను అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రావెల్ గుట్ట మాయం





ప్రజాపక్షం/చర్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన గ్రావెల్ గుట్టను గత పదిరోజులుగా భారీ మిషన్లు, టిప్పర్లు, లారీలు ద్వారాబయటకు తరలిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో గల గ్రావెల్ గుట్టను ఉచితంగా మండలంలోని వివిధ ఇసు క్వారీలకు తరించటం వల్ల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీ ఆస్తిగా ఉన్న గ్రావెల్‌ను ఆదాయంగా మార్చుకుని కళాశాల అభివృద్ధి పనులకు ఉపయోగించకుండా కాలేజీ అధికారులు ఇష్టాను సారంగా బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై కళాశాల ఆఫీస్ ఇంచార్జ్ ను వివరణ కోరగా గ్రావెల్ తవ్వడం, తరలించడం పై తాము 3వ తేది బుధవారం తహశిల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినప్పటికీ ఇసుక కాంట్రాక్టర్లు కళాశాల ఆవరణలో మిషనరీలు, డీజిల్ పీపాలు ఉంచి రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్ తోలడానికి సిద్ధపడుతున్నారన్నారు. ఇదే విషయంపై తహశిల్దార్ ఎం శ్రీనివాస్‌ను కాలేజీని నుండి ఏదైనా ఫిర్యాదు వచ్చిందా అని అడగగా, నేను చెప్పను కాలేజీ వారినే అడగండీ వారే చెబుతారు అనే సమాధానం ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ కాలేజీలో ఉన్న గ్రావెల్ గుట్టను అక్రమంగా తరలించడం పట్ల అధికారుల వైఖరి ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది. అక్రమంగా గ్రావెల్ తవ్వకం తరలింపుపై జిల్లా కలెక్టర్ దృష్టిపెట్టి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి : ప్రసాదరావు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని, ఎన్నికలు సజావుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలంలో ఎన్నికలకు నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యులతో గురువారం గణేష్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆరోపణలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, స్థానిక ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన వాతావరణం కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ.. ఆ 'ముగ్గురి' మధ్యే!




### హస్తం గూటిలో కుదిరిన సయోధ్య

### తీవ్ర నిరాశలో మాజీ సర్పంచ్ శ్వేత

ప్రజాపక్షం/భద్రాచలం : దశాబ్దకాలం తర్వాత భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొంది. అభ్యర్థుల తుదిజాబితా ఖరారు కావడంతో తొలివిడత ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ప్రధాన పోటీ సర్పంచ్ పదవిదే కావడంతో ఆ ముగ్గురు మధ్యే తీవ్రమైన పోటీ ఉండే అవాశం ఉంది. సర్పంచ్ అభ్యర్థులుగా మొత్తం ఐదుగురు సభ్యులు పూనెం కృష్ణదొర, మానే రామకృష్ణ, హరిచంద్రనాయక్, పూనెం ప్రదీప్, కొమరం కృష్ణవేణి భరిలో ఉన్నారు. కాగా సిపిఐ పొత్తులో కాంగ్రెస్ బలపరిచిన పూనెం కృష్ణ, సిపిఎం, గిరిజన సంఘాలు బలపరిచిన మానె రామకృష్ణ, టిడిపి, జనసేన మిత్రపక్షంగా బిజెపి బలపరిచిన హరిచంద్ర నాయక్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకొననుంది. ఒకానొక దశలో హరిచంద్రనాయక్ అభ్యర్థిత్వానికి చిక్కు ఎదరవడంతో కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కోర్టు జోక్యంతో ఆయన పోటీలో నిలిచేందుకు అవకాశం దక్కింది. తెల్లం వెంకట్రావు, మాజీ ఎంఎల్‌ఏ, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొందెం వీరయ్య వర్గాలు కాంగ్రెస్ పార్టీ బలంతో వేర్వేరుగా నామినేషన్లు సమర్పించాయి. మరో ప్రక్క తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో పాల్గొని, టిఆర్ఎస్ నుండి భద్రాచలం ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీ చేసిన మానె రామకృష్ణకు సౌమ్యునిగా పేరుంది. బిఆర్ఎస్ పార్టీ బలపరుస్తూ సిపిఎం పొత్తులో భరిలో ఉండటంతో గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న తరుణంలో ఎవరి గెలుపుపై వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బలాబలాలు, అంగఅర్థ బలాల నడుమ ఎవరి మెడలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వరమాల పడనుందో వేచి చూడాలి.

# మసకబారుతున్న పోలీస్ ప్రతిష్ఠ



### హత్య కేసును ఛేదించడంలో జాప్యం

### నిందితుల కోసం అన్వేషణ

### కొలిక్కి రాని దర్యాప్తు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం పోలీస్ శాఖ గత కొన్నేళ్లుగా అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ నేరాలను అరికట్టడంలోనూ, శాంతి భద్రతలను కాపాడటంలోనూ ప్రశంసలు పొందుతుంది. ముఖ్యంగా అసాంఘిక శక్తుల ఆటకట్టించడం, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి కట్టడి చేయడంలోనూ మంచి ఫలితాలను సాధించింది. కానీ నెల రోజులుగా ఖమ్మం పోలీస్ శాఖపై వస్తున్న విమర్శలు, ఆరోపణలు ఆ శాఖ ప్రతిష్టతను మసకబారుస్తున్నాయి. అక్టోబర్ 31న సిపిఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్య కేసు తర్వాత దర్యాప్తులో జరుగుతున్న జాప్యం, సిపిఎం ఆందోళనలు, ఆరోపణలు పోలీస్ శాఖ వైపు వేలెత్తి చూపేలా చేస్తున్నాయి. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటి వద్ద తెల్లవారుజామునే హత్య చేశారు. హత్య జరిగిన తర్వాత దీనిని సుపారీ హత్యగా భావించారు. ఇందుకు భిన్నంగా సామినేని రామారావు సతీమణి సరోజిని పాతర్లపాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి మొదలైన దర్యాప్తు ఇంత వరకు ఒక కొలిక్కి రాలేదు. పోలీస్ అధికారులు ఇది రాజకీయ హత్య కాదు అని హత్య జరిగిన కొన్ని గంటల్లోనే ప్రకటించారని రాజకీయ హత్య కాదని పోలీసులు గంటాపదంగా చెబుతున్నప్పుడు ఎవరు హత్య చేశారో తేల్చడంలో జాప్యమెందుకని సిపిఎం ప్రశ్నిస్తుంది. రాజకీయ హత్య కానప్పుడు ఎందుకు రామారావును హత్య చేయాల్సి వచ్చిందో పోలీసులు వివరించాలని రాజకీయ హత్య కానప్పుడు ఆర్థికపరమైన అంశాలతో కూడిన హత్య అయినప్పుడు ఇందుకు ప్రోత్సహించింది ఎవరు...? సుపారి ఇచ్చింది ఎవరు...? హత్య వెనక ఉన్నది ఎవరన్నది ఎందుకు తేల్చడం లేదని సిపిఎం ఆందోళన బాట పట్టింది. 35 రోజులుగా హత్య కేసు కొలిక్కి రాకపోవడంతో రక రకాల ప్రచారాలు ఊపందుకున్నాయి. పోలీస్ దర్యాప్తు ముమ్మరంగానే సాగుతుందని కానీ హత్యకు సంబంధించి సాంకేతిక ఆధారాలు లభ్యం కావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికే పదుల సంఖ్యలో అనుమానితులను విచారించడంతో పాటు వందల సంఖ్యలో ఫోన్లపై నిఘా ఏర్పాటు చేశారు. ఏ అంశాన్ని వదలకుండా దర్యాప్తు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ కేసు కొలిక్కి రాకపోవడమే విమర్శకు కారణమవుతుంది. సుపారి హత్యల్లో నిందితుడు ఘటన స్థలంలో దొరకడం లేదా సిసి పుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలు ఉంటే తప్ప కేసును ఒక కొలిక్కి తీసుకురావడం కష్టమే. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ హత్యలు చాలా జరిగాయి. కానీ ఒక రాజకీయ నాయకున్ని సుపారి ఇచ్చి హత్య చేయించడమన్నది సంచలనమే గాక ఇప్పటి వరకు దర్యాప్తులో జాప్యం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకున్న హత్యలకు సంబంధించి పోలీసులు పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఛేదించిన విషయం విధితమే. కానీ రామారావు హత్య కేసులో ఆ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎందుకు ఉపయోగపడలేదు అన్నది కూడా ఒక ప్రశ్నగా మారింది. మొత్తంగా రాజకీయ పార్టీలు మొదలు సామాన్యులు సైతం పోలీస్ శాఖ వైపు వేలేత్తి చూపేలా చేసిన ఈ హత్య కేసు దర్యాప్తు ముగిసి నిందితులను అదుపులోకి తీసుకునే వరకు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగానే మిగులుతుంది.

# రీల్

## చిరంజీవి –వెంకటేష్ పాట షూటింగ్ పూర్తి



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి, వెంకటేష్ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఫ్యాన్స్‌కి బిగ్గెస్ట్ ట్రీట్ కానుంది. తాజాగా విక్టరీ వెంకటేష్ పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయింది. మన శంకర వర ప్రసాద్ గారు సినిమా కోసం నా భాగం ఈరోజుతో పూర్తయ్యింది. ఇది ఎంతో అద్భుతమైన అనుభవం! నాకు ఎంతో ఇష్టమైన మెగాస్టార్ చిరంజీవితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఎంతోకాలంగా ఎదురుచూశాను. ఆ అవకాశాన్ని ఈ ప్రత్యేకమైన సినిమాతో ఇచ్చినందుకు డైరెక్టర్ అనిల్ రావిపూడికి హృదయపూర్వక ధన్యవాదాలు. మనం అందరం కలిసి 2026 సంక్రాంతిని థియేటర్స్‌లో ఘనంగా సెలబ్రేట్ చేద్దాం. అని వెంకటేష్ తన సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విక్టరీ వెంకటేష్ పోస్ట్‌కి మెగాస్టార్ చిరంజీవి రిప్లయ్ ఇస్తూ ఒక ప్రత్యేకమైన పోస్ట్ పెట్టారు. మై డియర్ వెంకీ. మై బ్రదర్ మనిద్దరం కలిసి పనిచేసిన ఈ పది రోజులు నాకు మెమరబుల్. నీతో గడిపిన ప్రతి క్షణం ఆనందంతో, ఎనర్జీతో నిండిపోయింది. 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రానికి నువ్వు ఇచ్చిన ప్రత్యేకమైన ప్రజెన్స్ అబ్బురపరిచింది. నీతో గడిపిన ప్రతి క్షణం ఎంతో ఆనందం కలిగించింది. విక్టరీ వెంకటేష్, మెగాస్టార్ చిరంజీవి పోస్టులుని కోట్ చేస్తూ తన ఆనందాన్ని తెలియజేస్తూ డైరెక్టర్ అనిల్ రావిపూడి పోస్ట్ పెట్టారు. కొన్ని కలలు మన మనసు లో సంవత్సరాల పాటు దాగి ఉంటాయి. అకస్మాత్తుగా సినిమా అలాంటి కలలను నిజం చేస్తుంది. మెగాస్టార్ చిరంజీవి గారు, విక్టరీ వెంకటేష్ గారితో పక్కపక్కన నిలబడి, కలిసి నవ్వుతూ, డ్యాన్స్ చేస్తూ, వారి ప్రత్యేకమైన చార్మ్‌తో మెరిసిన ఆ క్షణం నిజంగా మాటల్లో చెప్పలేనంత ఆనందం ఇచ్చింది. నా ప్రయాణంలో ఇది ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం తన పార్ట్‌ని పూర్తిచేసి, ఈ అందమైన కలను సాకారం చేసిన డియర్ వెంకీ సర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. చార్ట్ బస్టర్ ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌ని సంపాదించి ఇప్పటి కే ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి.ఆది నారాయణ సహ రచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. 2026 సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ ప్రేక్షకులు ముందుకు రానుంది.




## హారర్ థ్రిల్లర్ 'ఇషా' గ్లింప్స్ విడుదల




శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించనున్న ఈ హారర్ థ్రిల్లర్‌లో త్రిగున్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్, సిరి హన్మంత్, బబ్లూ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటించారు. హెచ్ వికెఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌లో పోతుల హేమా వెంకటేశ్వరరావు ఈ చిత్రానికి మద్దతు ఇస్తున్నారు. ఇషా వింత ప్రపంచంలోకి పాఠశాల పిల్లల బృందం దెయ్యం కథల గురించి చర్చించడంతో ప్రారంభమవుతుంది. తర్వాత కలతపెట్టే విజువల్స్ ఉద్విగ్నమైన సౌండ్స్‌ప్లే శ్రేణిలోకి ప్రవేశిస్తుంది. కథనం పాత్రల వెంటాడే అనుభవాలను ఒక పాడుబడిన ఇంటి చుట్టూ ఉన్న భయానక రహస్యాలను సూచించినట్లుగా, ఈ చిత్రం తీవ్రమైన సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుంది. ఇషా డిసెంబర్ 12న విడుదల కానుంది. కే.ఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణ, ఈ చిత్రం ఆర్.ఆర్ ధ్రువన్ సంగీతం, సినిమాటోగ్రాఫర్ సంతోష్ సనమోని రూపొందించిన విజువల్స్ అలరిస్తాయి. నిర్మాతలు బన్నీ వాస్ , వంశీ నందిపాటి ఈ సినిమాను థియేటర్ లో రిలీజ్ చేస్తున్నారు.



## 'పొమ్మంటే ' పాట ఆవిష్కరణ

హీరో నాగ శౌర్య యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' తో అలరించబోతున్నా రు. నూతన దర్శకుడు రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహించారు. శ్రీ వైష్ణవి ఫిలమ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించారు. ఇప్పటి వరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి, టీజర్ కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. సినిమాలోని పొమ్మంటే అనే ఎమోషనల్ పాటను విడుదల చేశారు. హారిస్ జయరాజ్ స్వరపరిచిన పొమ్మంటే, మెలోడీ, ఎమోషన్ ఆకట్టుకుంది. విడిపోవడం వల్ల కలిగే బాధను, తోబుట్టువుల అనుబంధాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. రచయిత చంద్రబోస్ మనసుకి హత్తుకునే సాహిత్యం రాశారు. గాయకులు విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ తమ వోకల్స్‌తో మరింత హార్ట్ టచ్చింగ్‌గా మలిచారు. ఈ పాటలో నాగ శౌర్య, శ్రీదేవి విజయ్ కుమార్ మిస్ అండర్ స్టాండింగ్ ద్వారా విడిపోయిన బ్రద ర్, సిస్టర్స్ గా కనిపించారు. వారి అద్భుతమైన పెర్ఫామెన్స్, అజయ్ ప్రజెన్స్ ట్రాక్ ఎమోషన్‌ని మరింత పెంచింది. ఇది తోబుట్టువుల ప్రేమకు మనసుని కదిలించే సాంగ్. రసూల్ ఎల్లోర్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వర రావు, ఆర్ట్ డైరెక్షన్ రామాంజనేయులు నిర్వహిస్తున్నారు. నాగ శౌర్య, విధి, సముద్రఖని, నరేష్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృులటలధ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివ న్నారాయణ నటిస్తున్నారు.

## హంటర్ చాప్టర్-1 ఆహా ఒటిటిలో స్ట్రీమింగ్



హీరో వైభవ్ రెడ్డి లీడ్ రోల్‌లో వచ్చిన మిస్టరీ థ్రిల్లర్ ది హంటర్ చాప్టర్ 1. రణం అరం తవరేల్ అనే తమిళ సినిమాను తెలుగులో ది హంటర్ చాప్టర్ 1 అనే టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమాకు షెరీఫ్ రచన, దర్శకత్వం వహించగా.. వైభవ్ రెడ్డి, నందితా శ్వేత, తాన్య హోప్ ప్రధాన పాత్రల్లో నటించారు. అర్రోల్ కొరెల్లి సంగీతం అందించగా, సినిమాటోగ్రఫీని బాలాజీ కె.రాజా చేపట్టారు. ఈ ఏడాది జూన్ నెలలో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్ ఇవ్వడమే గాక, అన్ని వర్గాల ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. సస్పెన్స్, థ్రిల్, హై టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిన ఈ చిత్రం ఓ గ్రిప్పింగ్ థ్రిల్లర్గా ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని అందించింది. ఇప్పుడీ సినిమాను ఒటిటిలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా ఆహా ఒటిటిలో స్ట్రీమింగ్ అవుతోంది. ఉత్కంఠభరితమైన కథనం, హృదయాన్ని కదిలించే సస్పెన్స్ మాత్రమే కాకుండా వెన్నులో వణుకు పుట్టించే సన్నివేశాలతో థియేటర్స్లో సత్తా చాటిన ఈ సినిమా ఇప్పుడు ఆహా ఒటిటిలో కూడా అదే హవా నడిపిస్తోంది. ఈ కథలో ఆది అనే దృఢసంకల్పం కలిగిన వ్యక్తిగా కనిపిస్తాడు వైభవ్ రెడ్డి. అతని గతంలో కొన్ని రహస్యాలు దాగి ఉంటాయి. ఈ పరిస్థితుల నడుమ వరుస హింసాత్మక సంఘటనలు నగరాన్ని కుదిపేస్తాయి. ఈ పరిణామాల్లో అనుకోకుండా అతను తప్పించుకోలేని చేజ్‌లో చిక్కుకుంటాడు. ఆపై ఈ కథ మొత్తం ప్రమాదం, రహస్యాలు, నైతిక సంఘర్షణలతో నిండిన ఉత్కంఠభరితమైన ఫేజ్ చుట్టూ తిరుగుతుంది. ఈ సినిమాలో వైభవ్ ఆకట్టుకునే నటన కనబర్చగా.. నందితా శ్వేత ఎమోషనల్ సీన్స్‌లో ఆకట్టుకుంది. అలాగే ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ అయింది. తాన్యా హోప్ ప్రభావవంతమైన పాత్ర తో ఈ మిస్టరీ థ్రిల్లర్లో తన మార్క్ చూపించింది. 121 నిమిషాల ఈ మూవీ థ్రిల్లర్, క్రైమ్ జానర్ సినిమాలు ఇష్టపడే ప్రతి ఒక్కరికీ పర్ఫెక్ట్ ఎడ్జ్ ఆఫ్ ది సీట్ అనుభూతి ఇస్తుందని చెప్పుకోవచ్చు.

## 'లైఫ్'తొలి షెడ్యూల్ పూర్తి

కుంభమేళా ఫేమ్ మోనాలిసా కథానాయికగా నటిస్తున్న చిత్రం లైఫ్. సాయిచరణ్ హీరోగా వెంగమాంబ క్రియేషనర్స్ బేనర్‌పై రూపొందుతున్న ఈ సినిమాకి శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అంజన్న నిర్మిస్తున్నారు . ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో షియాజీ షిండే, సీనియర్ నటుడు సురేష్, ఆమని, తులసి, రచ్చ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మురళీ మోహన్ రెడ్డి డిఒపిగా పని చేస్తున్నారు. సుకుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. బేబీ సురేష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.



## 'ఎం కోనె.. నెలరాజె' సాంగ్‌పై సింగర్‌ను వివరణ కోరిన దర్శకుడు



నేతాజి ప్రొడక్షన్స్, జిఎం ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ల మీద రిచర్డ్ రిషి హీరోగా సోల చక్రవర్తి నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ద్రౌపది 2'. ఈ మూవీని మోహన్. జి తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఈ సినిమా నుంచి 'ఎం కోనె.. నెలరాజె..' అనే పాటను విడుదల చేశారు. కాంచీపురం సంస్థానానికి చెందిన ద్రౌపది దేవి వివాహం కడవరాయ సంస్థానం నుంచి వీరసింహ కడవరాయన్‌తో జరుగుతుంది. అందులో హోయసాల రాజ్యానికి చెందిన మహారా జు వీర వల్లాల 3 (మూడవ వీర వల్లాలర్).. కడవరాయన్‌కు పట్టాభిషేకం చేసి పెళ్లి చేస్తారు. ఈ దంపతులు తల్లిదండ్రులయ్యే సందర్భంలో జరిగే సీమం తం వేడుకలో వీర వల్లాల మహారాజు కడవరాయన్‌కు ఓ బహుమతిని ఇస్తారు. ఈ సందర్భాన్ని సినిమాలో చిత్రీకరించిన సందర్భంలో వచ్చే పాటే 'ఎం కోనె.. నెలరాజె..' ఈ సాంగ్ ట్రాక్కు సంబంధించిన పాట పాడిన సింగర్ చిన్మయి శ్రీపాద చేసిన వ్యాఖ్యలకు నెటిజన్స్ నుంచి విమర్శలు వచ్చాయి. దీనిపై చిత్ర దర్శకుడు మోహన్.జి స్పందించారు. ఈ పాటను ఆలపించిన సింగర్ చిన్మయి.. పాట విడుదలైన కొద్దిసేపటి తర్వాత తన సోషల్ మీడియా ద్వారా ప్రజలకు క్షమాపణ చెప్పారు. రికార్డింగ్ సమయంలో ఈ సినిమా భావజాలం, దాని నేపథ్యం గురించి తాను తెలియకపోవటం వల్ల పాల్గొన్నానని, ప్రాజెక్ట్ గురించి ముందే తెలుసుకుని ఉంటే తాను ఇందులో ఇన్వాల్వ్ అయ్యేదాన్ని కాదని ఆమె వెల్లడించారు. చిన్మయి క్షమాపణ చెప్పటం దీనిపై చిత్ర దర్శకుడు మోహన్.జి స్పందించారు. ఈ పాటను పాడటానికి తాను పర్సనల్‌గా చిన్మయి అయితే బావుంటుందని ఆమెతో పాడించానని పేర్కొన్నారు. రికార్డింగ్ సమయంలో చిత్ర సంగీత దర్శకుడు జిబ్రాన్ అందుబాటులో లేకపోవటంతో తాను ట్రాక్కు సంబంధించిన విషయాలను మాత్రమే వివరించానని, సినిమా కాన్సెప్ట్ గురించి ఎలాంటి చర్చ జరగలేదని దర్శకుడు తెలియజేశారు. తనతో కానీ, సంగీత దర్శకుడితో కానీ మాట్లాడకుండా, ఎలాంటి వివరణ తీసుకోకుండా ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగించిదని చెప్పిన డైరెక్టర్. దీనిపై చిన్నయి వివరణ ఇవ్వాలని లేదా ట్వీట్లు తొలగించాలని కోరారు.

## అవినీతి రహిత టెండర్లు చేపట్టాలి

**మాజీ రైల్వే బోర్డు విజిలెన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ మల్లాడి**



ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వే శాఖలో టెండర్లు అవినీతి రహితంగా ఉండే లా చర్యలు తీసుకోవాలని మాజీ రైల్వే బోర్డు విజిలెన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ మ ల్లాడి పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో 'ఫోర్టిఫై' లెక్చర్ సిరీస్5 సమావేశం జరిగింది. టెండర్లు, కాంట్రాక్టుల్లో విజిలెన్స్ దృష్టికోణం అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారదర్శక టెండర్ ప్రక్రియ, కాంట్రాక్టుల అమల్లో నైతిక విలువల ప్రాధాన్యం గురించి నిపుణులు వివరించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తిగా మాజీ రైల్వే బోర్డు విజిలెన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ మల్లాడి పాల్గొని కీలక సూచనలు చేశారు. టెండర్ వ్యవస్థలో అవినీతి రహిత పద్ధతులు, నిర్ణయాల తీసుకునే సమయంలో జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన వ్యవహార శైలి గురించి ఆయన ప్రతిపాదనలు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, చీఫ్ గెస్ట్‌గా శ్రీవాస్తవ, అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్ గెస్ట్ ఆఫ్ హానర్‌గా హాజరై విజిలెన్స్ వ్యవస్థ బలోపేతంపై మాట్లాడారు. రైల్వేలో పారదర్శకత పెంపునకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

## ఆమోదయోగ్యంగా లేవు

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళేముందుగా పుతిన్ ఒక ప్రైవేటు ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ఫ్లోరిడాలో నేడు ఉక్రేన్ ప్రతినిధులతో విట్‌కాఫ్ భేటీ**

అమెరికా–ఉక్రేన్ ప్రతినిధులు ఫ్లోరిడాలో శుక్రవారం సమావేశమవుతారు. మాస్కోలో డిసెంబరు రెండో తేదీన పుతిన్‌తో సంభాషణల తర్వాత ట్రంప్ దూతలు స్టీవ్‌విట్‌కాఫ్, కుష్నెర్‌లతో ఉక్రేన్ జాతీయ భద్రతా మండలి అధిపతి రెస్టెమ్ ఉమరోవ్ ఈ చర్చల్లో పాల్గొంటారు. పుతిన్‌తో జరిపిన సంభాషణలసారాంశాన్ని విట్‌కాఫ్ ఆయనకు తెలియజేస్తారు. పుతిన్‌తో సంభాషణలకు ముందుగా కూడా ఉక్రేన్ నాయకులతో ఇదేవిధమైన సమావేశం ఫ్లోరిడాలో జరిగింది. మాస్కోలో జరిగిన చర్చల్లో సంభాషణల సారాంశాన్ని బహిర్గతం చేయకూడదని పుతిన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో ఉమరోవ్ ద్వారా ఈ సంభాషణల సందేశం జెలెన్స్కీకి చేరవేస్తారు. ఐదు గంటలసేపు పుతిన్–విట్‌కాఫ్ మధ్య సంభాషణలు జరిగాయి. ట్రంప్ ప్రణాళికలో కొన్ని అంశాలు తమకు ఆమోదయోగ్యంగా లేవని పుతిన్ చెప్పిన విషయం ఇప్పటికే బయటకు వచ్చింది. స్వయంగా పుతిన్ కూడా ఈ విషయం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. వివాదాస్పద ప్రాంతాలలో యుద్ధం ద్వారా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని, లేదా వారే ఆ ప్రాంతాలను ఖాళీ చేసి వెళ్ళిపోవాలని పుతిన్ చెప్పినట్లు రష్యాలో స్థానిక మీడియా వార్తలు ప్రచురించాయి.

## విమానయానంలో చైనా రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఎంయు 745 గురువారం తెల్లవారుజామున షాంఘైలోని పుడోంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దక్షిణ అమెరికాకు మొదటిసారి సుదీర్ఘ ప్రయాణ రాకపోకలు ప్రారంభించింది. ఈ విమానం సుదీర్ఘ ప్రయాణమార్గంలో మూడు ఖండాల మీదుగా ప్రయాణం చేస్తుంది. అతిపొడవైన ఈ విమానం ఉత్తరార్ధగోళం,దక్షిణార్ధగోళం దాటుకుని 20,000 కి.మీ ప్రయాణ చేస్తుంది. షాంఘైలో బయలుదేరిన ఈ విమాన ఏకబిగిన ప్రయాణంచేసి అంతిమంగా అర్జంటైనాలోని బ్యూనోస్ ఐర్స్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుంది. ఆక్లాండ్, న్యూజిలాండ్ మీదుగా ఈ విమానం బ్యూనోస్ ఐర్స్‌కు వెళుతుంది. వారానికి ఒకసారి ఈ విమానం షాంఘై నుండి బయలుదేరి అర్జెంటైనాకు వెళతుంది. గతంలో 30 గంటల ప్రయాణం ఉండగా, ఇప్పుడు 25 గంటలకే బ్యూనోస్‌ఐర్స్‌కు చేరుకుంటారు.

# ఎంతమందికైనా అభయం అందిస్తాం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**మెయిన్స్‌కు ఎంపికైన 50 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం**



ప్రజాపక్షం/ హైదరాబాద్ : రాష్ట్రం నుంచి సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైనా వారందరికి రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజాభవన్‌లో యుపిఎస్‌సి ఇంటర్వ్యూకు ఎంపికైన 50 మందికి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సివిల్ సర్వీసుల్లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని తపిస్తున్న అందరికి అభినందనలన్నారు. అపారమైన మేధస్సు ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఎంపిక కాలేకపోతున్నారన్న సమాచారం తెలుసుకొని ఆ ఇబ్బందులు తీర్చేందుకు సింగరేణి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని తీసుకువచ్చామన్నారు. మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష రూపాయలు ఆ తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు వివరించారు. ఔత్సాహికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తే పుస్తకాలు, ప్రయాణం, కోచింగ్ వంటి అవసరాలకు ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించి ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. మొదటిసారి 140 మంది మెయిన్స్‌కు ఎంపిక కాగా అందులో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరించారు. వారికి రెండు దశల్లోనూ లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. గత ఏడాది 20 మంది ఇంటర్వ్యూ కు వెళ్లగా అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఏడుగురికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ శుభాకాంక్షలు తెలియజేస్తుందని అన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ మంది సుమారు 202 మంది మెయిన్స్ కు ఎంపిక కాగా అందులో 50 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని, వచ్చేసారి ఈ సంఖ్య 100కు దాటి వెళ్లాలని ఆయన ఆకాక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన సింగరేణి బ్రాండ్ శాలువాతో పాటు సింగరేణి జ్ఞాపికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆవిష్కరించారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమాల సందర్భంగా సింగరేణి అభివృద్ధి, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాలన్న ఉద్దేశంతోనే వీటిని రూపొందించామని, ఇకపై సింగరేణి అధికారిక కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తామని సిఎండి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 16 ఏళ్ల జాప్యమా!

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని ధర్మాసనం యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై కేంద్ర ప్రభుత్వానికి, వికలాంగుల సాధికారతా విభాగానికి నోటీసులు జారీ చేసింది. 2009 నుండి ఇక్కడి ఒక రోహిణి కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న మాలిక్ సొంత కేసులో దీర్ఘకాలికంగా జాప్యాన్ని 'జాతీయ అవమానంగా' నిందించింది. 'న్యాయ వ్యవస్థను ఎంత అపహాస్యం చేయడం !. ఇది చాలా అవమానకరం. దేశ రాజ ధాని కూడా దీనిని హ్యాండిల్ చేయలేదంటే అప్పుడు ఇంకెవరు చేస్తారు? ఇది 'జాతీయ అవమానం' అని ధర్మాసనం చెప్పింది. ఈ విషయం ఎందుకు ము గియలేదో వివరిస్తూ పిల్‌లో దరఖాస్తు దాఖలు చేయాలని ప్రధాన న్యాయ మూర్తి మాలిక్‌ను కోరారు. కోర్టు స్వయంగా విచారణకు కూడా తీసుకోవ చ్చని ఆమెకు హామీ ఇచ్చారు. నాలుగు వారాలలోపు అన్ని హైకోర్టుల రిజిస్ట్రీ నుండి యాసిడ్ దాడి కేసు వివరాలను రాబట్టాలని ధర్మాసనం కోరింది. విచారణ సమయంలో బాధిత మహిళలు యాసిడ్ తాగవలసి వస్తున్నదని, తరచుగా కృత్రిమ దాణా గొ ట్టాల ద్వారా తీవ్రవైకల్యంతో బతికే దుస్థితి నెలకొందని మాలిక్ ఎత్తిచూపారు. యాసిడ్ దాడి బాధితులను వికలాంగులుగా పరిగణించి సంక్షేమ పథకాలు పొందేందుకు వికలాంగులుగా వర్గీకరించాలన్న ఆమె విజ్ఞప్తిపై ధర్మాసనం కేంద్రం స్పందననుకూడా కోరింది. ఈ విషయమై తగిన స్పందనతో తీసుకుంటామని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హామీ ఇచ్చారు. 'కుట్రదారులు ఇక్కడ చేసినట్లే క్రూరత్వాన్ని ఎదుర్కోవాలి' అని జోడించింది. యాసిడ్ దాడి బాధితులను వికలాంగుల హక్కుల చట్టం కింద వికలాంగుల నిర్వచనంలోకి అధికారికంగా చేర్చడానికి చట్టం ద్వారా లేదా ఒక ఆర్డినెన్స్ ద్వారా చట్టాన్ని సవరించే విషయాన్ని పరిశీలిం చాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కేంద్రాన్ని కోరారు. త్వరి తగతిన న్యాయం జరిగేలా యాసిడ్ దాడి కేసులను ప్రత్యేక కోర్టులు విచా రించడం ఉత్తమమని సిజెఐ చెప్పారు.

## ఎమ్మెల్యే నవీన్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు నవీన్ యాదవ్ గురువారం వచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నర్సింహ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవితో సమావేశమయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నవీన్ యాదవ్‌ను సిపిఐ నాయకులు శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించగా, తన విజయానికి సహకరించిన సిపిఐ నాయకులను శాలువా పుష్పగుచ్ఛాలతో నవీన్ యాదవ్ సన్మానించారు. ఎన్నికల అవగాహన కొనసాగింపులో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతునిచ్చామని, రాజకీయ లక్ష్యంతో తమ కర్తవ్యాన్ని పూర్తి చేశామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. నవీన్ యాదవ్ విజయానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ పార్టీ శ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడని అన్నారు. ఇటి.నర్సింహ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిపిఐ శ్రేణులు ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారని, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో వివరించామని గుర్తు చేశారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత స్థానికులకు ఎమ్మెల్యేగా అవకాశం దక్కిందన్నారు. 2018 ఎన్నికల్లో తనకు పోటీచేసే అవకాశం రాకుండా బిఆర్‌ఎస్ అడ్డుకున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నగర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర పాల్గొన్నారు.

## క్వాంటం ఎకానమీ లీడర్

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే రాష్ట్ర దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ క్వాంటం వ్యూహం ద్వారా క్వాంటం టెక్నాలజీకి ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను కలిగిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని డిప్యూటీ సిఎం తెలిపారు. గచ్చిబౌలిలో ట్రిబుల్ ఐటిలో గురువారం జరిగిన నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం, తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క , రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రసంగించారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ ప్రపంచాన్ని ఇతర సాంకేతికత కంటే వేగంగా అన్ని రంగాల్లోనూ మార్పు తీసుకు రాబోతుందన్నారు. గొప్ప భవిష్యత్తు కోరుకునే ఏ దేశానికైనా క్వాంటం వ్యూహం అవసరమన్నారు. దేశాల భవిష్యత్తు, వారి జాతీయ భద్రత, వారి ఆర్థిక పరిమాణం, అభివృద్ధి, అన్నింటినీ ఇది పెద్ద స్థాయిలో ప్రభావితం చేస్తుందన్నారు. జాతీయ మిషన్‌కు అనుసంధానంగా రూపొందించిన తెలంగాణ క్వాంటం వ్యూహం (టిక్యూస్), పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, విద్య, మౌలిక వసతులు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏకీకృత, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న లక్ష్యాలను సాధిస్తుంది అని డిప్యూటీ సిఎం వివరించారు. టిక్యూస్ ప్రారంభంతో పాటు, భారతదేశంలో అత్యంత ఆధునిక క్వాంటం ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలన్న తెలంగాణ రాష్ట్ర సంకల్పాన్ని ప్రపంచానికి ఈ వేదిక ద్వారా ప్రకటిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం కేవలం వ్యూహరచననే కాకుండా, అమలుకు రోడ్డు మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్నదన్నారు. బలమైన, లోతైన పరిశ్రమ, విద్యాసంస్థల భాగస్వామ్యాలను మేము ప్రోత్సహించబోతున్నాం అన్నారు. క్వాంటం టెక్నాలజీ తెలంగాణతో పాటు భారత ఆర్థిక వృద్ధికి కీలకాధారం కానుందని, ఇది అన్ని రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడానికి, నిలుపుకోవడానికి సహాయపడుతుందన్నారు. రాష్ట్ర పరిశోధన, ఆవిష్కరణ ప్రణాళికలకు ఇది అత్యంత కీలకం అని తెలిపారు. సమావేశంలో నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం, సభ్యులు డాక్టర్ వి.కె.సారస్వత్, దేబ్జాని ఘోష్, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, హైదరాబాద్ ఐఐటి, సిఆర్.రావు ఇనిస్టిట్యూట్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్) సంస్థల ప్రముఖులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com